# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | శుక్రవారం 27-9-2019 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :26 | సంచిక: 53 | పేజీలు 8 | వెల: రూ.1/-


## చాకచక్యంగా దొంగ అరెస్టు

హైదరాబాద్,సెప్టెంబర్26(ఆర్ఎన్ఎ): చిక్కడు, దొరకడు అన్నట్టుగా ప్రవర్తిస్తూ రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో తరుచూ దొంగతనం చేస్తూ ప్రజలను తీవ్ర భయభ్రాంతులకు గురిచేస్తున్న దొంగను ఎట్టకేలకు పోలీసులు గురువారం అరెస్టు చేశారు. అతడి నుంచి లక్ష రూపాయల నగదు, 17 తులాల బంగారం, ఒక కారును స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. కొన్ని నెలలుగా రాజేంద్రనగర్ పరిసర ప్రాంతాల్లో వరుస చోరీలు చేస్తున్న వ్యక్తిపై నిఘా ఉంచామనీ, అతడిని పట్టుకోవాలనే సవాలుతో రంగంలోకి దిగామనీ, ఎంత ప్రయత్నించినా అతడి జాడ తెలియలేదని ఆయన అన్నారు. ఈ రోజు అతడి కోసం గాలిస్తుండగా దొరికిపోయాడని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. దొంగను చాకచక్యంగా పట్టుకున్న పోలీసు సిబ్బందిని ఆయన అభినందించారు.

# ఇండోనేషియాలో భారీ భూకంపం

## పలు ప్రాంతాల్లో భవనాలు ధ్వంసం

జకార్తా,సెప్టెబర్26(ఆర్ఎన్ఎ): ఇండోనేషియాను మరోమారు భూకంపం వణికించింది. గురువారం ఉదయం భారీ భూకంపం సంభవించింది. మలూకు దీవుల్లో భూకంప తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 6.8గా నమోదు అయ్యింది. అయితే ఇప్పటి వరకు ఎటువంటి సునామీ హెచ్చరికలు జారీ చేయలేదు. కానీ పలు ప్రాంతాల్లో బిల్డింగ్‌లు ధ్వంసం అయ్యాయి. మలూకు ప్రావిన్సులోని అంబన్ నగరానికి సమీపంలో భూకంప కేంద్రం నమోదైంది. ప్రాణనష్టం జరిగినట్లు ఇప్పటి వరకు సమాచారం లేదు. ఈ ప్రాంతంలో గతంలోనూ అనేకసార్లు బలమైన ప్రకంపనలు వచ్చాయి. స్థానికులు ఇండ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. పసిఫిక్ రింగ్ ఆఫ్ ఫైర్ జోన్‌లో ఇండోనేషియా ఉన్న విషయం తెలిసిందే. దాంతో ఈ ప్రాంతంలో ఎక్కువగా భూకంపాలు వస్తుంటాయి. గత ఏడాది సులవేశి దీవుల్లో సుమారు 7.5 తీవ్రతతో భూకంపం వచ్చిన విషయం తెలిసిందే. ఆ భూకంపంలో సుమారు 4300 మంది చనిపోయారు. 2004లో సుమత్రా దీవుల్లో వచ్చిన భూకంపం వల్ల భారీ సునామీ మహా విధ్వంసం సృష్టించిన విషయం కూడా తెలిసిందే. గుర్తించారు. అయితే భారీగా ఆస్తినష్టం జరిగిందని, ప్రాణనష్టంపై ఆరా తీస్తున్నామని అధికారులు తెలిపారు. భూకంపం రావడంతో భవనాలు కుప్పకూలాయి. ఇండోనేషియాలో భూకంపం రావడం పరిపాటిగా మారింది. గతంలో అనేకసార్లు భూమి కంపించింది. దీంతో ఎంతో ప్రాణ, ఆస్తి నష్టం సంభవించిన సంగతి తెలిసిందే. 2004, 2018లో వచ్చిన భూకంపం కారణంగా భారీ ప్రాణ నష్టం జరిగింది. భూకంపం అనగానే ప్రజలు గజగజ వణికిపోతుంటారు. సునామీ వస్తుందోమనన్న భయం వారిలో నెలకొంటుంది. అయితే..ఈసారి వచ్చిన భూకంపం తీవ్రత ఎక్కువగా ఉన్నా సునామీకి అవకాశం లేదని వాతావరణ శాఖ స్పష్టం చేయడంతో ప్రజలు ఊపిరిపీ ల్చుకున్నారు. మరోవైపు భూకంపం దాటికి కుప్పకూలి ఇళ్ల శకలాలను తొలగించే పనిలో అక్కడి అధికారులు నిమగ్నమయ్యారు. వీరికింద ఎవరైనా చిక్కుకొని ఉంటారా అనేది తెలియాల్సి ఉంది. ఇప్పటికే సహాయక చర్యలు ముమ్మరం చేసిన వారు భూకంపం దాటికి గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రులకు తరలించారు.

## అక్టోబర్ 3 నుంచి 11వరకు హైకోర్టు సెలవులు

హైదరాబాద్, సెప్టెంబర్26 (ఆర్ఎన్ఎ) : దసరాపండుగ సందర్భంగా అక్టోబర్ 3 నుంచి 11వ తేదీ వరకు హైకోర్టుకు సెలవులు ప్రకటిస్తూ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. చీఫ్ జస్టిస్ ఆదేశాల మేరకు అత్యవసర కేసుల విచారణకు సెలవుకాల ధర్మాసనాలను ఏర్పాటుచేశారు. జస్టిస్ రాజశేఖర్‌రెడ్డి, జస్టిస్ అభిషేక్‌రెడ్డితో కూడిన ద్విసభ్య ధర్మాసనం, జస్టిస్ అమర్‌నాథ్‌గౌడ్ నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం అత్యవసర కేసుల విచారణను చేపట్టనున్నాయి.



రంగారెడ్డి జిల్లా మంచాల మండల కేంద్రంలో గురువారం పర్యటించిన పంచాయతీరాజ్ శాఖామంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు. చిత్రంలో మంత్రి సబితా ఇంద్రారెడ్డి.

చంద్రయాన్-2

# విక్రమ్‌తో సంబంధాలు తెగిపోవడంపై జాతీయ కమిటీ విశ్లేషణ

బెంగళూరు,సెప్టెంబర్26(ఆర్ఎన్ఎ): ల్యాండర్ 'విక్రమ్'తో సంబంధాలు తెగిపోయినా తమకు ఎలాంటి సంకేతాలు రాలేదని, ఆర్బిటర్ మాత్రం బాగానే పనిచేస్తోందని ఇస్రో ఛైర్మన్ శివన్ వెల్లడించారు. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన చంద్రయాన్ -2 ఆర్బిటర్ చాలా బాగా పనిచేస్తోందని అన్నారు. అసలు 'విక్రమ్' నుంచి సంబంధాలు ఎందుకు తెగిపోయాయా? తప్పులేమైనా జరిగాయా? అనే అంశంపై జాతీయ స్థాయి కమిటీ విశ్లేషిస్తోందన్నారు. ఆ కమిటీ నివేదిక సమర్పించిన తర్వాత భవిష్యత్తు కార్యాచరణ చేపట్టే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతానికైతే తమ తదుపరి ప్రణాళికపై పని చేస్తున్నామని చెప్పారు. తదుపరి ప్రయోగానికి అవసరమైన చర్యలు తీసుకోవడంపై దృష్టిపెట్టి పనిచేస్తున్నామన్నారు.

ఇస్రో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన చంద్రయాన్ 2 ప్రయోగం 98శాతం విజయవంతమైందని ఇటీవల శివన్ వెల్లడించిన విషయం తెలిసిందే. తమ తదుపరి లక్ష్యం 'గగన్‌యాన్ మిషన్' అని ఆయన ప్రకటించారు. ఇస్రో చరిత్రలో గగన్ యాన్ మరో ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు కానుంది. 2022 నాటికి భారత వ్యోమగాములను అంతరిక్షంలోకి పంపడమే ఇస్రో లక్ష్యంగా పెట్టుకుందని, సాయుధ బలగాల్లో ఫ్లయింగ్ అనుభవం ఉన్న టెస్ట్ పైలట్లను వ్యోమగాములుగా పంపాలని భావిస్తోంది.

## వచ్చే నెల 24 నుంచి ఎస్సై శిక్షణా తరగతులు

హైదరాబాద్,సెప్టెంబర్26(ఆర్ఎన్ఎ): ఎస్సైల శిక్షణకు కసరత్తు పూర్తయింది. తెలంగాణ రాష్ట్ర పోలీస్ అకాడమీలో వచ్చే నెల 24వ తేదీనుంచి సివిల్ ఎస్సైలకు శిక్షణ తరగతులు ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే తుదిరాతపరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు మెడికల్ పరీక్షలు, ఎస్బీ ఎంక్వైరీ సైతం దాదాపు పూర్తయింది. ఎంపిక ప్రకియలో చివరి అంకమైన ఎస్బీ ఎంక్వైరీ 96శాతం పూర్తయింది. మరో నాలుగు శాతంలో ఇతర ప్రాంతాల్లో విద్య, ఉద్యోగరీత్యా ఉన్న అభ్యర్థులకు సంబంధించి పక్రియ తుదిదశకు చేరింది. ఎస్బీ ఎంక్వైరీ పూర్తయిన వారందరికీ సెలక్షన్ లెటర్లు సైతం పంపినట్టు టీఎస్ఎల్పీఆర్బీ ఛైర్మన్ వీవీ శ్రీనివాసరావు తెలిపారు.

అన్ని విభాగాల్లో కలిపి 1,272 మంది అభ్యర్థులకుగాను ఇప్పటివరకు 1,180 మందికి సెలక్షన్ లెటర్లు పంపినట్టు చెప్పారు. టీఎస్ఎస్పీ రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్లకు డిసెంబర్ 24 నుంచి శిక్షణ తరగతులు ప్రారంభం కానున్నాయి. జనవరి 24 నుంచి ఏఆర్ ఆర్ ఎస్సైలకు, కమ్యూనికేషన్ ఎస్సైలకు శిక్షణ తరగతులు ప్రారంభించనున్నారు. సివిల్ ఎస్సైలకు శిక్షణకాలం 12 నెలలు, టీఎస్ఎస్పీ ఆర్ ఎస్సైలకు 10 నెలలు, ఏఆర్ ఆర్, కమ్యూనికేషన్ ఎస్సైలకు తొమ్మిది నెలలపాటు శిక్షణ ఉంటుంది. అందుకు అనుగుణంగా వచ్చే నెల 24 నుంచి సివిల్ ఎస్సైల శిక్షణ ప్రాంభించనున్నారు. ఎస్సైలందరికీ సరిపడా వసతులు ఉన్నందున అందరికీ టీఎస్పీఏలోనే శిక్షణ ఇవ్వనున్నారు.

# పల్లెల రూపురేఖలు మారాలి

- అభివృద్ధిలో గ్రామస్తులందరూ భాగస్వాములుకావాలి
- మంచాలకు కోటి రూపాయలు మంజూరు చేస్తా
- పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

రంగారెడ్డి, సెప్టెంబర్26(ఆర్ఎన్ఎ) : గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధిపర్చి, ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని, దీనిలో భాగంగానే 30రోజుల గ్రామ ప్రణాళిక కార్యక్రమాన్ని సీఎం కేసీఆర్ అమలు చేస్తున్నారని పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. గురువారం విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డితో కలిసి మంచాల మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 30 రోజుల గ్రామ ప్రణాళికలో భాగంగా ఆయన గ్రామంలోని రోడ్లు, మురికి కాలువలు, పాత భవనాలను పరిశీలించారు. అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. చెత్త, మురికి కాలువలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని మంత్రి అన్నారు. మంచాల అభివృద్ధికి కృషి చేస్తానని ఈ సందర్భంగా మంత్రి హామీ ఇచ్చారు. అందుకుగానూ మంచాల మండల కేంద్రానికి కోటి రూపాయల నిధులు మంజూరు చేస్తానని మంత్రి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈకార్యక్రమంతో గ్రామాల రూపురేఖలు మారుతాయని, గ్రామస్తులంతా ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని, ఐక్యంగా గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. దేశానికే గ్రామాలు పట్టుకొమ్మలన్న గాంధీ ఆశయాలను నెరవేర్చేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని, గ్రామాలకు ప్రత్యేక నిధులు కేటాయించి తెలంగాణ పల్లెలను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దేలా కేసీఆర్ నిర్ణయించారని అన్నారు. ఈ సందర్భంలో స్థానిక ఎమ్మెల్యే, జెడ్పీ చైర్ పర్సన్ తీగల అనిత, స్థానిక ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు ఉన్నారు.

## రాజ్యసభ స్థానాలకు అక్టోబర్ 16న ఎన్నిక

న్యూఢిల్లీ,సెప్టెంబర్26 (ఆర్ఎన్ఎ): రెండు రాష్ట్రాల్లో ఇటీవల ఖాళీ అయిన రెండు రాజ్యసభ స్థానాలకు ఉప ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం గురువారం ప్రకటించింది. ఉత్తరప్రదేశ్, బీహార్లలో రెండు స్థానాలు ఖాళీ అయిన విషయం తెలిసిందే. ఈ స్థానాలకు అక్టోబర్ 16వ తేదీన ఎన్నికలు నిర్వహించనున్నారు. 2018లో అరుణ్ జైట్లీ ఉత్తరప్రదేశ్ నుంచి రాజ్యసభకు ఎంపికయ్యారు. ఈ ఏడాది ఆగస్టు 24వ తేదీన జైట్లీ తుదిశ్వాస విడిచిన సంగతి తెలిసిందే. ఇక సుప్రీంకోర్టు న్యాయవాది, మాజీ కేంద్ర మంత్రి రాంజెత్మలానీ బీహార్ నుంచి రాజ్యసభకు ఎన్నిక కాగా, ఈ నెల 8వ తేదీన కన్నుమూశారు. ఈ క్రమంలో ఈ రెండు రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నారు.

# పుణెలో కుండపోత వర్షం, 10 మంది మృతి

పుణె,సెప్టెంబర్26(ఆర్ఎన్ఎ): భారీ వర్షాలతో పుణె అతలాకుతలం అవుతోంది. పుణె, పురందర్, బారామతి, బోర్, హవేలీ పట్టణాల్లో కుండపోత వర్షం కురుస్తోంది. భారీ వర్షాలకు పుణె వ్యాప్తంగా దాదాపు పదిమందికి పైగా మృతి చెందారు. వందల జంతువులు, వాహనాలు వరదల్లో కొట్టుకుపోయాయి. సహకార్ నగర్ లో గోడ కూలిన ఘటనలో ఆరుగురు మృతి చెందగా..శిధిలాల కింద చిక్కుకున్న మరో ముగ్గురి కోసం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. సినాగద్ కాలువలో కొట్టుకువచ్చిన కారులోంచి డెడ్ బాడీని స్వాధీనం చేసుకున్నారు పోలీసులు. ఇటు ఖేద్ ప్రాంతంలో వరదలకు ఐదుగురు కొట్టుకుపోయారు. మూడు మృతదేహాలను వెలిసి తీసిన పోలీసులు మరో ఇద్దరి కోసం గాలిస్తున్నారు. ఇక కట్రాజ్ కట్ట తెగి దాదాపు 200ఇళ్లు నీట మునిగాయి. దీంతో వరద బాధిత ప్రాంతాల్లో ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సహాయక చర్యలను కొనసాగిస్తున్నాయి. ఇక ముందస్తుగా పుణె కలెక్టర్ స్కూళ్లకు, కాలేజీలకు సెలవు ప్రకటించారు.

## గోడ కూలి ఐదుగురు మృతి

ముంబయి,సెప్టెంబర్26 (ఆర్ఎన్ఎ): మహారాష్ట్రలోని పుణెళి ప్రాంతంలో శహకర్ నగర్ లో గోడ కూలిపోవడంతో ఐదుగురు మృతి చెందారు. ఈ ఘటనలో మరో ఇద్దరు గాయపడినట్లు సమాచారం. చనిపోయిన వారిలో ఇద్దరు మహిళలు, ఒక చిన్నపిల్లవాడు ఉన్నట్టు సమాచారం. ప్రభుత్వాధికారులు, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. పుణెళి ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తుండడంతో రోడ్లన్నీ జలమయ్యాయి. దీంతో ఆ ప్రాంతమంతా జలాశయంలాగా మారింది. పురాతన గృహాలలో ఉన్న నివసించొద్దని అధికారులు ప్రజలకు సూచిస్తున్నారు. పుణె కలెక్టర్ స్కూళ్లకు, కాలేజీలకు సెలవు ప్రకటించారు. ఈ భారీ వర్షం తాకిడికి వందల జంతువులు చనిపోయినట్టు సమాచారం.

## టెంత్ ఫీజు గడువు అక్టోబర్ 26

హైదరాబాద్,సెప్టెంబర్26 (ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో మార్చి 2020లో నిర్వహించే పదో తరగతి పరీక్షల ఫీజు చెల్లించడానికి అక్టోబర్ 29 వరకు గడువు విధించినట్లు ఎస్సెస్సీ బోర్డు డైరెక్టర్ బీ సుధాకర్ తెలిపారు. రూ.50 ఆలస్య రుసుం తో నవంబర్ 13 వరకు, రూ.200 ఆలస్య రుసుంతో 27 వరకు, రూ.500 ఆలస్య రుసుంతో డిసెంబర్ 11 వరకు గడువు విధించామని చెప్పారు. ఆ తర్వాత ఫీజు చెల్లింపునకు గడువు పొడిగించే అవకాశం లేదని తెలిపారు. నామినల్ రోల్స్‌ను ఆన్‌లైన్ ద్వారా పంపాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. రెగ్యులర్ విద్యార్థులు పదో తరగతి పరీక్ష ఫీజు అన్ని సబ్జెక్టులకు రూ. 125, మూడు సబ్జెక్టులకు రూ.110, మూడుకంటే ఎక్కువ సబ్జెక్టులకు రూ. 125, ఒకేషనల్ విద్యార్థులు సాధారణ పరీక్ష ఫీజుకంటే రూ.60 అదనంగా చెల్లించాలని పేర్కొన్నారు.

## చరిత్రలో నేటినిజం



తే॥ జీవనమును - జాతిజనుల
సేవలతో నింపినట్టి చిద్విలాసుని - నం
భావించుచు స్మరించెద
పావనుడగు "కోట్లవిజయ భాస్కరరెడ్డిన్!!

( సెప్టెంబర్ 27 కోట్ల విజయభాస్కరరెడ్డి పుణ్యతిథి..)

-రాధశ్రీ
సెల్: 9494481210




ఆహ్వానము

నసీరుద్దీన్ కవిత్వం
'నడిచి వచ్చిన సూర్యుడు'
పుస్తకావిష్కరణ సభ




తేది : 05-10-2019 శనివారం సా॥ 5 గంటలకు
వేదిక : ఫిలింభవన్, కరీంనగర్.

సభాధ్యక్షులు : కందుకూరి అంజయ్య, అధ్యక్షులు, తెరవే, కరీంనగర్.
ముఖ్య అతిథి : వి.ఆర్. విద్యార్థి, కవి, రచయిత, కాళోజీ ఫౌండేషన్, వరంగల్.
విశిష్ట అతిథి : గాజోజు నాగభూషణం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రచయితల వేదిక
గౌరవ అతిథి : ఎస్.కె. లాయక్ అలీ వార్సీ, ప్రిన్సిపాల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, మంథని
పుస్తక పరిచయం : కూకట్ల తిరుపతి, కవి, రచయిత
వక్తలు : బూర్ల వేంకటేశ్వర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హుస్నాబాద్
: సి.వి. కుమార్, ప్రధాన కార్యదర్శి, తెరవే, కరీంనగర్.
: తోట నిర్మలారాణి, ఉపాధ్యక్షులు, తెరవే, కరీంనగర్.
: విలాసాగరం రవీందర్, ఉపాధ్యక్షులు, తెరవే, కరీంనగర్.
సమన్వయం : దామెరకుంట శంకరయ్య ఉపాధ్యక్షులు, తెరవే, కరీంనగర్.
: పెనుగొండ బసవేశ్వర్ ఉపాధ్యక్షులు, తెరవే, కరీంనగర్.

మేరుగు ప్రవీణ్
ప్రచార కార్యదర్శి, తెరవే, కరీంనగర్.
9989715531

తెలంగాణ రచయితల వేదిక, కరీంనగర్ జిల్లా

# అంతా స్వయంకృతాపరాధమే.!!

నేటినిజం
శుక్రవారం 27-9-2019

జంతువులకు, పక్షులకు లేని గుణం మనుషులకు ఆ భగవంతుడు ప్రసాదించాడు. అవే ఏడవటం, నవ్వటం. వాటి ద్వారా మన బాధను, సంతోషాన్ని వ్యక్తీకరించుకోవచ్చు. కానీ వాటి మనసులో ఏ భావం ఉందో కూడా తెలియక పాపం వాటంతట అవే కుమిలిపోతుంటాయి. మనిషికి బుద్ధి, జ్ఞానం అదనంగా సంపాదించుకుని జీవితాన్ని సక్రమమైన మార్గంలోకి కాకుండా వక్రమార్గంలో నడిపించుకొనడం దురదృష్టం. భగవంతుడిచ్చిన వరాలను దుర్వినియోగం చేస్తూ ఎక్కడైనా బెడిసికొడితే తిరిగి ఆ దేవుడినే తన కష్టాలు తీర్చమని మొరపెట్టుకుంటారు. చేసిన తప్పులు మరచి తనను రక్షించమని ఆ దైవానికే ప్రార్థించుకుంటాం. మనిషికి ఎదురవుతున్న ఈతి బాధల్లో చాలావరకు స్వయంకృతాపరాధమే! తాను చేసిన పాపఫలితాలే! ఇదంతా కర్మఫలమనీ, పూర్వజన్మ సుకృతమని సరిపెట్టుకుంటూ లౌక్యంగా తన బాధల్ని, ఆవేదనల్ని మరొకరి ఖాతాలో పడేసి కాలం గడిపేస్తూ ఉంటారు. తనలో దాగిఉన్న శక్తి యుక్తుల్ని మరచిపోయి చేసిన దుష్కృత్యాలు పక్కన పడేసి పరిష్కారాలకోసం దైవం వెంటపడుతున్నారు. స్పందన కరవైందని నిరాశకు గురి అవుతుంటారు. మనిషిని ఎంతో ఉన్నతంగా తీర్చిదిద్దిన దేవుడే తన పాపాలకు మూలకారణమని గుడ్డిగా నమ్ముతున్నారు. మనిషిని ఎంతో ఉన్నతంగా తీర్చిదిద్దిన దేవుడే తన పాపాలకు మూలకారణమని గుడ్డిగా నమ్ముతున్నాడు. పరిహారం కోసం పూజలు, వ్రతాలు ఉపవాసాల్లాంటివి చేస్తూ ఉపశమనం పొందుతున్నాడు. జీవిత కాలంలో ఏదో అద్భుతం జరుగుతుందని ఆశపడుతున్నాడు. ఇదంతా తెలివిలేనితనం కాదా?

మానవ జన్మ దుర్లభం అని తెలిసీ బుద్ధి, జ్ఞానాలను తగిన రీతిలో వినియోగించుకోలేక కష్టాల కడలిని ధైర్యంగా ఈదలేక నిత్యం ఎంతో నిరాశానిస్పృహలతో సతమతమవుతున్నాడు. తీవ్రమయిన ఒత్తిడికి లోనవుతున్నాడు. ఆ ఒత్తిడికి కారణాలు అన్వేషించడం మానేసి మనశ్శాంతి ప్రసాదించమని దేవుడిని వేడుకుంటున్నాడు. తాను చేసిన తప్పులకు ఆ దేవునికి ఏమి సంబంధం? అవన్నీ దైవానికి చెప్పే చేసాడా? చేయాల్సిందంతా చేసి చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లు ఆయనకు నివేదిస్తే ప్రయోజనం ఏమి ఉంటుంది? కర్మ చేసేందుకు ఇదెంతవరకు సమంజసమని దేవుడిచ్చిన బుద్ధిని ఉపయోగించాలి. జ్ఞానం ఉంది కాబట్టి ఉచితం అనుచితం తెలుసుకోవాలి. తప్పు చేయకుండా జాగ్రత్తలు వహించాలి. ఫలితం ఎలా ఉంటుంది అనేది ఊహించగలగాలి. అపుడింక దేవున్ని శరణువేడే అవసరం రాదు. ఏది మంచి, ఏది చెడు అని తెలుసుకునే ఇంగితజ్ఞానం ప్రతి ఒక్కరికీ ఉంటుంది. స్వార్థంతో చాలా సార్లు చెడువైపే మనం ప్రయాణించే సంఘటలు ఎక్కువగా ఉంటాయి. అంతా సవ్యంగా సాగితే ఇదంతా మన తెలివి అని, లేకుంటే మన రోజులు బాగోలేవని దైవంపై నెట్టేస్తాం. అంతర్గత శక్తులపై అవగాహన పెంచుకుని అనునిత్యం అత్యంత జాగరూకతతో అడుగులు వేసిన మనిషికి అపజయం కలుగకుండా జీవన సాఫల్యం సిద్ధిస్తుంది. ఇది అందరికీ అర్థం అవ్వాలంటే ఎంత కాలం పడుతుందో కూడా వేచి ఉండాలి!!

# దేశంలో ఏదో జరగబోతోందా ?

హైదరాబాద్, సెప్టెంబర్ 25: భారత దేశంలో ఏదో జరగబోతోందా? భారీ విధ్వంసానికి పథక రచన జరిగిందా? ఇప్పటికే ముష్కర మూకలు దేశంలోకి ఎంటరయ్యాయా? ఈ ప్రశ్నలన్నిటికి నిఘా వర్గాల నుంచి అవుననే సమాధానమే వస్తోంది. అందుతున్న వార్తలు కూడా అదే అంటున్నాయి. అయితే ఏం జరగబోతోంది?

జమ్మూ కశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370ను కేంద్ర రద్దుచేసిన తర్వాత దాయాది పాకిస్తాన్ భారత్‌పై మరింత ద్వేషాన్ని పెంచుకుంది. భారత్ చర్యలను వ్యతిరేకిస్తూ పలు అంతర్జాతీయ వేదికలపై గగ్గోలు పెడుతోంది. సరిహద్దుల్లో ఉగ్రవాద శిబిరాలను మళ్లీ పునరుద్ధరించింది. సర్జికల్ స్ట్రయిక్స్‌లో ధ్వంసమైన బాలాకోట్ ఉగ్రవాద శిబిరం ఒకటి. రెండు రోజుల క్రితం మన ఆర్మీ చీఫ్ స్వయంగా ఈ విషయం చెప్పారు. ఇదంతా ఎందుకు ? పుల్వామా తరహా దాడులా అంటే కాదు. ఏకంగా ప్రధాని నరేంద్ర మోడీ, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోవల్‌ను జైషే మహ్మద్ ఉగ్రవాదులు టార్గెట్ చేశారు. దేశంలో భారీగా కల్లోలం సృష్టించటమే వారి లక్ష్యం. ఈ విషయాన్ని నిఘా వర్గాలు పసిగట్టాయి. జైషే మహ్మద్‌తో కలిసి పాక్ గూఢచారి సంస్థ ఐఎస్ఐ భారీ విధ్వంసానికి కుట్రపన్నినట్టు ఇంటిలిజెన్స్ విభాగం హెచ్చరించింది. జైషే మహ్మద్ ఉగ్రవాది షంషేర్ వనీ, మరో ఉగ్రవాదికి మధ్య జరిగిన లిఖితపూర్వక సంభాషణలను ఓ విదేశీ నిఘా సంస్థ గుర్తించి మనకు చేరవేసింది. జమ్మూ, అమృత్‌సర్, పఠాన్‌కోట్, జైపూర్, గాంధీనగర్, కాన్పూర్, లక్నో సహా దేశంలోని మొత్తం 30 నగరాలు ఉగ్రవాదుల టార్గెట్‌లో ఉన్నాయని నిఘా సంస్థలు హెచ్చరిస్తున్నాయి.

జమ్మూ కశ్మీర్‌లోని కీలక తమ అనుచరులను సైన్యం మట్టుబెట్టడం సహా బాలాకోట్ ఉగ్రవాద శిబిరంపై వైమానిక దాడులతో జైషే మహ్మద్‌కు పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. వీటికి తోడు ఆర్టికల్ 370 రద్దుతో ఆ సంస్థ మరింత రగిలిపోతోంది. అందుకు ప్రతీకారంగా భారీ దాడులకు వ్యూహరచన చేసినట్టు తెలుస్తోంది.

మరోవైపు, ఈ సారి కూడా దాడులకు ఉగ్రవాదులు ముందుగా ఎంచుకునేది హైదరాబాద్ నగరాన్నేనా అనుమానాలు కూడా వస్తున్నాయి. ఈ నేపథ్యంలో హైదరాబాద్ పోలీసులు అప్రమత్తమయ్యారు. నిఘా పెంచారు. అనుమనాస్పద ప్రాంతాలపై కన్నేసి ఉంచారు. తనిఖీలు నిర్వహిస్తున్నారు. అనుమానితుల్ని అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే హైదరాబాద్‌లో అడుగుపెట్టిన ఉగ్రవాదుల్ని ఆర్మీ అధికారులు పట్టుకున్నట్లు సమాచారం. ఇంకా చాలా మంది స్లీపర్ సెల్స్‌లా ఉండొచ్చన్న అనుమానం కూడా ఉంది.

భారత్‌తో మూఖా ముఖి తలపడే సత్త లేని పాకిస్తాన్ ఉగ్రదాడులు చేయించేందుకు కుట్రలు పన్నుతోంది. ఇటీవల ఆ దేశ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ సరిహద్దుల్లో ఉగ్రవాదులు రెచ్చిపోతారనటం ప్రమాదాన్ని సూచిస్తోంది. ఇండియాలో ప్రవేశించేందుకు ఉగ్రవాదులు అన్ని రకాలుగా ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే చాలా మంది చొరబడి ఉండొచ్చు. మరోవైపు భారత్ లో మారణహోమం సృష్టించడానికి 30 మందికి పైగా ఆత్మాహూతి దళ సభ్యులను జైషే మహమ్మద్ సంస్థ సిద్ధం చేసినట్లు కేంద్రానికి సమాచారం ఉంది. ఏ క్షణంలోనైనా వారు సరిహద్దులను దాటుకుని భారత గడ్డపై అడుగు పెట్టే అవకాశాలను కొట్టిపారేయలేం.

కశ్మీర్ నుంచి రాజస్థాన్ గుజరాత్ లోని సర్ క్రీక్ ప్రాంతం వరకు సరిహద్దుల్లో పరిస్థితి ఉద్రిక్తంగా ఉంది.

బార్డర్‌లో పాక్ వైపున దాదాపు 500 మంది ఉగ్రవాదులు తిష్ట వేశారు. దీంతో ఆర్మీ సరిహద్దు భద్రతను మరింత కట్టుదిట్టం చేసింది. ఎప్పుడైనా, ఏదైనా, ఎలాంటి పరిస్థితులైనా తలెత్తడానికి గల అవకాశాలున్నాయి. ఈ విషయాలు ఆర్మీ చీఫ్ జనరల్ బిపిన్ రావత్ స్వయంగా చెప్పటం పరిస్థితి ఏమిటో

అర్థమవుతోంది. ఈ సందర్భంలో కేవలం ఆర్మీ, పోలీసులే అప్రమత్తమైతే సరిపోదు.ప్రతి పౌరుడు అప్రమత్తంగా ఉండటం ఇప్పుడు ఎంతో అవసరం!!

## భయపెడుతున్న మెట్రో పగుళ్లు

హైదరాబాద్,సెప్టెంబర్26(ఆర్ఎన్ఎ): ఏళ్లకు ఏళ్లు కష్టపడి సంపాదించుకున్న నమ్మకం మట్టిపాలు కావటానికి ఒక్క సంఘన చాలు. ఆ ఒకే ఒక్క సంఘటన ఇప్పుడు మెట్రో పనితీరును అడుగడుగునా ప్రశ్నిస్తోంది. దుర్ఘటన జరిగి రెండు రోజులు గడస్తున్నా, నగరవాసులు మెట్రో ప్రాజెక్టు నాణ్యతపై ఇంకా చర్చించుకుంటున్నారు. నగరం నడి రోడ్డు మీద నిర్మించిన మెట్రోరైలు ప్రాజెక్టు మంచి ప్రయాణ సాధనం మాత్రమే కాదు, ఆధునిక నగరాభివృద్ధిలో ఒక అంతర్భాగం అంటూ ఎంతో గొప్పగా చెప్పారు. అలాంటి ప్రాజెక్టుపై అమీర్‌పేట మెట్రో స్టేషన్‌లో జరిగిన సంఘటన మాయని మచ్చగా మారింది. రోడ్డు మీదుగా నిర్మించిన మెట్రో స్టేషన్లు, పిల్లర్లు, వయాడక్ట్‌ల నాణ్యతపై అందరూ సందేహం వ్యక్తం చేస్తున్నారు. కారిడార్ల కింద నుంచి వెళ్తున్న వారు పైకి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎక్కడ పెచ్చులూడి మీద పడతాయో, ప్రాణం ఎక్కడ పోతుందోనన్న భయం నగరవాసుల్లో ఉంటోంది.

ప్రస్తుత ప్రాజెక్టును 72 కి.మీ మేర ప్రతిపాదించగా, ఇప్పటి వరకు 66కి.మీ మార్గాన్ని నిర్మించారు. ఈ మార్గమంతా 99 శాతం రోడ్డు మీదుగానే ఉంది. నగరంలో రాకపోకలు సాగించే ప్రజలంతా మెట్రో పిల్లర్లు, స్టేషన్ల కింద నుంచే రాకపోకలు సాగిస్తున్నారు. కారిడార్-1లో ఎల్‌బీనగర్ నుంచి మియాపూర్ వరకు 29 కి.మీ, కారిడార్-2లో జేబీఎస్ నుంచి ఎంజీబీఎస్ వరకు 9 కి.మీ, కారిడార్-3లో నాగోల్ నుంచి మైండ్ స్పేస్ జంక్షన్ వరకు సుమారు 28 కి.మీ మార్గం పూర్తిగా రోడ్ల మీదుగానే ఉంది. ఎక్కడా అండర్ గ్రౌండ్‌లో లేదు. ఎండైనా, వానైనా ప్రజలు వాటి కిందకు వెళ్లి నిల్చుంటున్నారు.

జూబ్లీహిల్స్ రోడ్డు నెంబరు 36 పెద్దమ్మ తల్లి దేవాలయం వద్ద ఉన్న మెట్రో స్టేషన్ పెచ్చులూడి ప్రమాదంగా మారింది. కొద్ది కొద్దిగా పెచ్చులు కింద పడుతున్నా యి. ఇప్పటి వరకు ఎవరికీ ఏమీ కాకపోయినా.. దీన్ని వల్ల ఎప్పటికైనా ప్రమాదం పొంచి ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

అలాగే మెట్రో కారిడార్-1లోని జేఎన్‌టీయూ, కేపీహెచ్‌బీకాలనీ, కూకట్‌పల్లి మెట్రోస్టేషన్లతో పాటు కారిడార్‌లోని వయాడక్ట్‌ల మధ్య ఉన్న జాయింట్‌ల వద్ద పగుళ్లు ఏర్పడ్డాయి. ఎర్రగడ్డలో స్టేషన్ కింద ఉన్న పిల్లర్ నంబరు ఎ947 పెచ్చులూడి కనిపిస్తున్నాయి. మెట్రో పిల్లర్ చుట్టూ నిర్మించిన సిమెంటు దిమ్మె పగిలిపోయింది. మెట్రో అధికారులు ఇప్పటికైనా కళ్లు తెరుస్తారో లేదో చూడాలి!!

## హుజూర్‌నగర్‌లో బీజేపీదే విజయం

### – కాంగ్రెస్, టీఆర్ఎసలవి మిలాఖత్ రాజకీయాలు
### – బీజేపీ అధికార ప్రతినిధి రఘునందన్

హైదరాబాద్, సెప్టెంబర్26(ఆర్ఎన్ఎ) : హుజూర్‌నగర్ ఉప ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయమని, మరోసారి బీజేపీ సత్తాఏంటో టీఆర్ఎస్‌కు రుచిచూపిస్తుందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రఘునందన్ రావు అన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్, టీఆర్ఎస్ మిలాఖత్ రాజకీయాలకు హుజూర్‌నగర్ ఉపఎన్నిక తెరలేపినట్లుగా కనిపిస్తోందని అన్నారు. కేసీఆర్ అసెంబ్లీ చివరి మూడు రోజులు సభను రాజకీయ సభగా మార్చారని విమర్శించారు. ఒక దశలో కాంగ్రెస్, టీఆర్ఎస్ కలిసి బీజేపీని ఎదుర్కోవాలని చేసిన ప్రకటన గమనిస్తే మిలాఖత్ రాజకీయాలు అర్థం అవుతున్నాయని పేర్కొన్నారు. హుజూర్ నగర్ ఎన్నికలలో టీఆర్ఎన్ గెలుపు సులువు కాదని ముఖ్యమంత్రికి అర్థం అయ్యిందని, అందుకే పరోక్షంగా ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఎన్ని ఎత్తుగడలు వేసినా హుజూర్ నగర్ ఎన్నికలలో బీజేపీ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా ప్రధాని మోదీ నిర్ణయాలతో బీజేపీకి మద్దతు పెరుగుతుందని అన్నారు. రాబోయే కాలంలో ఇక దేశంలో ప్రతిపక్ష పార్టీలకు స్థానం లేకుండా బీజేపీ ఎదుగుతుందని అన్నారు. రాష్ట్రంలో వచ్చే ఎన్నికల నాటికి బీజేపీ అధికారంలోకి రాబోతుందని రఘునందన్ జోస్యం చెప్పారు. బీజేపీ వైపు రాష్ట్ర ప్రజలు చూస్తున్నారని, ఇప్పటికే జిల్లాల వారిగా పెద్ద ఎత్తున ప్రజలు బీజేపీలో చేరుతున్నారని అన్నారు. హుజూర్ నగర్ ఉప ఎన్నికలతో రాష్ట్రంలో బీజేపీ హవా ప్రారంభమవుతుందని రఘునందన్ పేర్కొన్నారు.

## మోడీ, అమిత్‌షాలు బతికుండటం..

# కాంగ్రెస్‌కు ఇష్టంలేదు

### – గతంలో చేసిన పనులకు చిదంబరం మూల్యం చెల్లిస్తున్నాడు
### – సంచలన వ్యాఖ్యలు చేసిన యోగా గురు రామ్‌దేవ్

న్యూఢిల్లీ, సెప్టెంబర్26(ఆర్ఎన్ఎ) : మోడీ, అమిత్‌షాలు బతికుండటం కాంగ్రెస్ పార్టీ తాత్కాలిక అధ్యక్షురాలు సోనియా గాంధీ, ఆమె కుమారుడు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్ గాంధీలకు ఇష్టం లేదంటూ యోగా గురువు రామ్‌దేవ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. బుధవారం యుపిలోని నోయిడాలో ఒక కళాశాలలో జరిగిన కార్యక్రమంలో రామ్‌దేవ్ మాట్లాడారు. ఈ సందర్భంగా తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ, బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా జీవించి ఉండటం గాంధీ కుటుంబానికి ఇష్టం లేదని రామ్‌దేవ్ అన్నారు. కేంద్రంలో యుపిఎ అధికారంలో ఉన్నప్పుడు జైలులో అమిత్‌షా మరణించాలని వారు కోరుకున్నారని ఆయన అన్నారు. ఐఎన్ఎక్స్ మీడియా కేసులో ప్రస్తుతం జైలులో ఉన్న కేంద్ర మాజీ మంత్రి చిదంబరంపై కూడా రామ్‌దేవ్ వ్యాఖ్యలు చేశారు. అమిత్‌షాను జైలుకు పంపించిన చిదంబరం కలలో కూడా తాను జైలుపాలవుతానని ఊహించిఉండరని రామ్‌దేవ్ అన్నారు. చిదంబరం గతంలో తాను చేసిన పనులకు ఇప్పుడు తగిన మూల్యం చెల్లిస్తున్నారని ఆయన అన్నారు. మనిషి జీవితంలో పాటించాల్సిన అతి పెద్ద సూత్రమేదని ఒకసారి జస్టిస్ హెగ్డేను తాను ప్రశ్నించానని, దానికి ఆయన చట్టాలను ఉల్లంఘించకుండా ఉండటమేనని చెప్పారని రామ్‌దేవ్ అన్నారు. చట్టాలను ఉల్లంఘిస్తే చిదంబరం మాదిరిగానే మూల్యం చెల్లించాల్సి వస్తుందని ఆయన చెప్పారు. ఇదిలా ఉంటే రామ్‌దేవ్ వ్యాఖ్యల పట్ల కాంగ్రెస్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తుంది. ఆ పార్టీకి చెందిన జాతీయ స్థాయి నేతలు పలువురు మాట్లాడుతూ.. రామ్‌దేవ్ మూర్ఖంగా మాట్లాడుతున్నాడని విమర్శించారు. ఇలాంటి వ్యాఖ్యలు గౌరవ పదమైన స్థాయిలో ఉన్న వ్యక్తి మాట్లాడటం సిగ్గుచేటన్నారు. వెంటనే రామ్‌దేవ్ ఆ వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలని కోరుతున్నారు.

## ట్రంప్‌ను అభిశంసిస్తాం: స్పీకర్ నాన్సీ పెలోసి

వాషింగ్టన్, సెప్టెంబర్26 (ఆర్ఎన్ఎ) : హౌడీ మోడీ కార్యక్రమంలో హడావిడి చేసి, ప్రపంచ దృష్టిని ఆకర్షించిన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు మాత్రం సొంత ఇంట్లో వేడి పెరుగుతోంది. ఆయనను అభిశంసించాలని ఆ దేశ డెమోక్రటిక్ పార్టీ నేతలు నిర్ణయించారు. ఉభయ సభలకు చెందిన హౌజ్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్ నేత, హౌజ్ స్పీకర్ నాన్సీ పెలోసి ఈ విషయాన్ని ప్రకటించారు. రాజకీయ ప్రత్యర్థిని దెబ్బతీసేందుకు ట్రంప్ ఓ విదేశీ నేతపై ఒత్తిడి తెచ్చారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఉక్రెయిన్ దేశాధ్యక్షుడు వొలోడిమర్ జెలెన్‌స్కీని ట్రంప్ బెదిరించినట్లు తెలుస్తోంది. ఉక్రెయిన్‌కు ఇవ్వాల్సిన మిలిటరీ నిధులను ఆపేసేందుకు కూడా ఆ దేశాధినేతను ట్రంప్ హెచ్చరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. అయితే ఈ అంశంలో దేశాధ్యక్షుడు ట్రంప్ ప్రవర్తన సరిగాలేదని, ఆయన రాజ్యాంగాన్ని ఉల్లంఘించినట్లు డెమోక్రటిక్ నేతలు ఆరోపిసున్నారు. ఈ నేపథ్యంలో హౌజ్ స్పీకర్ నాన్సీ.. ట్రంప్‌పై అభిశంసన ప్రకటన చేశారు. నాన్సీ ప్రకటనను ట్రంప్ కొట్టిపారేశారు. ఉక్రెయిన్ నేతను బెదిరించిన ఘటనకు సంబంధించి పూర్తి వివరాలను ట్వీట్ చేయనున్నట్లు ఆయన తెలిపారు.

# కొనసాగనున్న వర్షాలు

హైదరాబాద్, సెప్టెంబర్26 (ఆర్ఎన్ఎ) : గత కొన్ని రోజులుగా ఏపీ, తెలంగాణను వానలు ముంచెత్తుతున్నాయి. మంగళవారం హైదరాబాదులో కురిసిన వర్షానికి నగరం అతలాకుతలమైపోయిన విషయం తెలిసిందే. కొన్ని చోట్ల ఎడతెరిపి లేకుండా వానలు పడతూనే ఉన్నాయి. ఏపీ తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో వర్షాలు పడుతున్నాయి. అయితే బుధవారం మాత్రం భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని కేంద్ర వాతావరణ శాఖ హెచ్చరించింది. ముఖ్యంగా ఏపీలో రాయలసీమ, కోస్తాంధ్ర, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, ఒడిశా, పశ్చిమబెంగాల్,అసోం, మధ్య మహారాష్ట్ర, గోవా, కొంకణ్, తూర్పు ఉత్తరప్రదేశ్, మరత్వాడ, జార్ఖండ్, బీహార్, మేఘాలయ, పుదుచ్చేరి ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని అధికారులు చెబుతున్నారు. జార్ఖండ్, చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, మేఘాలయ, అసోం రాష్ట్రాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలతో పాటు పిడుగులు కూడా పడతాయని హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తమిళనాడు, మాల్దీవులు, లక్షద్వీప్ తీర ప్రాంతాల్లో బలమైన గాలులు వీస్తాయని... మత్స్యకారులు చేపల వేట కోసం సముద్రంలోకి వెళ్లరాదని హెచ్చరించారు. మరోవైపు గత రెండు రోజులుగా తెలుగు రాష్ట్రాల్లో వరుణుడు బీభత్సం సృష్టిస్తున్నారు.

## హిట్‌లిస్ట్‌లో ప్రధాని, హోం మంత్రి, ఎన్ఎస్ఎ దోవల్

న్యూఢిల్లీ, సెప్టెంబర్26(ఆర్ఎన్ఎ) : జమ్మూ కాశ్మీర్కు సంబంధించి ఆర్టికల్ 370ను సాహసోపేతంగా రద్దు చేసిన ప్రధాని మోడీ, అమిత్ షాలు ఇప్పటికే పలు విమర్శలను బెదిరింపులను ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. ఆ రాష్ట్రం స్వయం ప్రతిపత్తి గలిగిన రాష్ట్రంగా గుర్తించడానికి ఉద్దేశించిన ఆర్టికల్ ను రద్దు చేసిన తరువాత పాకిస్తాన్ సహా, ఉగ్రవాదుల భారత్‌ను లక్ష్యంగా చేసుకున్నారన్న ప్రచారాలూ ఉన్నాయి. నిన్నటి వరకూ స్వయం ప్రతిపత్తి గల రాష్ట్రంగా కొనసాగుతూ వచ్చిన జమ్మూ కాశ్మీర్ భారత్ లో విలీనం అయ్యేలా ఆర్టికల్ 370ని రద్దు చేయడం, ఆ రాష్ట్రాన్ని రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించడాన్ని పాకిస్తాన్ గానీ, ఆ దేశాన్ని ప్రధాన కేంద్రంగా చేసుకున్న ఉగ్రవాద సంస్థలు గానీ ఏ మాత్రం జీర్ణించుకోలేకపోతున్నాయి.

## ఇమ్రాన్ ఖాన్‌కు విషయం అర్థమైంది

న్యూయార్క్,సెప్టెంబర్26(ఆర్ఎన్ఎ): కశ్మీర్‌పై ఏకాకిగా మారిన పాకిస్తాన్ పరిస్థితి దయనీయంగా మారింది. అది చేస్తాం ఇది చేస్తాం అని బీరాలుపోయి..ఇప్పుడు దిక్కు తోచని స్థితిలో పడిపోయింది. జమ్మూ కశ్మీర్ అంశంలో ఏ దేశం కూడా పాక్‌కు మద్దతు ఇవ్వడం లేదని ఆ దేశ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ మీడియా ముందు వాపోవటం దాని పరిస్థితికి అద్దం పడుతోంది. కశ్మీర్ అంశంలో ప్రపంచదేశాల తీరు తనను తీవ్ర నిరాశకు గురి చేసిందని.. ఏ దేశం కూడా మోదీ మీద ఒత్తిడి తీసుకురావడం లేదని ఇమ్రాన్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఐక్యరాజ్య సమితి సర్వసభ్య సమావేశం నిమిత్తం భారత్, పాక్ ప్రధానులిద్దరు న్యూయార్క్‌లో ఉన్న సంగతి తెలిసిందే.

ఈ క్రమంలో ఇమ్రాన్ మీడియాతో మాట్లాడుతూ.. 'జమ్మూకశ్మీర్ పునర్వ్యస్థీకరణ అంశంలో ప్రపంచంలోని ఏ దేశం కూడా మాకు మద్దతు ఇవ్వడం లేదు. ప్రపంచ దేశాల మద్దతు కూడగట్టడానికి మేం చేసిన ప్రయత్నాలు అన్ని వృథా అయ్యాయి. 100 కోట్ల జనాభా ఉన్న భారత్ మార్కెట్‌ను దృష్టిలో పెట్టుకుని ఏ దేశం మాకు మద్దతివ్వడం లేదు.. మోదీని వ్యతిరేకించడం లేదు. కశ్మీర్ అంశంలో యుద్ధం మినహా అన్ని రకాల ప్రయత్నాలు చేశాం' అని తెలిపారు. ప్రపంచ దేశాల మద్దతు ఉన్నా లేకపోయినా తాము మాత్రం మోదీపై ఒత్తిడి తేస్తూనే ఉంటామని ఇమ్రాన్ పేర్కొన్నారు.

జమ్మూకశ్మీర్ విభజన, ఆర్టికల్ 370 రద్దు అంశాలను పాక్ మొదటి నుంచి వ్యతిరేకిస్తున్న సంగతి తెలిసిందే. కశ్మీర్ అంశంలో భారత్ నిర్ణయాన్ని అంతర్జాతీయ సమాజంలో ఎండగట్టేందుకు పాక్ చేయని ప్రయత్నం లేదు. కానీ అవన్నీ బెడిసికొట్టాయి. పాక్‌కు మద్దతు కొరవడటమే కాక ఇది ఇరు దేశాల ద్వైపాక్షిక అంశమని.. చర్చల ద్వారా పరిష్కరించుకోమని సూచించాయి. కానీ ట్రంప్ మాత్రం ఇరు దేశాల ప్రధానులు అంగీకరిస్తే.. జమ్మూకశ్మీర్ అంశంలో తాను మధ్యవర్తిత్వం చేస్తానని ప్రకటించిన సంగతి తెలిసిందే.

## పోలీసుల అదుపులో నలుగురు ఉగ్రవాదులు

చండీఘర్, సెప్టెంబర్26(ఆర్ఎన్ఎ) : అనుమానాస్పదంగా సంచరిస్తున్న నలుగురు ఖలిస్తానీ ఉగ్రవాదులను పంజాబ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పంజాబ్‌లోని తరన్ తరన్ జిల్లాలో ఖలిస్తాన్ జిందాబాద్ ఫోర్స్‌కు చెందిన నలుగురు ఉగ్రవాదుల వద్ద నుంచి రూ. 10 లక్షల విలువైన ఆయుధాలు, పెద్ద ఎత్తున నకిలీ నోట్లను స్వాధీనం చేసుకున్నారు. పంజాబ్‌లో రిజిస్ట్రేషన్ అయిన మారుతీ స్విఫ్ట్ కారులో అమృత్‌సర్‌కు వెళుతున్న బల్వంత్ సింగ్, ఆకాశ్‌దీప్ సింగ్, హర్భజన్ సింగ్, బల్బీర్ సింగ్‌పై అనుమానం వచ్చి అదుపులోకి తీసుకున్నామని పోలీసులు తెలిపారు. వీరిలో ఆకాశ్‌దీప్ సింగ్, బల్వంత్ సింగ్‌లపై ఇప్పటికే పలు క్రిమినల్ కేసులు ఉన్నట్లు తెలిపారు.

కాగా, ఈ వాదనలకు బలం చేకూరుస్తూ.. జమ్మూ-కశ్మీర్‌లో మరోసారి భయాందోళనను సృష్టించేందుకు పాకిస్తాన్, భారత్ సరిహద్దులో ఉన్న అమృత్‌సర్‌లో డ్రోన్ల ద్వారా ఎకె-47, గ్రనైడ్లను వదిలివెళ్లినట్లు సమాచారం అందిందని పంజాబ్ పోలీసులు నిర్ధారించారు. కేవలం నెల వ్యవధిలోనే 8 డ్రోన్ల ద్వారా ఆయుధాలతో పాటు సాటిలైట్ ఫోన్లను భారతగడ్డపై వదిలివెళ్లినట్లు గుర్తించామని తెలిపారు. ఈ డ్రోన్లు అత్యంత వేగంగా ఎగురుతూ 5 కేజీల బరువును సలువుగా మోస్తాయని, సమాచారాన్నివేగంగా పసిగడతాయని వెల్లడించారు.

అలాగే వారిని అదుపులోకి తీసుకున్న ప్రదేశంలో సగం కాలిపోయిన డ్రోన్ దొరికిందని, పాకిస్తాన్‌కు తిరిగి వెళ్లే సమయంలో డ్రోన్‌లో ఇబ్బంది తలెత్తడంతో ఉగ్రవాదులే దానిని కాల్చడానికి ప్రయత్నించారని పేర్కొన్నారు. ఈ కేసును దర్యాప్తు చేయాలని జాతీయ దర్యాప్తు సంస్థను కోరినట్లు పంజాబ్ పోలీసులు పేర్కొన్నారు. ఈ ఘటనపై పంజాబ్ ముఖ్యమంత్రి అమరీందర్ సింగ్ మాట్లాడుతూ.. ఆర్టికల్ 370 రద్దు తర్వాత భారత్‌లో దాడులు చేసేందుకు పాకిస్తాన్ ఉగ్రవాదులకు డ్రోన్ల ద్వారా ఆయుధాలను సరఫరా చేస్తుందన్నారు.

## కేంద్ర మంత్రితో ఏపీ మంత్రి గౌతమ్‌రెడ్డి భేటీ

న్యూఢిల్లీ, సెప్టెంబర్26(ఆర్ఎన్ఎ) : కేంద్ర ఓడరేవుల శాఖ మంత్రి మాన్‌సుఖ్ మాండవియాను ఎంపీ మేకపాటీ గౌతమ్‌రెడ్డి కలిశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రావాల్సిన నిధులు, అందాల్సిన సహకారంపై బుధవారం భేటీఅయ్యి చర్చించారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్రానికి సంబంధించిన పలు ప్రతిపాదనలతో కూడిన వినతి పత్రాన్ని మంత్రికి అందజేశారు. విభజన హామీలను కేంద్రమంత్రికి వివరించారు. అనంతరం గౌతమ్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ.. దుగరాజపట్నం పోర్టును జాతీయ పోర్టుగా గుర్తించి ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ కొన్ని కారణాల దృష్ట్యా ముందుకు సాగలేదని మంత్రికి తెలిపినట్లు వెల్లడించారు. కాగా ప్రత్యామ్నాయంగా వేరే ప్రాంతాలను చూపించాలని కేంద్రం కోరిందని తెలిపారు. దీంతో రామాయపట్నం, మచిలీపట్నం వంటి ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశామన్నారు. బకింగ్ హామ్ కెనాల్‌లో జల రవాణా విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్టు గౌతమ్ రెడ్డి తెలిపారు.

# ప్రాజెక్టులకు పెరుగుతున్న వరద ఉధృతి

సూర్యపేట, సెప్టెంబర్26(ఆర్ఎన్ఎ) : రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలకువరద నీటి ఉధృతి పెరుగుతున్నది. పులిచింతల ప్రాజెక్టుకు వరద నీరు చేరుతోంది. అధికురులు ప్రాజెక్టులోని ఒక గేటు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

పులిచింతల ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 45.77 టీఎంసీలు, కాగా ప్రస్తుత నీటి నిల్వ 45.56 టీఎంసీలు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 175 అడుగులు కాగా, ప్రస్తుతం 174.86 అడుగులుగా ఉంది. ప్రాజెక్టు ఇన్ఎ÷-లో 36.043 క్యూసెక్కులు, కాగా ఔట్ఎ÷-లో 36.043 క్యూసెక్కులు అని అధికారులు నివేదిక విడుదల చేశారు.

## కేసీఆర్ ప్రభుత్వంలో..
# పెను భూకంపం రాబోతోంది

### - కాంగ్రెస్ సీనియర్ నేత వీ. హన్మంతరావు

హైదరాబాద్, సెప్టెంబర్26 (ఆర్ఎన్ఎ) : త్వరలో కేసీఆర్ నేతృత్వంలోని టీఆర్ఎస్ ప్రభుత్వంలో పెను భూకంపం రాబోతోందని కాంగ్రెస్ సీనియర్ నేత వి. హనుమంతరావు వ్యాఖ్యానించారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.. కేసీఆర్ తీసుకుంటున్న ఏకపక్ష నిర్ణయాలు ఆయన ఓటమికి బలమైన పునాదులుగా మారుతాయని అన్నారు. ఫాంహౌస్లో ఉండి ఏకపక్ష నిర్ణయాలతో పాలన సాగిస్తున్న కేసీఆర్.. ప్రజల సమస్యలు పట్టించుకోవటం లేదని అన్నారు. ఆ భవనం కూల్చుతా.. ఈ భవనం కూల్చుతా అంటూ అనటం కాదని, ప్రజలు ఇబ్బందులు తెలుసుకొని ఎప్పటకప్పుడు పరిష్కరించాలని, అప్పుడే ప్రజల ముఖ్యమంత్రి అవుతారని అన్నారు. కానీ కేసీఆర్ అందుకు విరుద్ధంగా పాలన సాగిస్తున్నారని విమర్శించారు. బతుకమ్మ చీర ఇచ్చి మహిళలంతా రాష్ట్రంలో సంతోషంగా ఉన్నారంటూ టీఆర్ఎస్ నేతలు అనడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో ఆడపిల్లలపై అత్యాచారాలు పెరిగిపోయాయని వ్యాఖ్యానించారు. అత్యాచార బాధితులంతా బీసీ వర్గానికి చెందినవారేనని పేర్కొన్నారు. బీసీలంటే ప్రభుత్వానికి ఎందుకంత చులకనభావం? అని వీహెచ్ ప్రశ్నించారు. కేసీఆర్ దగ్గర పదవులు పొందిన బీసీ నేతలు ఎందుకు స్పందించడంలేదని వీహెచ్ నిలదీశారు. ఇదే సమయంలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ వివాదంపై స్పందించిన వీహెచ్.. అజారుద్దీన్కు తమ మద్దతు ఉంటుందని తేల్చి చెప్పారు.

# ఐఏఎస్ ఆఫీసర్ రోహిణిసింధూరిపై బదిలీ వేటు

బెంగళూరు, సెప్టెంబర్26(ఆర్ఎన్ఎ) : కర్నాటక కేడర్ ఐఏఎస్ ఆఫీసర్ రోహిణి సింధూరిపై బదిలీ వేటు పడింది. కర్నాటక భవన నిర్మాణ సంక్షేమ శాఖ నుంచి ఆమెను మరో శాఖకు బదిలీ చేస్తూ యడియూరప్ప ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సింధూరిపై బదిలీ వేటు పడటం వరుసగా ఇది నాలుగో సారి. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గని నిజాయితీ కలిగిన ఐఏఎస్ అధికారిణిగా ఆమెకు మంచి పేరుంది. కర్నాటకలో ఆమెను 'లేడీ సింగం' అని కూడా పిలుచుకుంటుంటారు. యడియూరప్ప ప్రభుత్వం సెప్టెంబర్ 20న ఆమెను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. సెప్టెంబర్ 24న ఆమెను పట్టు పరిశ్రమ శాఖకు బదిలీ చేస్తున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. కర్నాటక వరదల నేపథ్యంలో రూ.1000 కోట్ల భవన నిర్మాణ సంక్షేమ శాఖ నిధులను విపత్తు సహాయ నిధికి మళ్లించాలని కర్నాటక బీజేపీ ప్రభుత్వం రోహిణి సింధూరిని కోరినట్లు తెలిసింది. అందుకు ఆమె నిరాకరించారు. ఈ చర్య యడియూరప్పకు ఆగ్రహం తెప్పించినట్లు తెలిసింది. అందువల్లే ఆమెపై తాజాగా ఈ బదిలీ వేటు పడినట్లు సమాచారం.

# మధురై విమానాశ్రయంలో తుపాకుల పట్టివేత

చెన్నై, సెప్టెంబర్26(ఆర్ఎన్ఎ) : మధురై విమానాశ్రయంలో బుధవారం భారీ సంఖ్యలో కస్టమ్స్ అధికారులు తుపాకులను స్వాధీనం చేసుకున్నారు.

దాదాపు రూ.17 లక్షల విలువైన 23 తుపాకులను ఎయిర్పోర్టు అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా స్పైస్ జెట్ విమానంలో కొందరు ప్రయాణికులు వీటిని తరలిస్తున్నట్టు గుర్తించారు. షూటింగ్ ప్రాక్టీస్ కోసమంటూ చెబుతున్న ఈ తుపాకులను ఓ ముఠా దుబాయ్ నుంచి శివగంగైకు తరలిస్తున్నట్టు తేలింది. దీంతో వీటిని తీసుకొచ్చిన అజ్మల్ఖాన్, కోలిక్ మహ్మద్, మునిజ్వా అనే వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ముగ్గుర్నీ సెక్యూరిటీ కెమేరాలు పసిగట్టడంతో ఎయిర్ పోర్టు అధికారులు వారి బ్యాగులను తనిఖీ చేయగా 23 తుపాకులు బయటపడినట్టు సమాచారం. కాగా ఈ తుపాకులు షూటింగ్ ప్రాక్టీస్ కోసమని చెబుతున్నప్పటికీ ఇండియన్ షూటింగ్ స్పోర్ట్స్ ఫెడరేషన్ నుంచి కూడా ఎలాంటి అనుమతులూ లేకపోవడం గమనార్హం.

# చిన్మయానందను పార్టీ నుంచి తొలగించిన బిజెపి

లక్నో, సెప్టెంబర్26(ఆర్ఎన్ఎ) : ఒక న్యాయ విద్యార్థినిని లైంగికంగా వేధించారంటూ ఆరోపణలు ఎదుర్కొని, గత వారం అరెస్ట్ అయిన మాజీ కేంద్రమంత్రి, బీజేపీ సీనియర్ నేత స్వామి చిన్మయానంద్ (73)ను పార్టీ నుంచి తొలగిస్తున్నట్లు ఉత్తరప్రదేశ్ బీజేపీ అధికార ప్రతినిధి హరీష్ శ్రీవాత్సవ తెలిపారు. చిన్మయానంద్ పై ఆరోపణలు వచ్చిన నెల రోజుల తర్వాత బుధవారం బీజేపీ నుంచి అధికారికంగా ఈ విషయాన్ని ప్రకటించింది. ప్రతిపక్షాలు,సోషల్ మీడియా వేదికగా నెటిజన్లు చిన్మయానంద్ ను సీఎం యోగి, ప్రధాని మోడీ కాపాడాలనుకుంటున్నారా అంటూ తీవ్ర విమర్శలు గుప్పిస్తున్న క్రమంలో పార్టీ చిన్మయానంద్ పై వేటు వేసింది. ఆయన ఇకపై బీజేపీ సభ్యుడు కాదని, పార్టీ నుంచి తొలగించామని హరీష్ శ్రీవాత్సవ తెలిపారు. అయితే, ఎప్పుడు ఆయనను పార్టీ నుంచి తొలగించారో చెప్పాలని ప్రశ్నించగా, .ఖచ్చితమైన డేట్ ఇవ్వలేమని, అయితే చిన్మయానంద్ ఇకపై ఎంతమాత్రం బీజేపీ సభ్యుడు కాదని హరీష్ సమాధానమిచ్చారు.

షహజన్పూర్లో లా కాలేజీలో అడ్మిషన్ విషయమై తనకు సహాయపడిన చిన్మయానంద తనను ఏడాది పాటు లైంగికంగా వేధించాడని బాధిత విద్యార్థిని ఆగస్టు 24న ఫేస్ బుక్లో పోస్టు చేయడం సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో పెద్ద ఎత్తున నిరసనలు వెల్లువెత్తడంతో గత వారం ఆయనను పోలీసులు అరెస్ట్ చేశారు. చిన్మయానంద్ కు కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది.

తాను నిర్వహించే కాలేజీలో న్యాయవాద విద్యను అభ్యసిస్తున్న విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించినట్లు చిన్మయానంద ఒప్పుకున్నారని గత వారం ప్రత్యేక దర్యాప్తు బృందం చీఫ్ నవీన్ అరోరా తెలిపారు.

# మాకు ఏ దేశం మద్దతివ్వడం లేదు

### - యుద్ధం మినహా అన్ని ప్రయత్నాలు చేశాం
### - పాక్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్

న్యూయార్క్, సెప్టెంబర్26(ఆర్ఎన్ఎ) : జమ్మూకశ్మీర్ అంశంలో ఏ దేశం కూడా పాక్కు మద్దతు ఇవ్వడం లేదని ఆ దేశ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ వాపోయాడు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ తన ఆవేదనను వెల్లగక్కాడు. కశ్మీర్ అంశంలో ప్రపంచదేశాల తీరు తనను తీవ్ర నిరాశకు గురి చేసిందని.. ఏ దేశం కూడా మోదీ మీద ఒత్తిడి తీసుకురావడం లేదని ఇమ్రాన్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఐక్యరాజ్య సమితి సర్వసభ్య సమావేశం నిమిత్తం భారత్, పాక్ ప్రధానులిద్దరు న్యూయార్క్లో ఉన్న సంగతి తెలిసిందే.

ఈ క్రమంలో ఇమ్రాన్ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. జమ్మూకశ్మీర్ పునర్వ్యవస్థీకరణ అంశంలో ప్రపంచంలోని ఏ దేశం కూడా మాకు మద్దతు ఇవ్వడం లేదని, ప్రపంచ దేశాల మద్దతు కూడగట్టడానికి మేం చేసిన ప్రయత్నాలు అన్ని వృథా అయ్యాయని అన్నారు. 100 కోట్ల జనాభా ఉన్న భారత్ మార్కెట్ను దృష్టిలో పెట్టుకుని ఏ దేశం మాకు మద్దతివ్వడం లేదని, మోదీని వ్యతిరేకించడం లేదన్నారు. కశ్మీర్ అంశంలో యుద్ధం మినహా అన్నిరకాల ప్రయత్నాలు చేశామని తెలిపారు. ప్రపంచ దేశాల మద్దతు ఉన్నా లేకపోయినా తాము మాత్రం మోదీపై ఒత్తిడి తేస్తూనే ఉంటామని ఇమ్రాన్ పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్ విభజన, ఆర్టికల్ 370 రద్దు అంశాలను పాక్ మొదటి నుంచి వ్యతిరేకిస్తున్న సంగతి తెలిసిందే. కశ్మీర్ అంశంలో భారత్ నిర్ణయాన్ని అంతర్జాతీయ సమాజంలో ఎండగట్టేందుకు పాక్ చేయని ప్రయత్నం లేదు. కానీ అవన్నీ బెడిసికొట్టాయి. పాక్కు మద్దతు కొరవడటమే కాక ఇదిఇరు దేశాల ద్వైపాక్షిక అంశమని.. చర్చల ద్వారా పరిష్కరించుకోమని సూచించాయి. కానీ ట్రంప్ మాత్రం ఇరుదేశాల ప్రధానులు అంగీకరిస్తే.. జమ్మూకశ్మీర్ అంశంలో తాను మధ్యవర్తిత్వం చేస్తానని ప్రకటించిన సంగతి తెలిసిందే.

# భోపాల్లో కుప్పకూలిన మిగ్ -21 ఎయిర్క్రాఫ్ట్

### - పైలట్లు సురక్షితం

భోపాల్, సెప్టెంబర్27 (ఆర్ఎన్ఎ) : భారత వైమానిక దళానికి చెందిన మిగ్ 21 ఎయిర్క్రాఫ్ట్ కుప్పకూలింది. శిక్షణలో భాగంగా ఇద్దరు పైలట్లు మిగ్ 21ను బుధవారం ఉదయం గ్వాలియర్ ఎయిర్ఫోర్స్ బేస్ నుంచి టేకాఫ్ చేశారు. కొంచెం దూరం వెళ్లగానే మిగ్ 21 కుప్పకూలిపోయింది. ఈ ప్రమాదం నుంచి ఇద్దరు పైలట్లు సురక్షితంగా బయటపడ్డారు. ఈ సంఘటన భోపాల్కు 60 కిలోమీటర్ల దూరంలో జరిగినట్లు పోలీసులు తెలిపారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు పరిస్థితిని సమీక్షించారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 12 ఎయిర్క్రాఫ్ట్లు కుప్పకూలిపోయాయి. అసలు ఎయిర్క్రాఫ్ట్లు కుప్పకూలడానికి గల కచ్చితమైన కారణాలు తెలుసుకునేందుకు ఎయిర్ఫోర్స్ అధికారులు విచారణకు ఆదేశించారు. ఈ ఏడాది మార్చిలో రాజస్థాన్లోని బికనేర్లో మిగ్ 21 ఎయిర్క్రాఫ్ట్ కుప్పకూలిన విషయం విదితమే. ఈ ప్రమాదం నుంచి పైలట్ సురక్షితంగా బయటపడ్డాడు.

# నగరాలు, విమానశ్రయాలపై దాడులు చేస్తాం

### పౌరవిమానయాన శాఖకు జైష్ బెధిరింపు లేఖ

న్యూఢిల్లీ, సెప్టెంబర్26 (ఆర్ఎన్ఎ) : పౌర విమానయాన మంత్రిత్వశాఖ భద్రతా విభాగానికి ఒక బెదిరింపు లేఖ బుధవారం అందింది. జైష్-ఎ- మహమ్మద్ ఉగ్రవాద సంస్థ పేరు మీద వచ్చిన ఈ లేఖలో విమానాశ్రయాలతో పాటు భారత్ లోని 30 నగరాల మీద దాడులకు సిద్ధపడబోతున్నట్లు పేర్కొన్నారు. ఈ లేఖను ఎవరు రాశారు ఎక్కడి నుంచి వచ్చిందనే విషయంపై ఇంటెలిజెన్స్ అధికారులు ఆరా తీస్తున్నారు. ఈ లేఖ అందిన నేపథ్యంలో పౌర విమానయాన మంత్రిత్వశాఖ జమ్మూ, పఠాన్ కోట్, అమృత్ సర్, జైపూర్, గాంధీనగర్, కాన్పూర్, లక్నో, వారణాసి, హిండన్ వంటి నగరాల్లో విమానాశ్రయాల భద్రతను కట్టుదిట్టం చేసింది. మరిన్ని పారా మిలటరీ బలగాలతో విమానాశ్రయాల వద్ద బందోబస్తును రెట్టింపు చేసింది. జమ్మూ కాశ్మీర్ లోని పుల్వామా జిల్లా అవంతిపురా వద్ద సీఆర్పీఎఫ్ కాన్వాయ్ పై ఆత్మాహూతి దాడికి పాల్పడిన జైషె మహమ్మద్ ఉగ్రవాదులు మరోసారి అదే తరహాలో విరుచుకు పడవచ్చని ఇంటెలిజెన్స్ అధికారులు అనుమానిస్తున్నారు.

# లష్కరే తోయిబా నుంచి పొంచి ఉన్న ముప్పు

### హెచ్చరించిన నిఘా వర్గాలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్26 (ఆర్ఎన్ఎ) : హైదరాబాద్ లోని దిల్ షుక్ నగర్ లో బాంబు పేలుడుకు పాల్పడిన లష్కరే తోయిబా ఉగ్రవాద సంస్థ భారత్ను లక్ష్యంగా చేసుకుందని నిఘా అధికారులు హెచ్చరించిన విషయం తెలిసిందే. పాకిస్తాన్ నుంచే కార్యకలాపాలను కొనసాగిస్తోన్న ఈ సంస్థ హైదరాబాద్ లోని దిల్ షుక్ నగర్ లో బాంబు పేలుడుకు పాల్పడిన విషయం కూడా తెలిసిందే. నరేంద్ర మోడీ ప్రాతినిధ్యం వహిస్తోన్న వారణాసిని లక్ష్యంగా చేసుకుని లష్కరే తొయిబా ఉగ్రవాదులు దాడులకు పాల్పడవచ్చంటూ నిఘా వర్గాలు హెచ్చరించాయి. ఈ క్రమంలోనే కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా, ప్రత్యేకించి తీర ప్రాంత పట్టణాలు, పాకిస్తాన్ తో సరిహద్దులను పంచుకుంటున్న ప్రాంతాల్లో నిఘా వ్యవస్థను బలోపేతం చేసింది. నరేంద్ర మోడీ, అమిత్ షా పాల్గొనే బహిరంగ సభలపై డేగకన్ను వేసింది. హర్యానా, మహారాష్ట్రల్లో అసెంబ్లీ ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో వారిద్దరూ విస్తృతంగా పాల్గొనాల్సి ఉంది. ఈ నేపథ్యంలో-- వారిద్దరి భద్రతను మరింత పెంచారు.

# వాస్తవాలను వక్రీకరిస్తే జర్నలిస్టు సమాజం క్షమించదు?

హైదరాబాద్, సెప్టెంబర్27: తెలంగాణా జర్నలిస్టుల ఆత్మగౌరవాన్నిఅధికార టీఆర్ఎస్ పార్టీకి తాకట్టు పెట్టి పదవి సంపాదించిన ఆందోల్ శాసన సభ్యుడు క్రాంతి కిరణ్,జర్నలిస్టుల సంక్షేమంపై వాస్తవాలను వక్రీకరించి చివరికి గౌరవ శాసన సభను కూడా తప్పుద్రోవ పట్టించే విధంగా మాట్లాడడం సిగ్గుచేటు. జర్నలిస్టుల సుదీర్ఘ సమస్యల పరిష్కారానికై సెప్టెంబర్ 26 నుండి అక్టోబర్ 14 వరకు మండల స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు పోరాటాలకు తెలంగాణా రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) రెండు రోజుల క్రితం పిలుపు ఇచ్చిన సంగతి తెలిసేందే. ఈ పిలుపు సోషల్ మీడియాలో వైరల్ అయిపోవడం, రాష్ట్ర వ్యాపితంగా వేలాది మంది జర్నలిస్టులు పోరాటాలకు సిద్ధమవుతుండడంతో ప్రభుత్వానికి ఊడిగం చేస్తున్నఓ పెయిడ్ జర్నలిస్టు సంఘానికి మింగుడు పడలేదు. మరోవైపు ఆ సంఘంపై జర్నలిస్టుల నుండి తిరుగుబాటు తప్పలేదు. దీంతో పథకం ప్రకారం తమతో కలిసి పనిచేస్తున్న క్రాంతి కిరణ్ చేత ఇవ్వాళ జర్నలిస్టుల సంక్షేమంపై ప్రశ్నోత్తరాల సమయంలో మాట్లాడించారు. ఇక్కడ మరొక్కటి చెప్పుకోవాలి క్రాంతి కిరణ్ అనే వ్యక్తి ఎప్పుడైతే రాజకీయాల్లో అడుగు పెట్టాడో ఆ రోజు నుండే అతనికి మీడియాతో గానీ, జర్నలిస్టులతో గానీ అస్సలు సంబంధం లేదు. ఈ సమాజం అతనిని ఓ రాజకీయ నాయకుడిగా మాత్రమే పరిగణిస్తుంది. కానీ అసెంబ్లీలో అతను మాట్లాడిన తీరు చూస్తే ఇంకా తాను పెయిడ్ జర్నలిస్టు సంఘానికి నాయకుడిగా చెలామణి అవుతున్నట్లు కనిపించింది. ఇక అతని మాటల్లోకి వద్దాం... భారత దేశంలో ఎక్కడా లేనివిధంగా జర్నలిస్టుల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం కృషి చేస్తుందని చంకలెగరేయడం ఆశ్చర్యం కలిగించింది. తెలంగాణ రాష్ట్రం తప్ప, దేశంలో ఏ రాష్ట్రంతో సంబంధం గానీ, అక్కడి ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై గానీ ఏమాత్రం అవగాహనా లేని క్రాంతి కిరణ్

### నువ్వో రాజకీయుడివి నిన్నెవరు విశ్వసించరు?

దేశస్థాయి గురించి మాట్లాడుతాడు. ఇతర రాష్ట్రాల్లో రిటైర్డ్ జర్నలిస్టులకు అక్కడి ప్రభుత్వాలు పెన్షన్ పథకం అమలు చేస్తున్న అవగాహనా కూడా ఈ రాజకీయ నాయకుడికి లేకపోవడం విచారకరం. మన రాష్ట్రంలో జర్నలిస్టులకు అందించిన హెల్త్ కార్డులు అన్ని ఆసుపత్రుల్లో చివరికి నిమ్స్ ఆసుపత్రిలో కూడా తిరస్కరణకు గురవుతున్న విషయం పై పాపం అతనికి అవగాహనా లేదు. ఎందుకంటే లక్షల రూపాయల ప్రజాధనాన్ని జీతభత్యాల రూపంలో తీసుకుంటూ లక్జరీ జీవితాన్నిఅనుభవిస్తున్నఅతనికి పచ్చకామెర్ల రోగికి లోకమంతా పచ్చగా కనిపించినట్లు వుంది. ఆరు నెలలుగా చావు బ్రతుకుల మధ్య కొట్టిమిట్టాడిన ఎన్నోకేసులను సైతం కార్పొరేట్ ఆసుపత్రులు నిర్దాక్షిణ్యంగా తిరస్కరిస్తున్న విషయం పట్ల అతనికి ఏ మాత్రం అవగాహనా లేదు ఎందుకంటే అతనో రాజకీయ నాయకుడు కనక. అతను ప్రాతినిధ్యం వహిస్తున్న ఆందోల్ నియోజకవర్గంలోని టేక్మాల్ కేంద్రంగా ఆంధ్రజ్యోతి పత్రికలో పనిచేసిన పిండి లింగం అనే పేద యువకుడు కాలేయవ్యాధితో బాధపడుతూ చికిత్స కోసం కార్పొరేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తే, హెల్త్ కార్డును తిరస్కరించడంతో ఉస్మానియా ఆసుపత్రిలో చేరి ప్రాణాలు కోల్పోయిన విషయాన్ని అతను మరచిపోయినట్లున్నాడు. అంతెందుకు గతంలో అతను నాయకత్వం వహించిన పెయిడ్ జర్నలిస్టు సంఘంలో ప్రస్తుత రాష్ట్ర బాధ్యు డొకరు ఇటీవలే డెంగ్యూకు గురై విషమ పరిస్థితుల్లో సికింద్రాబాద్ యశోద ఆసుపత్రికి చికిత్స కోసం వెళ్లి జర్నలిస్టు హెల్త్ కార్డును కౌంటర్లో అందజేయగా, ఆసుపత్రి నిర్వాహకులు ఆ కార్డును తిరస్కరించి డబ్బులు చెల్లించేంత వరకు అడ్మిట్ చేసుకోమని సూచించడంతో గత్యంతరం లేక డబ్బులు కట్టుకొని అడ్మిట్ అయ్యే పరిస్థితి నెలకొన్న సంగతి క్రాంతి కిరణ్ దృష్టికి రానట్లుంది. అవాస్తవాలు మాట్లాడితే సరిపోదు, జర్నలిస్టుల ఆరోగ్యంపై అతనికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా వెంటనే జెహెచ్ఎస్ పథకం అమలు బాధ్యతలను తానే స్వీకరించి ఇకనుండి జర్నలిస్టులకు ఆరోగ్యపరంగా ఎలాంటి ఆపద వచ్చినా తానే చూసుకుంటానని ఈ రాష్ట్ర జర్నలిస్టులకు భరోసా ఇచ్చే దమ్ము ధైర్యం అతనికి ఉందా? ఆరేండ్ల నుండి ఇంటి స్థలాలు, ఇళ్లపై జర్నలిస్టులను నమ్మిస్తూ ప్రభుత్వం నమ్మిస్తూ మోసగిస్తుంటే ఏనాడు నోరెత్తి మాట్లాడని ఈ రాజకీయనాయకుడు, టీయూడబ్ల్యూజే ఉద్యమ పిలుపుకు తడుసుకొని ఇవ్వాళ మరోసారి జర్నలిస్టులను మభ్యపెట్టే విధంగా మాట్లాడడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుంది. ఈ ఆరేళ్ళ కాలంలో రాష్ట్రంలో దాదాపు 300 మంది జర్నలిస్టులు అకాల మరణాలకు గురైతే చూసి చూడనట్లు నటించిన ఈ నాయకుడు, మృతుల కుటుంబాలకు న్యాయం కోసం దేశస్థాయిలో పోరాడిన టీయూడబ్ల్యుజె ను విమర్శిస్తూ మాట్లాడడమంటే నేలకొరిగిన అమర జర్నలిస్టులను అవమానించినట్లే. టీయూడబ్ల్యూజే తన నివేదికలో పేర్కొన్న జర్నలిస్టుల మరణాలను జిల్లాల వారీగా సాక్ష్యాధారాలతో రుజువు చేయడానికి సిద్ధంగా వుంది. మరి నోరుపారేసుకున్న ఆ నాయకుడు బహిరంగ విచారణకు సిద్దమేనా? తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ సమయంలోనే సీమాంధ్రులనే పదాన్ని వాడామని, సాధించుకున్న రాష్ట్రంలో సీమాంధ్రులను సైతం తమ బిడ్డల్లాగా చూసుకుంటామని సాక్ష్యాత్తు ముఖ్యమంత్రి కేసీఆర్, ఆయన తనయుడు కేటీఆర్ లు పలు సందర్భాల్లో ప్రకటించడమే కాకుండా చట్ట సభల్లో, జీహెచ్ఎంసి లాంటి ప్రతిష్టాత్మక సంస్థల్లో అవకాశం కల్పించారు. ఆ స్పృహ కూడా లేని ఈ నాయకుడు తరచుగా సీమాంధ్రులను కించపరిచే విధంగా మాట్లాడుతున్నాడంటే తమ బాస్ ల స్వరాన్ని ధిక్కరిస్తున్నట్లు అర్థం చేసుకోవాలా? ఇవ్వాళ అసెంబ్లీలో కూడా సీమాంధ్ర మీడియా అంటూ వ్యాఖ్యలు చేయడమే కాకుండా వారిని తరిమివేసి తెలంగాణ వాళ్లనే ప్రోత్సహించాలని తన గళాన్ని వినిపించాడు. అతనికి తెలంగాణ మీడియా యాజమాన్యాల పట్లనే చిత్తశుద్ధి ఉంటే, వెలుగు, ప్రజాపక్షం, హన్స్ ఇండియా లాంటి పత్రికలూ, హెచ్ఎంటివి, వి6 లాంటి చానళ్లను తెలంగాణ యాజమాన్యాలే నిర్వహిస్తుంటే, ప్రభుత్వం వాటిపై ఉక్కు పాదం మోపుతున్న విషయాన్ని కూడా అసెంబ్లీ లో ప్రస్తావించి ఉంటే బాగుండేది. తమరు కూడా ఆ యజమాన్యాలకే బాకా కొట్టి ఉద్యోగాలు సంపాదించిన సంగతి జర్నలిస్టులకు తెలియదనుకున్నారా? ఇంటిస్థలాలు, ఇండ్ల విషయానికి వస్తే, ఆరేండ్లుగా రేపు మాపు అనుకుంటూ ప్రభుత్వం కాలయాపన చేస్తుంటే, తనకు ఎమ్మెల్యే టిక్కెటు మాత్రం సాధించుకున్నఈ నాయకుడు జర్నలిస్టులకు ఇంటిస్థలాలు మాత్రం సాధించలేకపోయాడు. ఉమ్మడి రాష్ట్రంలో జర్నలిస్టులకు అన్యాయం జరిగిందంటూనే, ఉమ్మడి రాష్ట్రంలో జర్నలిస్టులకు 250 గజాల వరకు అప్పటి ప్రభుత్వాలు ఇంటి స్థలాలను అందించాయని, కనీసం ఇప్పుడు 150 గజాలైనా కేటాయిస్తే బాగుంటుందని అతను నోరుజారడం గమనార్హం. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న ఆందోల్ నియోజకవర్గంలో జోగిపేట కేంద్రంగా లోకల్ రిపోర్టర్లుగా పనిచేస్తున్న ఇద్దరు పేద యువకులు తనకు అనుకూలంగా వార్తలు వ్రాయడం లేదనే అక్కసుతో వారిని ఉద్యగం నుండి తొలగించిన ఘనత సంపాదించుకున్న ఈ కుహనా నాయకుడు గ్రామీణ విలేఖరుల జీవితాల గురించి అసెంబ్లీలో మాట్లాడడం హాస్యాస్పదం. జర్నలిస్టునని ఎలబడితే అలా నోరు పారేసుకొని ఇంతకాలం కాలమెల్లదీసిన అతను ముమ్మాటికీ రాజకీయ నాయకుడే, రాజకీయ లక్షణాలను ఒంట నింపుకున్న అతనికి జర్నలిస్టుల జీవితాలపై మాట్లాడే నైతిక హక్కు లేదు..భవిష్యత్తులో ఉండదు కూడా!!

# యునెస్కో బరిలో రామప్ప ఆలయం

### 25, 26వ తేదీల్లో బృందం పరిశీలన

వరంగల్, సెప్టెంబర్26 (ఆర్ఎన్ఎ): కాకతీయుల శిల్ప కళా వైభవానికి నిలువెత్తు నిదర్శనం రామప్ప ఆలయం. ఈ ఆలయానికి యునెస్కో జాబితాలో చోటు లభిస్తే ప్రపంచ వారసత్వ సంపదగా ఖ్యాతి దక్కనుంది. యునెస్కో అంటే ఐక్యరాజ్యసమితి విద్యా, విజ్ఞాన(శాస్త్రీయ) మరియు సాంస్కృతిక సంస్థ.

అంతర్జాతీయంగా విద్య, విజ్ఞానంతో పాటు సాంస్కృతిక పరిరక్షణ కోసం ఈ సంస్థ పాటుపడుతోంది. ఇప్పటివరకు చారిత్రక ప్రాంతాలకే గుర్తింపునిస్తుండగా.. కాకతీయులు నిర్మించిన కట్టడం ఈ జాబితాలో స్థానం కోసం పోటీ పడడం ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు.

దేశంలో 3,867 చారిత్రక కట్టడాలు ఉండగా ఇప్పటివరకు 38 చారిత్రక ప్రాంతాలకు మాత్రమే యునెస్కో జాబితాలో చోటు దక్కింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో 137 చారిత్రాక కట్టడాలు ఉన్నా ఇప్పటి వరకు ఒక కట్టడానికి కూడా వారసత్వ సంపదగా గుర్తింపు లభించలేదు. ఏటా యునెస్కో గుర్తింపు కోసం దేశం నుండి రెండు, మూడు దరఖాస్తులను కేంద్రం పంపిస్తుండగా 2017లో రామప్ప ఆలయం పేరు కూడా పంపించారు. కానీ ఆలయ ప్రత్యేకతల వివరాలు సరిగా లేవంటూ దరఖాస్తును తిరస్కరించారు. ఈ మేరకు యునెస్కో కన్సల్టెంట్ ప్రొఫెసర్, నర్తకి, ఆర్కిటెక్ అయిన చూడామణి నందగోపాల్తో ఆలయ ప్రత్యేకతలపై అధ్యయనం చేయించి ఆ వివరాలను యునెస్కోకు అందజేశారు. దీంతో 2019 సంవత్సరానికి గాను భారతదేశం నుండి రామప్ప ఆలయం ఒక్కటే యునెస్కో పరిశీలనకు నామినేట్ అయింది. ఈ మేరకు దరఖాస్తుతో జత చేసిన ప్రత్యేకతలు రామప్పలో ఉన్నాయో, లేదో పరిశీలించేందుకు ఈనెల 25, 26 తేదీల్లో రెండు రోజుల పాటు యునెస్కో(ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఆన్ మాన్యుమెంట్స్ సైట్స్) బృందం రామప్పలో పర్యటించనుంది.

యునెస్కో కన్సల్టెంట్ చూడామణి నందగోపాల్ ఆలయంపై అధ్యయనం చేసి ఆలయంలోని మూడు ప్రత్యేకతలను తెలియజేస్తూ నివేదించించారు. ఇందులో శాండ్ బాక్స్ టెక్నాలజీ(ఇసుకపై ఆలయాన్ని నిర్మించడం), ఫ్లోటింగ్ బ్రిక్స్ (నీటిలో తేలాడే ఇటుకలతో గోపురం నిర్మించడం), కలర్ వేరియేషన్స్(ఆలయ నిర్మాణానికి మూడు రకాల రాతిని వాడడం)ను వివరిస్తూ డోషియర్(దరఖాస్తు ప్రతిపాదన)ను తయారు చేసి యునెస్కోకు సమర్పించారు. రామప్పకు ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు లభిస్తే ఆలయ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తారు. అంతర్జాతీయ ప్రమాణాలతో అన్ని విధాలుగా తీర్చిదిద్దుతారు. కేంద్ర ప్రభుత్వం కూడా ప్రత్యేక దృష్టి సారిస్తుంది. రామప్పకు మెరుగైన రవాణా మార్గం ఏర్పాటు చేయడమే కాకుండా పరిసర ప్రాంతాలను ఆహ్లాదకరంగా మార్చి పరిరక్షణ చర్యలు చేపడుతారు. తద్వారా దేశ, విదేశీ వర్యాటకులు పెరగనుండడంతో అంతర్జాతీయ పర్యాటకుల కోసం కావాల్సిన సౌకర్యాలు ఏర్పాటు చేస్తారు

యునెస్కో బృందం సందర్శించనున్న నేపథ్యంలో సుమారు రూ. 8కోట్లతో పురావస్తుశాఖ అధికారులు అభివృద్ధి పనులను చేపట్టారు. గత నెలరోజులుగా చేపడుతున్న ఈ పనులు పూర్తికావొచ్చాయి.

# ప్లాస్టిక్ వాడితే రూ.10వేలు జరిమానా

### - ప్లాస్టిక్పై సమరశంకం పూరించిన సోన్ గ్రామస్తులు

నిర్మల్, సెప్టెంబర్26(ఆర్ఎన్ఎ) : నిర్మల్ జిల్లాలోని సోన్ గ్రామస్తులు మరెన్నో గ్రామాలకు ఆదర్శంగా నిలిచే నిర్ణయాన్ని తీసుకున్నారు. గ్రామస్తులందరూ కలిసి గ్రామంలో ప్లాస్టిక్ను నియంత్రణకు నడుం బిగించారు. ప్లాస్టిక్ను గ్రామం నుంచి తరిమివేయాలంటే మొక్కుబడి చర్యలు కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. గ్రామస్తులు, వీడీసీ, వార్డు సభ్యులు, సర్పంచ్, ఎంపీటీసీలు కలిసి లిఖిత పూర్వక తీర్మానాన్ని చేసి అమలు పరిచేలా చర్యలు తీసుకున్నారు. ప్లాస్టిక్ను ఉపయోగిస్తే ఎంతటి వారైనా రూ.10 వేల జరిమానా చెల్లించాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. ఇందుకోసం గ్రామస్తులు, షాపు యజమానులకు మూడు రోజుల సమయం ఇచ్చారు. వీడీసీ, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులు గ్రామంలోని ప్రతి ఇంటికి తిరుగుతూ ప్లాస్టిక్ను వినియోగించవద్దని అవగాహన కల్పించారు. అలాగే గ్రామంలో గల కిరాణషాపులు, చికెన్, మటన్ సెంటర్, కూరగాయల షాపు యజమానులకు నోటీసులు ఇచ్చారు. ప్లాస్టిక్ రహిత గ్రామ పంచాయతీగా మార్చడంలో సహకరించాలని కోరారు. నిబంధనలు గురువారం నుంచి అమల్లోకి వస్తాయని వెల్లడించారు. అలాగే ప్లాస్టిక్ ఉపయోగించిన వారి వివరాలు తెలిపిన వారికి ప్రోత్సాహక బహుమతులు ఇస్తామని, వారి వివరాలు సైతం గోప్యంగా ఉంచుతామని అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ.. గ్రామంలో ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని ఐక్యంగానిర్ణయించుకున్నామని అన్నారు. ప్లాస్టిక్ వల్ల పర్యావరణం కలుషితం అవుతుందని, దీనిని దృష్టిలో ఉంచుకొని జిల్లాలో, రాష్ట్రంలో సోన్ గ్రామాన్ని ఆదర్శంగా నిలిపేందుకు ప్లాస్టిక్ నిషేదానికి నిర్ణయించినట్లు తెలిపారు. సోన్ గ్రామస్తుల నిర్ణయం పట్ల జిల్లా అధికారులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు మాట్లాడుతూ.. సోన్ గ్రామాన్ని ఆదర్శంగా తీసుకొని జిల్లాలోని మిగిలిన గ్రామాల ప్రజలు ప్లాస్టిక్ను నిషేదించాలని కోరారు.

# మద్యం పరిమితిపై నోటిఫికేషన్ జారీ

హైదరాబాద్,సెప్టెంబర్ 26(ఆర్ఎన్ఎ): ఆంధ్రప్రదేశ్లో ఒక వ్యక్తి ఎంత మద్యం కలిగి ఉండాలనేదానిపై పరిమితి విధిస్తూ ఆ రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీచేసింది. నూతన ఎక్సైజ్ చట్టం ప్రకారం నేటి నుంచి నుంచి ఈ నోటిఫికేషన్ అమల్లోకి వస్తుంది. దీనిప్రకారం.. ఇండియన్ మేడ్ ఫారిన్ లిక్కర్ 3 సీసాలు, ఫారిన్ లిక్కర్ 3 సీసాలు, మిథైలేట్ స్పిరిట్ 3 బల్క్లీటర్లు, బీర్ 6 సీసాలు (650 మి.లీ.), కల్లు 2 బల్క్లీటర్లను ఒక వ్యక్తి ఎలాంటి అనుమతి అవసరం లేకుండా కలిగి ఉండవచ్చని ఏపీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డాక్టర్ డీ సాంబశివరావు ఉత్తర్వులు జారీచేశారు.

## ఏపీ వార్తలు

# నిల్వ చేసినందుకు కోట్లలో లాభం

### కర్నూలు జిల్లా వ్యాపారుల మాయాజాలం

కర్నూలు, సెప్టెంబరు 26(ఆర్ఎన్ఎ): మరో పక్షం రోజుల్లో రబీ సీజన్ మొదలవుతుంది. జిల్లాలో ఎక్కువగా శనగ వేస్తారు. దీంతో 95 వేల క్వింటాళ్ల శనగ విత్తనాలను రైతులకు రాయితీపై అందించేందుకు వ్యవసాయ శాఖ ఏర్పాట్లు చేస్తోంది. సేకరణ బాధ్యతను తీసుకున్న ఏపీ సీడ్స్ వ్యాపారుల నుంచి కొనేందుకు చర్యలు తీసుకుంటోంది. ఈ అవకాశం కోసమే ఎదురు చూస్తున్న కొందరు వ్యాపారులు గోదాముల్లో నిల్వ చేసిన శనగలను ఏపీ సీడ్స్‌కు విక్రయించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రైతుల నుంచి క్వింటా రూ.3,500 కే కొన్న వ్యాపారులు ఏపీ సీడ్స్‌కు రూ.6 వేలకు పైగా అంటగట్టేందుకు వ్యూహం పన్నారు.

గత సంవత్సరం వర్షాభావం వల్ల జిల్లాలో రైతులకు శనగ పంట దక్కలేదని, పక్క జిల్లాల్లో అధిక రేటుకు కొని గోదాముల్లో నిల్వ చేశామని వారు అంటున్నారు. అందుకే క్వింటానికి రూ.6 వేలు ఇస్తేనే తమకు గిట్టుబాటు అవుతుందని ప్రభుత్వ పెద్దల వద్ద బేరం పెట్టినట్లు తెలిసింది. ఏపీ సీడ్స్ అధికారులు వ్యాపారులకే మద్దతు ఇస్తున్నట్లు సమాచారం. మార్కెట్ యార్డుల్లో వ్యాపారులు రైతులకు చెల్లించిన ధరను పరిగణలోకి తీసుకుని సేకరణ ధరను నిర్ణయించాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. లేకుంటే ప్రభుత్వ ఖజానా, రైతులపై భారం పడుతుందని అంటున్నారు. వ్యాపారస్తులు ఇప్పటికే అమరావతిలో తిష్టవేసి అధిక రేటును దక్కించుకునేందుకు తమకు అనుకూలమైన ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల ద్వారా ప్రయత్నాలు మొదలెట్టారు.

క్వింటాలు శనగ విత్తనాలకు రూ.6 వేల నుంచి రూ.6500 ఇస్తేనే తమకు గిట్టుబాటు అవుతుందని శనగ వ్యాపారులు అధికారుల వద్ద స్పష్టం చేసినట్లు తెలిసింది. అధికారులు రూ.6 వేలు చెల్లించేందుకు సంసిద్ధతను వ్యక్తం చేశారని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. ఈ లెక్కన 95 వేల క్వింటాళ్లకు రూ.54 కోట్ల దాకా ప్రభుత్వం వ్యాపారులకు చెల్లించాలి. గత సంవత్సరం రూ.5,800 చెల్లించారు. ఈ సారి మరో రూ.200 పెంచాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు ఏపీ సీడ్స్ జిల్లా మేనేజర్ శివజ్యోతి తెలిపారు.

÷ఎడుపులతో లాభాలు

వ్యాపారులు క్వింటా శనగల కొనుగోలుకు చెల్లించింది గరిష్ఠంగా రూ.4 వేలు మాత్రమే. శుద్ధి చేసి నిల్వ చేసేందుకు, కొనుగోలు కేంద్రానికి చేర్చేందుకు క్వింటాపై రూ.500 ఖర్చు భరిస్తున్నారు. ఈ లెక్కన క్వింటా శనగలపై వ్యాపారులు పెట్టే ఖర్చు రూ.4,500. ప్రభుత్వం నుంచి రూ.6 వేలు తీసుకోనున్నారు. ఇలా క్వింటాపై వ్యాపారికి రూ.1,500 లాభం రానుంది. జిల్లాలో రైతులకు 95 వేల క్వింటాళ్ల విత్తనం అందజేస్తారు. దీనిపై వ్యాపారులకు రూ.13.50 కోట్ల లాభం సమకూరుతుంది. ఇందులో రూ.3.50 కోట్లు బేరం కుదిర్చిన అధికారులు, నాయకులకు ముట్టజెప్పాల్సి ఉంటుందని కొందరు వ్యాపారులు తెలిపారు. కేవలం 10 నెలల పాటు గోదాముల్లో నిల్వ చేసి విక్రయించినందుకు వ్యాపారులు ఏకంగా రూ.10 కోట్లు లాభం పొందుతున్నారు.

# 28న సాహిత్యకారులకు పురస్కారాలు

### – ఏపీ అధికార భాషా సంఘం అధ్యక్షుడు లక్ష్మీప్రసాద్

విజయవాడ, సెప్టెంబర్26 (ఆర్ఎన్ఎ) : ఈనెల 28న సాహిత్యకారులకు పురస్కారాలు అందజేయటం జరుగుతుందని ఏపీ అధికార భాషా సంఘం అధ్యక్షుడు యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ అన్నారు. కల్చరల్ సెంటర్ ఆఫ్ విజయవాడ, అమరావతి ఆధ్యర్యంలో అధికార భాష సంఘం, భాషా సాంస్కృతిక శాఖలు బుధవారం సమావేశం అయ్యాయి. ఈ సమావేశంలో పాల్గొన్న లక్ష్మీ ప్రసాద్ విలేకరులతో మాట్లాడుతూ.. సాహిత్యకారులకు 'గుర్రం జాషువా జయంతి' పురస్కరించుకొని గతంలో ప్రభుత్వం రూ.50 వేలు నగదు అందించేదన్నారు. కానీ ఇప్పుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.1 లక్ష చేశారని లక్ష్మీప్రసాద్ అన్నారు. గుర్రం జాషువా 124వ జయంతిని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ నెల 28న సాహిత్యకారులకు పురస్కారాలను ప్రదానం చేయనుందని తెలిపారు. తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో జరగనున్న ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహిత్యకారులు డా. కత్తి పద్మారావు, బోయ్ ఐమావతమ్మ, డా. గుజర్లముడి కృపాచారి, ఆచార్య చందు సుబ్బారావులకు రూ.1 లక్ష నగదు, జ్ఞాపికతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సత్కరిస్తారని ఆయన ప్రకటించారు.

## పోలవరంలో తగ్గించి..

# ఎలక్ట్రిక్ బస్సుల్లో పెంచేశారు

### – జగన్ సర్కార్‌పై లోకేశ్ విమర్శలు

అమరావతి, సెప్టెంబర్26(ఆర్ఎన్ఎ) : పోలవరం ప్రాజెక్ట్ కు సంబంధించిన రివర్స్ టెండర్ల విషయమై సీఎం జగన్ పై టీడీపీ నేత నారా లోకేశ్ సెటైర్లు వేశారు. ట్విటర్ వేదికగా జగన్ పై విమర్శలు, ఆరోపణలు గుప్పించారు. అయ్యా.. తుగ్లక్ ముఖ్యమంత్రి గారూ ఎడమ కాలు విరిగితే ఎర్రగడ్డ మెంటల్ హాస్పిటల్లో కట్టు కట్టించినట్టుంది మీ తెలివి. పోలవరంలో తగ్గించి, ఎలక్ట్రిక్ బస్సుల్లో పదింతలు పెంచిన లాజిక్, రివర్స్ టెండర్ వెనకున్న అసలైన మేజిక్కని సామాన్యప్రజలకూ అర్థమైందని ఆరోపించారు. పోలవరంలాంటి బహుళార్థక సాధక ప్రాజెక్టును, కేవలం స్వప్రయోజనాల కోసం ఎటువంటి అనుభవంలేని కంపెనీకి అప్పగించడం ప్రాజెక్టు ఉనికికే ప్రమాదమని లోకేశ్ అభిప్రాయ పడ్డారు. రివర్స్ టెండరింగ్ లో భాగంగా ప్రాజెక్టుపైకి చైనా 'మేఘా'లు కమ్ముకొస్తున్నాయని అన్నారు. ప్రకాశం బ్యారేజీ గేటుకడ్డంగా బోటు పడితే తీయడానికి మీకు వారం పట్టిందని, గోదావరిలో మునిగిన బోటును రెండువారాలుగా తీయలేక, 144 సెక్షన్ పెట్టారని, 70శాతం అయిన పోలవరం 30 శాతం పూర్తి చేస్తామని సవాల్ విసురుతున్న మంత్రికి అలవాటైన విద్యేమో? పోలవరంపైనా బెట్టింగ్ కాద్దామంటున్నారని లోకేశ్ విమర్శించారు.

# వైఎస్ఆర్‌ను ప్రజలు ఎప్పటికీ మర్చిపోరు

### – ప్రభుత్వ చీఫ్‌విప్ శ్రీకాంత్‌రెడ్డి

అనంతపురం, సెప్టెంబర్26 (ఆర్ఎన్ఎ) : జలయజ్ఞాన్ని ప్రారంభించి హంద్రీనీవా ప్రాజెక్టును చేపట్టిన మహానేత, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డిని ప్రజలు ఎప్పటికీ మర్చిపోరని ప్రభుత్వ చీఫ్ విప్ గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు.

బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడు తూ.. కదిరి ప్రాంతానికి హంద్రీ నీవా ద్వారా పూర్తిస్థాయిలో డిసెంబర్‌లోగా నీరిస్తామని అన్నారు. రాయచోటికి సంక్రాంతికి హంద్రీనీవా నీటిని అందిస్తామని తెలిపారు.

అవినీతి జరిగిన ప్రాజెక్టులలో రివర్స్ టెండర్ల ద్వారా పనులు చేపడతామని చెప్పారు. రివర్స్ టెండర్ల ద్వారా రెండు పనుల్లోనే రూ. 750 కోట్ల ప్రజాధనాన్ని మిగిల్చామన్నారు.

నామినేషన్ పనుల ద్వారా చంద్రబాబు బంధువు కంపెనీ నవయుగకు పనులు కట్టబెట్ట లేదా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల సొమ్ముకు కాపలాదారులుగా ఉంటారన్నారు.

# రివర్స్ టెండరింగ్‌తో రూ.782 కోట్లు ఆదా

### – ఏపీ సీఎం జగన్మోహన్‌రెడ్డి

అమరావతి, సెప్టెంబర్26(ఆర్ఎన్ఎ) : పోలవరం రివర్స్ టెండరింగ్‌తో రూ.782కోట్లు ఆదాయ అయిందని ఏపీ సీఎం జగన్మోహన్‌రెడ్డి వెల్లడించారు. బుధవారం పోలవరం రివర్స్ టెండర్లపై సీఎం జగన్ తొలిసారి స్పందించారు. రివర్స్ టెండరింగ్ మంచి ఫలితాలను ఇచ్చిందని తెలిపారు. రివర్స్ టెండరింగ్ ద్వారా రూ.782 కోట్లు ప్రజాధనాన్ని ఆదా చేశామని తెలిపారు. న్యాయసమీక్ష, రివర్స్ టెండరింగ్ చర్యలు మంచి ఫలితాలు ఇస్తున్నాయన్నారు. వ్యవస్థలను సరిదిద్దే ప్రయత్నాలు చేస్తున్నామని, విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నామని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అన్నారు. దేశంలో ఎవరూ ఇలాంటి విప్లవాత్మక చర్యలు చేపట్టలేదన్నారు. ఏ రాష్ట్రంలో కూడా న్యాయసమీక్ష, రివర్స్ టెండరింగ్ విధానాలు లేవన్నారు. రూ.100 కోట్లు దాటిన ఏ టెండర్‌నైనా జడ్జి దృష్టికి తీసుకెళ్తున్నామన్నారు. పారదర్శక విధానాల్లో న్యాయసమీక్ష అత్యుత్తమమన్నారు. ఏ రాష్ట్రం కూడా రివర్స్ టెండరింగ్ అమలు చేయటలేదన్నారు. అదే విధంగా పీపీఏల విషయంలో విప్లవాత్మక విధానాలు చేపట్టామన్నారు. అధిక ధరకు చేసుకున్న పీపీఏలపై సమీక్ష చేయకపోతే డిస్కంలు బతికి బట్టకట్టవన్నారు. కరెంటు ఛార్జీలు ఎక్కువగా ఉన్నాయని పారిశ్రామికవేత్తలు వెనకడుగు వేసే పరిస్థితి ఉందన్నారు. పరిశ్రమలకు ఇచ్చే కరెంటు ఛార్జీలను ఇంకా పెంచే అవకాశం కూడా లేదన్నారు. విద్యుత్ రంగంలో పరిస్థితులను సరిదిద్దడానికి ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. విద్యుత్ రంగం పునరుద్ధరణకు అందరి సహకారం కావాలని జగన్మోహన్‌రెడ్డి కోరారు.

# మద్య నిషేధం దిశగా ప్రభుత్వ చర్యలు

అమరావతి, సెప్టెంబర్26 (ఆర్ఎన్ఎ) : అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల్లో భాగంగా మద్యం నిషేధం దిశగా ఏపీ సర్కార్ చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా మద్యం దుకాణాల సంఖ్యను తగ్గించేసిన ప్రభుత్వం, తాజాగా మరో నిర్ణయం తీసుకుంది. ఇప్పటినుంచి రాష్ట్రంలో వ్యక్తిగత మద్యం నిల్వలపై ఆంక్షలు విధిస్తూ నిర్ణయం తీసుకుంది. ఒక్కో వ్యక్తి వద్ద లిక్కర్ బాటిల్స్ అయితే 3, బీర్ బాటిల్స్ అయితే 6 కంటే మించి ఉండరాదని ఆదేశాలు జారీ చేసింది. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించింది.

కాగా, నూతన మద్యం పాలసీ విధానాన్ని తీసుకొచ్చిన ప్రభుత్వం పైలట్ ప్రాజెక్ట్ కింద సెప్టెంబర్ 1వ తేదీ నుంచి దాన్ని అమలు చేస్తోంది. దీని ప్రకారం ప్రభుత్వమే మద్యం షాపులను నిర్వహిస్తోంది. ప్రతి మద్యం షాపు దగ్గర ఓ ఎక్సైజ్ కానిస్టేబుల్‌ను నియమించనుంది. పర్మిట్ రూమ్స్‌ను పూర్తిగా రద్దుచేసింది. ఎమ్మార్పీ రేట్లకే మద్యం, రాత్రి 9గంటల వరకే మద్యం విక్రయాలు వంటి నిబంధనలు తీసుకొచ్చింది. వచ్చే ఎన్నికల నాటికి సంపూర్ణ మద్యపాన నిషేధాన్ని అమలుచేయాలన్న లక్ష్యంతో జగన్ సర్కార్ ఆ దిశగా అడుగులు వేస్తోంది.

# బాబు చేసిన తప్పులే జగన్ చేస్తున్నాడు

### – నామమాత్రంగా రివర్స్ టెండరింగ్ నిర్వహించారు
### – పోలవరం నిర్మాణ పనులపై శ్వేతపత్రం విడుదలచేయాలి
### – బీజేపీ ఎంపీ సుజనా చౌదరి

అమరావతి, సెప్టెంబర్26 (ఆర్ఎన్ఎ) : పోలవరం విషయంలో మాజీ సీఎం చంద్రబాబు చేసిన తప్పులనే ప్రస్తుత సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేస్తున్నాడని బీజేపీ ఎంపీ సుజనా చౌదరి అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు.. ఈ సందర్భంగా ఏపీ ప్రభుత్వంపై మండిపడ్డారు. పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం విషయంలో సీఎం జగన్ తీసుకున్న నిర్ణయాన్ని తప్పుపట్టారు. రివర్స్ టెండర్లపై అసంతృప్తి వ్యక్తం చేశారు. రివర్స్ టెండర్ల వల్ల ఆదా అయ్యింది ఏమీ లేదన్నారు. రివర్స్ టెండర్ల ద్వారా డబ్బు ఆదా అవుతుందన్న గ్యారెంటీ ఏంటి అని జగన్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. నామమాత్రంగా రివర్స్ టెండరింగ్ నిర్వహించారని చెప్పారు. పోలవరం నిర్మాణ పనులపై శ్వేతపత్రం విడుదల చెయ్యాలని ఏపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏపీలో ఆర్థిక వ్యవస్థ కుంటుపడిందని సుజనా చౌదరి వాపోయారు. బ్యాంకులు ఇప్పటికే ఆర్థికసాయం నిలిపేశాయని చెప్పారు. ఏపీకి పారిశ్రామికవేత్తలు రావడం లేదన్నారు. ఇసుక పాలసీపైనా స్పష్టత లేదన్నారు. పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ రీటెండరింగ్ వద్దన్నా సీఎం జగన్ వినలేదని సుజనా చౌదరి అన్నారు. రివర్స్ టెండరింగ్ సరైన పద్ధతిలో జరగలేదన్నారు. హైడ్రో పవర్ ప్రాజెక్ట్, పోలవరం ప్రాజెక్ట్ కలిపి టెండర్లు పిలవడం ఆశ్చర్యం కలిగించిందన్నారు. పార్టీ కార్యకర్తలకు ఉద్యోగాలు ఇచ్చామని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. టీడీపీ ప్రభుత్వం చేసిన తప్పులను వైసీపీ ప్రభుత్వం చేస్తోందని సుజనా చౌదరి అన్నారు.

# ఉల్లి ధరల నియంత్రణకు ఎపి ప్రభుత్వం చర్యలు

అమరావతి, సెప్టెంబర్26(ఆర్ఎన్ఎ) : కళ్ళనీళ్ళు తెప్పిస్తున్న ఉల్లి ధరను నియంత్రించేందుకు ఎపి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. కిలో ఉల్లి రూ.25కే అందుబాటులో ఉంచాలని ఏపీ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. మార్కెట్లు, రైతు బజార్లలో ఉల్లిని అందుబాటులోకి తెచ్చేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కర్నూలు నుంచి 100 మెట్రిక్ టన్నులను కొనుగోలు చేసింది. రేపటి నుంచి రాయితీ ధరపై ఉల్లి అందుబాటులోకి రానుంది. అలాగే నాసిక్ నుంచి మరో 300 టన్నులు కొనుగోలు చేయాలని నిర్ణయం తీసుకుంది. నేరుగా మార్క్‌ఫెడ్ నుంచి ఉల్లిని కొనుగోలు చేస్తోంది. మొత్తంగా 900 మెట్రిక్ టన్నులు అవసరం అవుతుందని అంచనా వేశారు. ధరల స్థిరీకరణ నిధి నుంచి సబ్సిడీని ప్రభుత్వం భరిస్తోంది.

ఇదిలా ఉండగా, కర్నూలు మార్కెట్ యార్డు ఎదుట ఉల్లి రైతులు ఆందోళన చేపట్టారు. మార్కెట్‌లో వేలాన్ని అడ్డుకుని రోడ్డుపై బైఠాయించారు. ఉల్లి క్వింటాల్ ధర రూ.2 వేలకు పడిపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉల్లి ధర పడిపోవడానికి కారణాలు తెలపాలని డిమాండ్ చేశారు. నిన్నటి వరకు క్వింటాల్ ఉల్లి ధర రూ.4500 పలికింది. భారీ వర్షాలు కారణంగా ఉల్లి ధరలు అమాంతంగా పెరిగిపోయిన సంగతి తెలిసిందే.

# రుణమాఫీ ఉత్తర్వులు రద్దు

### – రుణమాఫీ నిధులు నిలిపివేస్తూ జగన్ సర్కార్ నిర్ణయం
### – రద్దు ఉత్తర్వులు జారీచేసిన వ్యవసాయశాఖ

అమరావతి, సెప్టెంబర్26(ఆర్ఎన్ఎ) : ఏపీ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. టీడీపీ సర్కార్ హయాంలో మంజూరు చేసిన రుణమాఫీ ఉత్తర్వుల్ని రద్దు చేసింది. ఈ ఏడాది మార్చి 10న జారీ చేసిన జీవో 38ని రద్దు చేస్తూ.. బుధవారం వ్యవసాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. తాజా నిర్ణయంతో పెండింగ్‌లో ఉన్న.. 4,5 విడత రుణ మాఫీ నిధులు రూ.7959.12 కోట్లు నిలిచిపోయాయి. దీంతో టీడీపీ సర్కార్ హయాంలో ఇచ్చిన హామీపత్రాల సంగతేంటని రైతులు ప్రశ్నిస్తున్నారు. గత ప్రభుత్వం 4,5 విడతల్లో మొత్తం 10శాతం వడ్డీని కలుపుతూ జీవో నంబర్ 38ని ఇచ్చింది. ఈ జీవోను జగన్ సర్కార్ రద్దు చేసింది. రాష్ట్రంలో వైఎస్ఆర్ రైతు భరోసా పథకం అమలుకు సిద్ధమయ్యింది.. అందుకే ఈ తాజా ఉత్తర్వులు జారీ చేశారని తెలుస్తోంది. గత ప్రభుత్వ ఉత్తర్వులను రద్దు చేస్తూ జగన్ ప్రభుత్వం ఇప్పుడు జీవో 99ని విడుదల చేసింది. రుణమాఫీ రద్దు చేయడంతో రైతులు గందరగోళంలో ఉన్నారు. గత ప్రభుత్వం రుణమాఫీ చేస్తుందనే ఆశతో గతంలో తీసుకున్న లోన్లు కట్టుకుండా ఆపేశారు. అయితే తొలి మూడు విడతలు రుణ మాఫీ చేసినా.. 4,5 విడతలు మాత్రం పెండింగ్‌లో ఉన్నాయి.. కొత్తగా ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రుణమాఫీపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఇప్పుడు తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కట్టాల్సిన రుణాల పరిస్థితి ఏంటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# చంద్రబాబు మళ్లీ సీఎం కావటం ఖాయం

### – ఆర్కే.. ప్రజలకు ఎమ్మెల్యేనా.. చంద్రబాబు నివాసానికా?
### – ఆయనతో బహిరంగ చర్చకు తాను సిద్ధం
### – ఇంటి అనుమతులు చూపించినా నోటీసులు జారీచేస్తారా?
### – 2007లో వైఎస్ హయాంలోనే అనుమతులిచ్చారు
### – ఆ ఇల్లు అక్రమమైతే వైఎస్ ఇచ్చిన జీవోలు కూడా అక్రమే అని జగన్ ప్రకటించాలి
### – టీడీపీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న

విజయవాడ, సెప్టెంబర్26(ఆర్ఎన్ఎ) : చంద్రబాబు నాయుడు మళ్లీ సీఎం కావటం ఖాయమని, ప్రజలంతా వైసీపీ కుట్రలతో విసిగిపోయి, ఇబ్బందులు తట్టుకోలేక మళ్లీ బాబే కావాలంటున్నారని టీడీపీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న అన్నారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.. ఈ సందర్భంగా మంగళగిరి వైసీపీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డిపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆర్కే మంగళగిరికి ఎమ్మెల్యేనా? లేక చంద్రబాబు నివాసానికి ఎమ్మెల్యేనా? అని ప్రశ్నించారు. చంద్రబాబు నివాసం ఉంటున్న ఇంటి అనుమతుల విషయంలో బహిరంగ చర్చకు తాను సిద్ధమని ప్రకటించారు. ఆర్కే కూడా చర్చకు సిద్ధమా? అని సవాల్ విసిరారు. రాష్ట్రంలో సమస్యలు లేనట్లు చంద్రబాబు ఇంటినే టార్గెట్ చేశారని మండిపడ్డారు. ఇంటి యజమాని లింగమనేని రమేష్ అన్ని అనుమతులు చూపించినా నోటీసులు జారీ చేశారన్నారు. చంద్రబాబు ఉన్నారనే కారణంతోనే ఇల్లు కూలగొట్టాలని కుట్రలు చేస్తున్నారని వాపోయారు. 2007లో వైఎస్ సీఎంగా ఉన్న సమయంలోనే ఆ ఇంటికి అనుమతులు ఇచ్చారని గుర్తుచేశారు. ఆ ఇల్లు అక్రమం అయితే వైఎస్ ఇచ్చిన జీవోలు కూడా అక్రమం అని జగన్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఆర్కే ఒక డీఎస్పీని బినామీగా పెట్టుకుని కోట్లు కూడబెట్టారని ఆరోపించారు. ఇటీవల ఆ డీఎస్పీకి ప్రమోషన్ ఇప్పించింది వాస్తవం కాదా అంటూ ప్రశ్నించారు. పడవ ప్రమాదం, ఇసుక కొరత, వరదలు వంటి అంశాల్లో ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుందన్నారు. వీటి నుంచి బయట పడేందుకే చంద్రబాబు ఇంటి చుట్టూ రాజకీయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్‌కు కట్టడం ఎలాగూ రాదు.. కనీసం కూల్చడమైనా మానుకోవాలని హితవు పలికారు. ప్రజా వేదికను ఆర్భాటంగా కూల్చి ఏమి సాధించారని నిలదీశారు. ఇప్పటికైనా ప్రజల సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని కోరారు. నదీ పరివాహ ప్రాంతంలో చాలా ఇళ్లు ఉన్నాయని, వాటి జోలికి ఎందుకు వెళ్లడం లేదని ప్రశ్నించారు. ఎంతసేపు చంద్రబాబు ఇంటి జపం చేయడం తప్ప మంత్రులకు మరో పని లేదా అంటూ ప్రశ్నించారు. రాష్ట్రం మొత్తం చూస్తే... అక్రమ నిర్మాణాలు చాలా ఉన్నాయన్నారు. అన్నీ కూలుస్తారా అని నిలదీశారు. రాష్ట్రంలో సమస్యలు పక్కదారి పట్టించేందుకే ప్రభుత్వం చంద్రబాబుపై కక్ష పూరితంగా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కోడెలను వేధించినట్టుగానే చంద్రబాబును కూడా మానసికంగా దెబ్బ తీయాలని చూస్తున్నారన్నారు. జగన్ లాంటి ఎంతో మందిని చూసిన బాబు.. ఆయన ముందు ఎవరి ఆటలు సాగవని చెప్పారు. జగన్ వంద రోజుల పాలనతోనే వైసీపీ పని అయిపోయిందన్న సంగతి విజయసాయి రెడ్డి గుర్తించుకోవాలన్నారు. చంద్రబాబు సినిమా అయిపోయిందని పగటి కలలు కంటున్నారా?, చంద్రబాబు ముఖ్యమంత్రి అనే సినిమా ప్రస్తుతం మూడు భాగాలే అయ్యిందన్నారు. నాలుగో భాగంలో మళ్లీ చంద్రబాబు సీఎం అవడం ఖాయమని బుద్దా జోస్యం చెప్పారు.

# విశాఖ తీరం వద్ద నిఘా పెంపు

విశాఖపట్నం, సెప్టెంబర్26 (ఆర్ఎన్ఎ) : దేశంలోని పలు నగరాలపై దాడులు చేస్తామంటూ ఉగ్రవాదులు బెదిరింపుల నేపథ్యంలో ఐబీ హెచ్చరికలు చేయడంతో విశాఖ తీరంలో హై అలర్ట్ ప్రకటించారు. కోస్ట్‌గార్డ్, నేవీతో సహా మెరైన్ పోలీసులు అప్రమత్తమై, పర్యవేక్షిస్తున్నారు. తీరం వెంబడి భద్రత కట్టుదిట్టం చేశారు. విశాఖ తీర ప్రాంతాన్ని అప్రమత్తం చేసినట్లు మెరైన్ డీఎస్పీ వెల్లడించారు. ఏపీలోని 974 కి.మీ తీర ప్రాంతంలో నిఘా పెంచినట్లు పేర్కొన్నారు. అలాగే మత్స్యకారులకు సూచనలు జారీ చేశామన్నారు. అనుమానంగా ఎవరైనా సంచరిస్తుంటే సమాచారం ఇవ్వాలని కోరారు. నేవీ, కోస్ట్‌గార్డ్, సివిల్ పోలీసుల సమన్వయంతో పనిచేస్తున్నట్లు తెలిపారు.

# వృద్ధురాలి కళ్లలో కారం చల్లి 10 తులాల బంగారం చోరీ

నెల్లూరుసెప్టెంబర్26(ఆర్ఎన్ఎ): ఓ యువకుడు ఇంట్లో ఒంటరిగా ఉన్న వృద్ధురాలి కళ్లలో కారం చల్లి ఆమె ఒంటిపై ఉన్న సుమారు పది సవర్ల బంగారు నగలు అపహరించి పరారయ్యాడు. ఈ సంఘటన నాయుడుపేటలో మంళవారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు.. ఎల్ఐసీ కార్యాలయం ఎదురుగా మి÷–దదెపై విశ్రాంతి ఉపాధ్యాయురాలు చతురవేదుల విశాలక్ష్మమ్మ అనే వృద్ధురాలు ఒంటరిగా నివాసం ఉంటోంది. ఈ విషయాన్ని పసిగట్టిన గుర్తుతెలియని యువకుడు మంగళవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో ఆమె ఇంట్లోకి చొరబడి కళ్లలో కారం చల్లాడు.

వెంటనే ఆమె మెడలో ఉన్న మూడు బంగారు చైన్లను లాక్కొని పరారయ్యాడు. వృద్ధురాలు పెద్దఎత్తున కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు ఘటనా స్థలానికి చేరుకునేసరికి దుండగుడు రైల్వే స్టేషన్ రహదారి వైపు ఉడాయించాడు. సమాచారం అందుకున్న ఎస్సై డి.వెంకటేశ్వరరావు వృద్ధురాలి ఇంటికి వెళ్లి ఆమెతో మాట్లాడాడు. నిందితుడి కోసం చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. రహదారిపై ఉన్న సీసీ కెమెరాల ద్వారా ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నారు. కాగా పరారైన నిందితుడిని పోలీసులు పట్టుకున్నట్లు తెలిసింది. ఘటన జరిగిన తర్వాత పోలీసు సిబ్బంది, స్థానిక యువకులు పెద్దఎత్తున నిందితుడి కోసం జల్లెడ పట్టారు. ఓ మద్యం షాపు వద్ద నిందితుడు ఉండగా పట్టుకున్నారు. అతనితోపాటు మరో వ్యక్తి ఈ చోరీలో పాలుపంచుకున్నట్లుగా సమాచారం.

# కంటివెలుగు పథకం విజయానికి వైద్యులు సహకరించాలి: మంత్రి నాని

అమరావతి, సెప్టెంబర్25(ఆర్ఎన్ఎ) : రాష్ట్రవ్యాప్తంగా అక్టోబరు 10వ తేదీ నుంచి 'కంటి వెలుగు' పథకం ప్రారంభిస్తామని డిప్యూటీ సీఎం ఆళ్ల నాని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ పథకం కింద రూ.560 కోట్లతో కంటి పరీక్షలు నిర్వహిస్తామన్నారు. మంగళవారంనాడు నేత్రవైద్య నిపుణులు పలువురు మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈనెల 28న కాకినాడలో జరిగే నేత్ర వైద్యనిపుణుల సదస్సుకు రావాలని ఆహ్వాన పత్రిక అందించారు. దీనిపై మంత్రి నాని స్పందిస్తూ రాష్ట్రంలో 5 కోట్ల 30 లక్షల మంది ప్రజలకు కంటి పరీక్షలు, ఆధునిక వైద్యం అందించడానికి వైఎస్సార్ కంటి వెలుగు పథకాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు.

ఈ పథకం విజయవంతం కావడానికి నేత్రవైద్యులు రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వానికి సహకరించాలన్నారు. అక్టోబరు 10 నుంచి 16వ తేదీ వరకు కంటి పరీక్షలు జరుగుతాయని, తర్వాత ఆరు దశల్లో కంటిచూపు లోపం గుర్తించిన వారందరికీ ఆధునిక వైద్యపరీక్షలు, అవసరమైన శస్త్ర చికిత్సలు, మందులు, కళ్ళజోళ్ళు ఉచితంగా అందజేస్తామన్నారు. అక్టోబరు 10న 70 లక్షల మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో నేత్రవైద్యులు ఏఎస్ రామ్, నాదేళ్ళ విష్ణువర్ధన్‌రావు, విజయభాస్కర్‌రెడ్డి, తదితరులు పథకానికి సహకరిస్తామని హామీ ఇచ్చారు.

# ఏపీలో అధికారుల బదిలీలు

అమరావతి, సెప్టెంబర్26(ఆర్ఎన్ఎ) : ఏపీలో అధికారుల బదిలీల పర్వం ప్రారంభమైంది. ఈ క్రమంలోనే ఏపీ ఆర్టీసీ ఎండీ ఎన్వీ సురేంద్రబాబును బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సురేంద్రబాబును డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. రవాణాశాఖ ముఖ్యకార్యదర్శి కృష్ణబాబుకు ఆర్టీసీ ఎండీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. అలాగే చేనేత, జౌళిశాఖ కార్యదర్శి శ్రీనివాస శ్రీనరేష్ కూడా బదిలీ అయ్యారు. సాధారణ పరిపాలనశాఖకు రిపోర్టు చేయాలని ఆదేశించారు. సీఎంవో కార్యదర్శి జె.మురళికి చేనేత, జౌళిశాఖ కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇక ఏపీ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు సీఈవోగా జేఎన్వీ సుబ్రమణ్యాన్ని నియమించారు. సుబ్రమణ్యం అసోం నుంచి డిప్యూటేషన్‌పై ఏపీకి వచ్చారు.

# 221 అడుగుల ఎత్తుతో రావణుడి దిష్టిబొమ్మ

చండీఘర్, సెప్టెంబర్26(ఆర్ఎన్ఎ): దసరా పండుగ రోజున దేశమంతటా రావణ దహన వేడుకలు నిర్వహిస్తున్న విషయం విదితమే. ఈ క్రమంలో దసరా రోజున రావణాసురుని దిష్టిబొమ్మను దహనం చేయడం అనవాయితీగా మారింది. అయితే ఛండీఘర్‌లో రావణ దహన వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఓ సంస్థ ఏర్పాట్లు చేస్తోంది. ఈ సందర్భంగా ఆ సంస్థకు చెందిన ఓ నిర్వాహకుడు మాట్లాడుతూ.. రావణుడి దిష్టిబొమ్మను 221 ఫీట్ల ఎత్తులో నిర్మిస్తున్నామని తెలిపాడు. ఈ దిష్టిబొమ్మను తయారు చేసేందుకు రూ. 30 లక్షలు ఖర్చు చేస్తున్నామని చెప్పాడు.

గతేడాది 210 ఫీట్ల ఎత్తులో తయారు చేశాము. ఇప్పుడేమో గతేడాది కంటే 11 ఫీట్ల ఎత్తును పెంచామన్నాడు. దీంతో మరోసారి ప్రపంచ రికార్డు నెలకొల్పబోతున్నామని పేర్కొన్నాడు. ఈ బొమ్మ బరువు సుమారు 70 క్వింటాళ్లు ఉంటుంది. దీని నిర్మాణం అక్టోబర్ 2వ తేదీ వరకు పూర్తి చేసి.. ఆ తర్వాత సందర్శనకు పెడుతామని తెలిపాడు. అక్టోబర్ 3 నుంచి 7వ తేదీ వరకు రావణుడి దిష్టిబొమ్మ ముందు అనేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నాడు. అక్టోబర్ 8(దసరా)న రావణాసురుడి దిష్టిబొమ్మను దహనం చేస్తామని చెప్పాడు. అయితే దిష్టిబొమ్మలో ఉపయోగించిన బాణాసంచా.. కాలుష్యరహితంగా ఉంటాయని నిర్వాహకుడు స్పష్టం చేశాడు.

# 29 నుంచి ఇంద్రకీలాద్రి అమ్మవారి ఉత్సవాలు

గుంటూరు,సెప్టెంబర్26(ఆర్ఎన్ఎ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాలను దేవస్థానం ఈనెల 29 నుండి అక్టోబర్ 8 వరకు ఘనంగా నిర్వహించనుంది. అయితే ఈ ఉత్సవాలకు సిఎం జగన్‌ను ఆలయ ఈవో సురేశ్‌బాబు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన ఈరోజు గుంటూరు జిల్లా తాడేపల్లిలోని సిఎం నివాసంలో సిఎం జగన్‌ను కలిసి దసరా మహోత్సవాల్లో పాల్గొనాలి ్ందిగా ఆహ్వానం పలికారు. ఈవోతో పాటు దేవాదాయశాఖ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు వరంగా మారనున్న 'డయల్ 112'

న్యూఢిల్లీ, సెప్టెంబర్26(ఆర్ఎన్ఎ) : అత్యవసర సేవలన్నింటినీ ఒకే గొడుగు కిందకు తేవాలనే ఉద్దేశంతో ప్రవేశపెట్టిన ఎమర్జెన్సీ నంబర్ 112ను ఢిల్లీ పోలీసులు బుధవారం అందుబాటులోకి తెచ్చారు. ఈ యాప్ ద్వారా కాల్ చేసిన వ్యక్తి లోకేషన్ ట్రేస్ చేసి వారికి అతి త్వరగా సేవలను అందించనున్నారు. ఎవరైనా ఈ హెల్ప్‌లైన్ సేవలు వినియోగించుకోవాలంటే 112 నెంబరుకు డయల్ చేస్తే నెట్‌వర్క్ సిగ్నల్స్ లేదా జీపీఎస్ ద్వారా ఎమర్జెన్సీ రెస్పాన్స్ సెంటర్‌కు కనెక్ట్ అవుతుంది. అక్కడ వారికి అవసరమయ్యే సేవలను అందిస్తారు. ఈ విషయం గురించి స్పెషల్ పోలీస్ కమిషనర్ ముక్తేశ్ చంద్రా మాట్లాడుతూ, ఈ కొత్త సేవలతో కంట్రోల్ రూమ్ కాస్తా కాల్ సెంటర్‌గా మారిందన్నారు. ఒకవేళ ప్రజలు తెలీకుండా 100, 101, 102 సేవలకు కాల్ చేసినప్పటికీ అంతిమంగా అది 112కు కనెక్ట్ అవుతుందని పేర్కొన్నారు. 'డయల్ 112 అనేది ప్రజలకు వరంగా మారనుంది. ఇది కేవలం డబ్బు, సమయాన్ని ఆదా చేయడమే కాకుండా అత్యుత్తమ సేవలను అందించడానికి దోహదపడుతుంది' అని ముక్తేశ్ చంద్రా పేర్కొన్నారు. ప్రస్తుతం కంట్రోల్ రూమ్ సిబ్బంది సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. అంతేకాక కంట్రోల్ రూమ్‌ను శాలిమార్‌బాగ్‌లోని కొత్త భవనానికి బదిలీ చేయడమే కాక పూర్తిగా కాగితరహిత సేవలను మాత్రమే వినియోగించనున్నారు. ఒకే దేశం ఒకే ఎమర్జెన్సీ నంబర్ అనే విధానం అమెరికాలోనూ అమల్లో ఉంది. అక్కడ అన్ని రకాల సేవలకుగానూ 911 అనే నంబర్‌నే వినియోగిస్తారు.

# అన్ని వర్గాల ప్రజలనూ సిఎం ఆదుకుంటున్నారు: మంత్రి మల్లారెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్26(ఆర్ఎన్ఎ) : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జీవనోపాధి పథకం రెండో విడుత గొర్రెల పంపిణీని మంత్రులు సి.మల్లారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రారంభించారు. శామీర్‌పేట మండలం అలియాబాద్‌లో ఈ కార్యక్రమం అట్టహాసంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా కార్మిక శాఖామంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలను ఆదుకుంటున్నారని అన్నారు. అందులో భాగంగానే గొల్ల, కురుమలకు ఉపాధి కల్పించేందుకు గొర్రెలను పంపిణీ చేస్తున్నారన్నారు. సినిమాటోగ్రఫీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏం చేసినా ప్రజలు బాగుపడాలనే ఉద్దేశ్యంతోనే చేస్తుందన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వం భారీగా రుణాలు అందిస్తుందన్నారు. స్వయం ఉపాధి పొందడానికి యువతను ప్రోత్సహిస్తోందన్నారు. వారికి ఆర్థికంగానూ సాయపడుతుందని మంత్రి అన్నారు.గొల్ల, కురుమలకు రాయితీతో గొర్రెలను అందిస్తుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా యాదవ సోదరులకు మంత్రులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఎం వి రెడ్డి, ఎమ్మెల్సీలు శంభీపూర్ రాజు, నవీన్ రావు, జెడ్పీ చైర్మన్ శరత్ చంద్రారెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ వెంకటేష్, జెడ్పీటీసీలు అనిత, శైలజ, ఎంపీపీలు ఎల్లుబాయి, పద్మజ మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# దేశంలో పెరుగుతున్న శ్రీమంతులు

## ప్రథమ స్థానంలో ముఖేశ్ అంబానీ

ముంబై, సెప్టెంబర్26(ఆర్ఎన్ఎ) : భారత్‌లోనే అత్యంత సంపన్నుడిగా రిలయన్స్ సంస్థల అధినేత ముఖేశ్ అంబానీ ప్రథమ స్థానంలో నిలిచారు. ఆయన ఆస్తుల విలువ అక్షరాలా రూ. 3,80,700 కోట్లు. ప్రముఖ సంస్థ ఐఐఎఫ్ఎల్ వెల్త్ హురన్ భారత కుబేరుల జాబితాను విడుదల చేసింది. ఇందులో వరుసగా ఎనిమిదోసారి ముఖేశ్ అంబానీ అగ్రస్థానంలో నిలిచారు. ఇక రూ. 1,86,500 కోట్ల సంపదతో హిందుజా కుటుంబం సంపన్నుల జాబితాలో రెండో స్థానంలో ఉంది. విప్రో వ్యవస్థాపకుడు అజీమ్ ప్రేమ్‌జీ మూడో స్థానంలో ఉన్నారు. ఆయన ఆస్తుల విలువ రూ. 1,17,100 కోట్లు. ఎర్సెలార్‌మిత్తల్ చైర్మన్ ఎల్ఎన్ మిత్తల్ (సంపద రూ. 1,07,300 కోట్లు) నాలుగో స్థానంలో, గౌతమ్ అదానీ (సంపద రూ. 94,500కోట్లు) ఐదో స్థానంలో నిలిచారు. ఉదయ్ కొటక్, సైరస్ ఎస్ పూనావాలా, పల్లోంజి మిస్త్రీ, షాపూర్ పల్లోంజి, దిలీప్ షంఘ్వీలకు టాప్ 10లో చోటు దక్కించుకున్నారు.

ఇక మన దేశంలో శ్రీమంతుల సంఖ్య కూడా పెరిగిందని ఐఐఎఫ్ఎల్ నివేదిక తెలిపింది. 2018 సంవత్సరంలో రూ. 1000 కోట్ల కంటే ఎక్కువ సంపద కలిగిన వారు 831 మంది ఉండగా, ఈ ఏడాది ఆ సంఖ్య 953కు పెరిగింది. టాప్ 25 స్థానాల్లో ఉన్న సంపన్నుల మొత్తం సంపద మన దేశ జీడీపీలో 10 శాతానికి సమానమని నివేదిక పేర్కొంది.

# అక్రమ కేసులు బనాయిస్తారని ముందే ఊహించా: శరద్ పవార్

ముంబై, సెప్టెంబర్26(ఆర్ఎన్ఎ) : మహారాష్ట్ర ఎన్నికల ముందు ఇలాంటి అక్రమ కేసులు బనాయిస్తారని ముందే ఊహించానని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్సీపీ) అధినేత శరద్ పవార్ వ్యాఖ్యానించారు. అయితే ఈ కేసులో తన వద్ద ఉన్న సమాచారాన్ని ఈడీకి వెల్లడించేందుకు ఈ నెల 27వ తేదీన స్వయంగా ఈడీ ఆఫీసుకు వెళ్తానని శరద్ పవార్ ప్రకటించారు. మహారాష్ట్ర కో ఆపరేటివ్ బ్యాంకు(ఎంఎస్సీబీ)లో రూ. 25 వేల కోట్ల కుంభకోణానికి సంబంధించి శరద్ పవార్, ఆయన్న అన్న కుమారుడు అజిత్ పవార్‌పై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) మనీల్యాండరింగ్ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే.

కేసులో ఏ క్షణమైనా జైలుకు పోవడానికి సిద్ధంగా ఉన్నానని ఆయన స్పష్టం చేశారు. ఢిల్లీ సింహాసనం ముందు మహారాష్ట్ర మోకరిల్లదని,ఛత్రపతి శివాజీ మహారాజ్ భావజాలాన్ని ఆదర్శంగా తీసుకుంటుందని శరద్ పవార్ పేర్కొన్నారు. తనపై మనీల్యాండరింగ్ కేసు నమోదు చేయడం ఆశ్చర్యానికి గురి చేసిందన్నారు. ఇదిలా ఉండగా, అక్టోబర్ 21న జరిగే మహారాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో ఎన్సీపీ - కాంగ్రెస్ కలిసి పోటీ చేస్తోంది.

# పాఠశాల అదనపు గదుల నిర్మాణానికి శంకుస్థాపన

మెదక్, సెప్టెంబర్26(ఆర్ఎన్ఎ) : బుధవారం నాడు మెదక్ జిల్లాలో మంత్రి హరీశ్ రావు పర్యటించారు. చిన్నశంకరంపేటలో ఉన్నత పాఠశాల అదనపు గదుల నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్ రావు, స్థానిక ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డికి ప్రజలు ఘనస్వాగతం పలికారు. డప్పుచప్పులు, బతుకమ్మ ఆటపాటలతో ఎదుర్కొన్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన క్రెయిన్‌తో హరీశ్ రావు మెడలో గజమాలవేశారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, స్థానిక జడ్పీటీసీ మాధవి రాజు, ఇతర ప్రజాప్రతనిధులు, ప్రజలు భారీగా పాల్గొన్నారు.

# లింగమనేని గెస్ట్ హౌస్‌కు అనుమతులు లేవు

**- చర్చకు లింగమనేని సిద్ధమా?**

**- బాబు, లింగమనేని కలిసి కుట్రలు పన్నుతున్నారు**

**- వైసీపీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి**

అమరావతి, సెప్టెంబర్26 (ఆర్ఎన్ఎ) : కృష్ణా కరకట్ట పక్కనే ఉన్న లింగనేని గెస్ట్ హౌస్‌కు ఎలాంటి అనుమతులు లేవని, అవి ముమ్మాలికి అక్రమ నిర్మాణాలేనని వైసీపీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సీఎం జగన్‌కు లింగమనేని రాసిన లేఖపై స్పందించారు. అసలు ఆయన గెస్ట్ హౌజ్‌కు అనుమతులు లేవని స్పష్టం చేశారు. కూల్చేస్తున్నారంటూ గుండె కోత ఉందంటున్న లింగమనేని, వాస్తవం ఏంటో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. బాబు..లింగమనేని కలిసి కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. హైకోర్టు ద్వారా నోటీసులు ఇప్పించడం జరిగిందని, తిరిగి కౌంటర్ దాఖలు చేసే ప్రయత్నం చేయని లింగమనేని ప్రజల కోసం పనిచేస్తున్న జగన్ ప్రభుత్వాన్ని ఇబ్బందులు పాలు చేసే విధంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ల్యాండ్ పూలింగ్ ఎక్కడైతే ఆగిందో అక్కడనే లింగమనేని ఆస్తులున్నాయన్నారు. బాబు, లోకేష్‌లకు ఇంటి అద్దె ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. ఇలా వారు రూ. కోటి 20 లక్షలు హెచ్ఏఆర్ కింద ప్రజాధనం డ్రా చేసుకున్నారని తెలిపారు. వీరిద్దరూ డబ్బులు ఇచ్చారా లేదా తెలియచేయాలని లింగమనేనిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

డబ్బులు ఇస్తే, ఐటీ రిటర్న్‌లో చూపించారా లేక ఉచితంగా ఇస్తే..రూ. కోటి 20 లక్షలు బాబు, లోకేష్‌లు ఎలా డ్రా చేస్తారని సూటిగా ప్రశ్నించారు. పొన్నూరు నియోజకవర్గంలో 20ఎకరాలు అప్పన్నంగా లింగమనేని కాజేశారని ఆరోపించారు. రెయిన్ ట్రీ పార్కుకు ఎలా దారి వచ్చిందో ప్రజలు తెలుసుకోవాల్సిన అవసరం ఉందని, వాస్తవాలు బయట పెడుతానన్నారు.

ఈ పార్కుకు మంచినీళ్లు ఎక్కడి నుంచి వస్తున్నా యని, ఇందుకు వేసిన పైపులైన్‌కు డబ్బులు ఎక్కడి నుంచి వచ్చాయని ప్రశ్నించారు. కక్ష కట్టాల్సిన అవసరం సీఎం జగన్‌కు అవసరం లేదన్నారు. ఎట్టిపరిస్థితుల్లోనూ కృష్ణానది వెంట లింగమనేని అక్రమంగా నిర్మించిన భవనాన్ని కూల్చేస్తామని రామకృష్ణారెడ్డి స్పష్టం చేశారు.

# మేడారం జాతరు జాతీయ హోదా ఇవ్వాలి: మంత్రి సత్యవతి రాథోడ్

మహబూబాబాద్, సెప్టెంబర్26 (ఆర్ఎన్ఎ) : ఆసియాలోనే అతిపెద్ద గిరిజన మేడారం జాతరకు జాతీయ హోదా ఇవ్వాలని, ఈ విషయమై కేంద్రంపై ఒత్తిడి చేసేందుకు త్వరలో ఎంపీలతో కలిసి ఢిల్లీ వెళ్తానని చెప్పారు. గిరిజన మహిళైన తనకు ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావు గొప్ప అవకాశం కల్పించారని మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు.

బుధవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ, సీఎం కేసీఆర్‌కు, టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఆమె ధన్యవాదాలు తెలిపారు. తనపైన ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయనన్నారు.తన రాజకీయ ఎదుగుదలకు కారణమైన డోర్నకల్ గడ్డ అభివృద్ధికి పాటుపడతానన్నారు. పెద్ద ఎత్తున స్వాగతం పలికిన పార్టీ శ్రేణులకు, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. గిరిజనుల అభివృద్ధికి ఏ ముఖ్యమంత్రి చేపట్టని విధంగా సంక్షేమ పథకాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. మూడువేలకు పైగా తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసి, తమ తండాలో తమ రాజ్యాన్ని అమలు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని కొనియాడారు. మాజీ మంత్రి రెడ్యానాయక్‌తో కలిసి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని అన్నారు.

# రివర్స్ టెండరింగ్‌తో రాష్ట్రంపై రూ.1600 కోట్ల భారం

## ఒకే ఒక్క కంపెనీ బిడ్ వేయటంపై అనుమానాలు

అమరావతి, సెప్టెంబర్26(ఆర్ఎన్ఎ): పోలవరం ప్రాజెక్ట్ లో అవినీతి జరిగిందని చెప్పి నవయుగ సంస్థతో ఉన్న ఒప్పందాన్ని రద్దు చేసిన జగన్ సర్కార్ రివర్స్ టెండరింగ్ కు వెళ్లిన సంగతి తెలిసిందే.

తాజాగా ఈ విధానంలో మేఘా ఇంజనీరింగ్ సంస్థ రూ.4358 కోట్లకు దక్కించుకున్న విషయం తెలిసిందే. ఐతే దీని పై స్పందించిన సీనియర్ టీడీపీ నేత ధూళిపాళ నరేంద్ర రివర్స్ టెండరింగ్ వల్ల రాష్ట్రంపై రూ.1600 కోట్ల మేర భారం పడుతుందని అన్నారు. రివర్స్ టెండరింగ్ లో ఒకే సంస్థ టెండర్ వేసిందంటే అర్థం ఏంటని అయన ప్రశ్నించారు. ప్రభుత్వం విడుదల చేసిన జీవో 67 నిబంధనలకు విరుద్ధంగా ఒకే సంస్థకు పనులు కట్టబెడుతున్నారని ఆరోపించారు. ఏ విశ్వసనీయతతో మేఘా సంస్థకు టెండరు అప్పగించారో చెప్పాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వంపై విశ్వసనీయత ఉంటే కేవలం ఒక్క సంస్థే టెండరు ఎలా వేస్తుందని నరేంద్ర అన్నారు. ప్రీబిడ్ సమావేశానికి ఎనిమిది కంపెనీలు హాజరైనా ప్రభుత్వంపై నమ్మకం లేకే మిగిలిన సంస్థలు ముందుకు రాలేదని నరేంద్ర వ్యాఖ్యానించారు. కాంట్రాక్టు సంస్థకు రూ.300 కోట్లు ఇచ్చారని, పనుల్లో జాప్యం వల్ల రూ.300 కోట్ల వరకుభారం పడుతుందని పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ చెప్పిందని తెలిపారు. ఇపుడు విద్యుత్ ప్రాజెక్టు ఆలస్యం కారణంగా మరో రూ.1000 కోట్ల వరకు భారం పడుతుందని వివరించారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం విషయం లో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ గోదావరి జిల్లాల భద్రతను పణంగా పెడుతున్నారని ప్రభుత్వం పై నరేంద్ర తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# అక్రమ కట్టడాలపై ఉక్కుపాదం

## చంద్రబాబు ఇంటికి నోటీసులు అంటించిన అధికారులు

అమరావతి,సెప్టెంబర్26(ఆర్ఎన్ఎ): వైసీపీ అధికారంలోకి రాగానే అక్రమ కట్టడాలపై ఉక్కుపాదం అంటూ శంఖారావం మోగించింది. అందులో భాగంగా ఏకంగా 'ప్రజావేదిక' నే కూల్చి వేసింది. ప్రజాధనాన్ని వృథా చేసిందని విమర్శలు కూడా ఎదుర్కొంది అది వేరే విషయం. ఆ కూల్చివేత ప్రజావేదిక తో ఆగిపోలేదు. పలువురు ప్రతిపక్ష టీడీపీ నేతలకు నోటీసులు వచ్చాయి. కొన్ని భవనాలు నేలమట్టమయ్యాయి కూడా. అయితే ఇక్కడ ముఖ్యంగా టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబు గురించి మాట్లాడుకోవాలి. ఉండవల్లిలో నివాసం ఉంటున్న ఇంటికి ఇప్పటికే సీఆర్డీఏ అధికారులు నోటీసులు ఇచ్చారు. ఇంటిని ఖాళీ చేయాలనీ చెప్పారు. మరోవైపు అధికార పార్టీ నేతలు ఆ ఇల్లు అక్రమ నిర్మాణం, దాన్ని కూల్చివేయాల్సిందే అని చెప్పుకొచ్చారు. అయితే ఈ అంశం కొన్ని రోజులు సైలెంట్ గా ఉన్నట్టుండి మళ్లీ తెరమీదకు వచ్చింది.

చంద్రబాబు నివాసం ఉంటున్న ఇంటికి సీఆర్డీఏ అధికారులు మరోసారి నోటీసులు జారీ చేశారు. ఆయన ఇంటి గోడకు అధికారులు నోటీసులు అంటించారు. లింగమనేని రమేష్ పేరుతో సీఆర్డీఏ నోటీసులు అంటించింది. వారం రోజుల్లో ఇల్లు ఖాళీ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. గతంలో ఇచ్చిన నోటీసులనూ ప్రస్తుత నోటీసులో సీఆర్డీఏ అధికారులు పేర్కొన్నారు. గతంలో ఇచ్చిన సీఆర్డీఏ నోటీసులకు ఇంటి యజమాని రమేష్ వివరణ ఇచ్చారు. అయితే రమేష్ వివరణ సంతృప్తికరంగా లేదని సీఆర్డీఏ నోటీసులో పేర్కొంది. నిబంధనలకు విరుద్ధంగా గ్రౌండ్ ఎ÷-లోర్, ఫస్ట్ ఎ÷-లోర్, స్విమ్మింగ్ పూల్ లను నిర్మించారని తెలిపారు. కాగా, ఈ నోటీసుల వ్యవహారంపై లింగమనేని రమేష్ స్పందించారు. ఇంటి నిర్మాణ సమయానికి సీఆర్డీఏ లేదని పేర్కొన్నారు. ఉండవల్లి పంచాయతీ అనుమతి తీసుకుని ఇంటిని నిర్మించామని తెలిపారు. స్విమ్మింగ్‌పూల్‌కి రివర్ కన్సర్వేటర్ అనుమతి ఉందని రమేష్ వెల్లడించారు.

మరి ఈ నోటీసుపై చంద్రబాబు ఎలా స్పందిస్తారో వేచి చూడాలి. మరోవైపు.. గతంలో రమేష్ వివరణతో సంతృప్తి చెందని అధికారులు.. ఈసారి మాత్రం సంతృప్తి చెబుతారా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పరిస్థితి చూస్తుంటే చంద్రబాబు వారం రోజుల్లో ఇంటిని ఖాళీ చేయక తప్పేలా లేదు. అదే జరిగితే అధికార పార్టీ పంతం నెగ్గినట్టే. ఎందుకంటే అధికారంలోకి వచ్చినప్పటి నుండి వైసీపీ.. చంద్రబాబుని ఆ ఇంటి నుండి ఖాళీ చేయించాలని పట్టుదలతో ఉంది. చూద్దాం మరి ఏం జరుగుతుందో.

# దక్షిణ కొరియా పెట్టుబడులను ఆహ్వానిస్తున్నాం: మంత్రి కేటీఆర్




బుధవారం కొరియన్ ప్రతినిధి బృందం కొరియా కారవాన్‌తో సమావేశమై ప్రసంగిస్తున్న మంత్రి కేటీఆర్, చిత్రంలో సిఎస్ జోషి, తదితరులు.

హైదరాబాద్, సెప్టెంబర్26 (ఆర్ఎన్ఎ) తెలంగాణలో పెట్టుబడులకు గల అవకాశాలను పరిశ్రమల శాఖ మంత్రి కె.తారకరామారావు దక్షిణ కొరియా ప్రతినిధి బృందానికి వివరించారు. దేశంలోనే ఈజ్‌ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తో తెలంగాణమొదటి స్థానంలో ఉందని వారికి చెప్పారు. తెలంగాణలోకి వచ్చే దక్షిణ కొరియా పెట్టుబడులకు పూర్తి సహకారం ఉంటుందని తెలిపారు. ప్రతి సంవత్సరం దేశంలోని రెండు రాష్ట్రాలను ఎంచుకుని స్థానిక కొరియా రాయబార కార్యాలయం కొరియా కారవాన్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తుంది. అందులో భాగంగానే ఈసారి తెలంగాణ రాష్ట్రాన్ని ఎంచుకుని ఇక్కడి పెట్టుబడి అవకాశాలు, రాష్ట్రంతో సంబంధాలను బలోపేతం చేసుకునేందుకు 48 మందితో కూడిన బృందం తెలంగాణలో పర్యటిస్తోంది. బుధవారం కొరియన్ ప్రతినిధి బృందం కొరియా కారవాన్‌తో సమావేశమైంది. అనంతరం మంత్రి కేటీఆర్‌ను కలిసింది. ఈసందర్భంగా తెలంగాణ ఇండస్ట్రియల్ పాలసీ దేశంలోనే అత్యుత్తమమైనదని అన్నారు. ఇప్పటికే పలు దేశాలకుచెందిన భారీ పెట్టుబడులు తెలంగాణకు వచ్చాయని, ముఖ్యంగా ఐటి రంగంలో టాప్-5 కంపెనీలు ఇక్కడ తమ కార్యాలయాలు ఏర్పాటు చేశాయన్నారు. వాటితోపాటు 14 ఇతర రంగాలను తెలలంగాణ ప్రభుత్వం ప్రాధాన్యత రంగాలుగా గుర్తించి అనుమతులు, రాయితీలు కల్పిస్తోందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటికే పలు కొరియన్ కంపెనీలు పెట్టుబడులు పెట్టాయని మంత్రి కేటీఆర్ వారికి వివరించారు. తెలంగాణలో ప్రత్యేకించి కొరియన్‌కంపెనీల కోసం కొరియా క్లస్టర్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.దీని కోసం కొరియా పారిశ్రామిక వర్గాలు, కొరియా ట్రేడ్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్‌ఏజెన్సీ మొదలైన సంస్థలతో కలిసి పనిచేస్తామని తెలిపారు. తెలంగాణకు మరిన్ని పెట్టుబడులు వచ్చేందుకు తీసుకోవల్సిన చర్యల మీద ప్రతిపాదనలు ఇవ్వాలని కొరియన్ ప్రతినిధి బృందాన్నికోరారు.

ప్రస్తుతం ఆసియాలోని అతిపెద్ద లైఫ్ సైన్సెస్ క్లస్టర్ జినోమ్‌వ్యాలీ, ప్రపంచంలోనే అతిపెద్ద ఫార్మా క్లస్టర్ ఫార్మాసిటీలకు తెలంగాణ కేంద్రంగా ఉన్నదని కేటీఆర్ వారికి వివరించారు. దీంతోపాటు దేశంలోనే అతపెద్ద మెగా టెక్స్ టైల్‌పార్క్ వరంగల్‌లో సిద్ధం అవుతోందన్నారు. కొరియన్ టెక్స్‌టైల్ కంపనీల నుంచి పెట్టుబడులు వచ్చేందుకు సహకరించాలని కోరారు. ఇప్పటికే భారత్ దక్షిణ కొరియాకు టెక్స్‌టైల్ కంపెనీల ఆర్గనైజేషన్‌తో చర్చలు జరిపిందన్నారు. అవసరమైతే త్వరలోనే కొరియా కంపెనీల కోసం ప్రత్యేకంగా తెలంగాణ ప్రభుత్వం ఒక సమావేశం నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు. కొరియన్‌స్టార్టప్స్, ఇన్నోవేషన్ కంపెనీలు తెలంగాణలోకి ప్రవేశించేందుకు ప్రభుత్వంతోపాటు ఇక్కడి టీహబ్ సహకరిస్తుందని మంత్రి కేటీఆర్ అన్నారు హైదరాబాద్‌నగరం పెట్టుబడులకే కాకుండా ఇక్కడ నివాసం ఏర్పరుచుకోవడానికి అత్యుత్తమ ప్రదేశమని అన్నారు. మెర్సర్‌లాంటి ప్రముఖ కంపనీలు వరసగా ప్రథమస్థానాన్ని కట్టబెట్టాయన్నారు. నగరంలోని ఔటర్‌రింగ్‌రోడ్ వంటి మౌలిక సదుపాయాలు, యూనివర్శిటీలు, హెల్త్‌కేర్ రంగ వసతులు ఇక్కడికి నూతన కంపెనీలు వచ్చేందుకు ఉపయుక్తంగా ఉంటాయని మంత్రి వెల్లడించారు.

ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు నేతృత్వంలో రాష్ట్రంలో వ్యాపారాభివృద్ధికి, పెట్టుబడులకు సానుకూలమైన పరిస్థితులు ఉన్నాయని కొరియన్ రాయబారి షిన్ బొంగ్‌కిల్ కితాబిచ్చారు. భారత్ పెరుగుతున్నఆర్థిక వ్యవస్థ అని, ఇక్కడి భారీ మార్కెట్‌లో ఉన్న అవకాశాలను ఉపయోగించుకుంటామని అన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ ప్రభుత్వ ప్రధానకార్యదర్శి ఎస్‌కె జోషి, సీనియర్ ఐఎఎస్ అధికారులు అజయ్‌మిశ్రా, జనార్ధన్‌రెడ్డి,రామకృష్ణారెడ్డి, సోమేష్‌కుమార్, జయేష్ రంజన్, హర్‌ప్రీందర్‌సింగ్, ప్రాంతీయ పాస్‌పోర్ట్ అధికారి విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# క్యాబ్ డ్రైవర్ ఆత్మహత్య

హైదరాబాద్, సెప్టెంబర్26 (ఆర్ఎన్ఎ) : జీవితం మీద విరక్తి చెందిన ఓ క్యాబ్ డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. హైదరాబాద్‌కు చెందిన విజయ్ అనాథ. జీవనం సాగించడానికి క్యాబ్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. జీవితం ఏ మాత్రం సంతృప్తిగా లేదని భావించిన అతను ఆత్మహత్య చేసుకుందామనుకున్నాడు. సూసైడ్ చేసుకునే ముందు అనాథ శవాలకు అంత్యక్రియలు నిర్వహించే సెర్వ్ నీడ్ సంస్థ గురించి తెలుసుకున్నాడు. వారిని సంప్రదించి తాను సంపాదించిన 6 వేల రూపాయలను అందించి, అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఆత్మహత్యకు ముందు విజయ్ సూసైడ్ లెటర్ రాశాడు. తాను చనిపోయాక వాళ్లే (సెర్వ్‌నీడ్) తనకు అంతిమ సంస్కారాలు నిర్వహించాలనుకున్నాడు.

# పన్నెండేళ్ల బాలికపై రెండేళ్లుగా అత్యాచారం

కేరళ,సెప్టెంబర్26(ఆర్ఎన్ఎ) : కేరళలోని మలప్పురంలో దారుణం చోటు చేసుకుంది.చెలారి ప్రాంతంలో ఏడవ తరగతి చదువుతున్న పన్నెండేళ్ల బాలికపై తండ్రి సహా 30 మంది రెండేళ్లుగా అత్యాచారం జరుపుతున్న ఘోరం వెలుగు చూసింది. బాలిక ఇల్లు స్కూల్‌కు 500 మీటర్ల దూరంలో ఉంది. ఇంట్లో ఆర్థిక పరిస్థితులు బాగోలేకపోవడంతో కన్నతండ్రి ఆమెను వ్యభిచార వృత్తిలోకి దింపాడు. సదరు బాలికపై తండ్రి స్నేహితుడు తొలి సారి అత్యాచారం చేసి వాళ్లు కుటుంబానికి కావాల్సిన డబ్బులు ఇచ్చాడు. అలా సదురు బాలిక పై ఇప్పటివరకు 30 మంది అత్యాచారం చేసినట్టు తెలిసింది. బాలిక ఆరోగ్యం క్షీణించడంతో స్కూల్‌లో జరిగిన కౌన్సిలింగ్‌లో బాలిక వివరాలు వెల్లడించింది. బాలిక తల్లితో కూడా తండ్రి వ్యభిచారం చేయించినట్టు సమాచారం. తన ఇంటి డోర్ పై బాలిక సారీ అమ్మ అనే పదాలు రాసింది. తిరురంగడి పోలీస్ స్టేషన్ అధికారి నౌషద్ ఇబ్రహీం ఈ ఘటనపై కేసు నమోదు చేసి బాలిక తండ్రితో పాటు ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్ తరలించారు. ప్రస్తుతం బాలికను జువైనల్ హోమ్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. సూర్యనెల్లిలో 1996లో 16 ఏళ్ల బాలికపై 40 రోజుల వ్యవధిలో 37 మంది అత్యాచారం చేసిన ఘటనలు ఉన్నాయి. కన్నురు ప్రాంతం పరిశినికడువులో 16 ఏళ్ల బాలికపై సామూహిక అత్యాచారం చేశారు. గత ఏడు నెలలలో మల్లప్పురం పోలీస్ స్టేషన్‌లో పరిధిలో మైనర్లపై లైంగిక దాడుల కేసులు 289 నమోదయ్యాయని పోలీసులు వెల్లడించారు.

# రూ.20 కోట్లతో కనక దుర్గ స్వర్ణ విగ్రహం

కోల్‌కతా,సెప్టెంబర్26(ఆర్ఎన్ఎ): దేవీ. శరన్నవరాత్రుల కోసం బెంగాల్ సిద్ధమైంది. ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కోల్‌కతాలో దుర్గాదేవి భారీ స్వర్ణ విగ్రహాన్ని తయారు చేస్తున్నారు. 20 కోట్ల విలువైన బంగారంతో ఆ విగ్రహాన్ని రూపొందిస్తున్నారు. సెంట్రల్ కోల్‌కతాలో ఈ విగ్రహాన్ని ప్రతిష్టించనున్నారు. 13 అడుగుల ఎత్తు ఉన్న ఈ విగ్రహాన్ని సంతోష్ మిత్ర స్క్వేర్ వద్ద ఉన్న మండపంలో ఏర్పాటు చేయనున్నారు. మేలిమి బంగారంతో విగ్రహాన్ని తయారు చేస్తున్నామని, మా కనక దుర్గే ఈమే అని, సుమారు 50 కిలోల బంగారాన్ని వాడనున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ప్రస్తుతం తులం బంగారం ధర 40 వేల వరకు ఉన్నది. దీంతో ఈ విగ్రహం ఖరీదు దాదాపు 20 కోట్లు ఉంటుందని అంచనా వేస్తున్నారు.

# పెళ్లికి ఆలస్యం భరించలేక బాలిక ఆత్మహత్య

హైదరాబాద్,సెప్టెంబర్26(ఆర్ఎన్ఎ) : ప్రేమించిన యువకుడితో పెళ్లి చేసేందుకు తాను రెండేళ్లు ఆగలేనంటూ ఓ బాలిక ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన ఫలక్ నుమా పోలీస్టేషన్ పరిధిలో జరిగింది. ఫలక్ నుమాలో నివసించే ఓ బాలిక పదో తరగతి చదువుతోంది. కొంతకాలంగా సదరు బాలిక ఓ యువకుడిని ప్రేమిస్తోంది. తన ప్రేమ విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పి పెళ్లి చేయాలని కోరింది. అయితే మైనర్ కావడంతో రెండేళ్లు ఆగితే ప్రేమించిన యువకుడితోనే పెళ్లి చెస్తామని బాలిక తల్లిదండ్రులు చెప్పారు. తల్లిదండ్రుల మాటలను కాదని , ఈనెల 20న ఓ ఖాజీని కలిసి తన ప్రియుడితో పెళ్లి చేయాలని కోరింది. అయితే మైనర్ కావడం వల్ల తాను పెళ్లి చేయలేనని, రెండేళ్లు ఆగాలని ఆ బాలికకు ఖాజీ తేల్చి చెప్పాడు. రెండేళ్ల తరువాత పరిస్థితులు ఎలా ఉంటాయో తెలియదని, తాను ప్రేమించిన యువకుడితో పెళ్లి జరుగుతుందో తెలియదన్న బాధతో మనస్తాపం చెందిన సదరు బాలిక ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తన పెళ్లి జరగనందున ఆత్మహత్య చేసుకుంటున్నట్టు సదరు బాలిక సూసైడ్ నోట్ లో పేర్కొంది. సారీ డా?డీ, సారీ మమ్మీ అంటూ సూసైడ్ నోట్ లో పేర్కొంది. పోస్టుమార్టం కోసం సదరు బాలిక మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

# మన్మోహన్‌కు మోడీ పుట్టినరోజు శుభాకాంక్షలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్26(ఆర్ఎన్ఎ) : అధికార, ప్రతిపక్ష పార్టీలలో ఉన్నా వ్యక్తిగతంగా సత్సంబంధాలు నెరపడమని ముఖ్యమని అధికార పక్షం భావిస్తున్నది. తీవ్రస్థాయిలో విమర్శలు, ప్రతి విమర్శలు ఇరు పక్షాల మధ్య సాగుతూనే ఉన్నప్పటికీ, ప్రతిపక్ష నాయకుల పుట్టిన రోజులకు, అనారోగ్య సమయంలో ప్రధాని మోడీ తన భావాలను ట్విట్టర్ ద్వారా ప్రకటిస్తుంటారు. ఈ క్రమంలోనే గురువారం 87వ జన్మదినం జరుపుకుంటున్న మాజీ ప్రధాని, రాజ్యసభ సభ్యుడు, కాంగ్రెస్ నాయకుడు మన్మోహన్ సింగ్‌కు భారత ప్రధాని నరేంద్ర మోదీ ట్విటర్ ద్వారా పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. 'మన్మోహన్ జీ మీకు హృదయ పూర్వక పుట్టిన రోజు శుభాకాంక్షలు. మీరు ఎల్లప్పుడూ సంతోషంగా, ఆరోగ్యంగా ఉండాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను' అంటూ ట్వీట్ చేశారు. రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కూడా తన ట్విటర్ ఖాతా ద్వారా మన్మోహన్ సింగ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. మన్మోహన్ సేవలను పంజాబ్ ముఖ్యమంత్రి అమరిందర్ సింగ్ కొనియాడారు. 'భగవంతుడు మీకు ఎల్లప్పుడూ సుఖసంతోషాలను ఇవ్వాలని కోరుకుంటున్నాను' అంటూ శుభాకాంక్షలు తెలిపారు

# రేపు మేడ్చల్ ఐటీఐలో జాబ్ మేళా



మేడ్చల్,సెప్టెంబర్26(ఆర్ఎన్ఎ) : మేడ్చల్ ప్రభుత్వ ఐటీఐ కాలేజీలో ఈ నెల 27న జాబ్ మేళాను నిర్వహించనున్నట్టు జిల్లా ఉపాధి శాఖ అధికారి నిర్మల తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగే ఈ మేళాలో వివిధ ప్రైవేట్ సంస్థలు ప్రతినిధులు రానున్నారని పేర్కొన్నారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ విద్యార్హత కలిగి ఆసక్తి గల అభ్యర్థులు ఫొటో, సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు. వివరాలకు 952180 700లో సంప్రదించాలని తెలిపారు.

# బీజేపీలోకి రెజ్లింగ్ చాంపియన్ యోగేశ్వర్ దత్

చండీఘర్,సెప్టెంబర్26(ఆర్ఎన్ఎ): హర్యానా అసెంబ్లీకి వచ్చే నెలలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో రెజ్లింగ్ చాంపియన్ యోగేశ్వర్ దత్ బీజేపీలో చేరనున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో యోగేశ్వర్ దత్ పోటీ చేసే అవకాశం ఉందని ఆ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు సుభాష్ బరాలా తెలిపారు. పార్టీ కార్యాలయంలో సీనియర్ నేతలను యోగేశ్వర్ దత్ కలిశారని చెప్పారు. యోగేశ్వర్ దత్ ప్రస్తుతం చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసి బీజేపీలో చేరుతారని సుభాష్ బరాలా వెల్లడించారు. గత సార్వత్రిక ఎన్నికల సమయంలోనే యోగేశ్వర్ దత్‌ని బీజేపీ తరఫున పోటీ చేయించాలని భావించినట్లు ఆయన తెలిపారు. అయితే కొన్ని కారణాల వల్ల అప్పుడు యోగేశ్వర్ దత్ ఎన్నికల్లో పోటీ చేయలేదన్నారు. లండన్ వేదికగా 2012లో జరిగిన ఒలింపిక్ క్రీడల్లో యోగేశ్వర్ దత్ కాంస్య పతకాన్ని సాధించాడు.

# గ్రామ ప్రణాళికలో అందరూ భాగస్వాములు కావాలి

నిర్మల్, సెప్టెంబర్26 (ఆంఎన్ఎ) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 30 రోజుల గ్రామ ప్రణాళిక -కార్యాచరణ కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములవ్వాలని మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. నీలాయిపేట గ్రామంలో ఆయన 30 రోజుల గ్రామ ప్రణాళిక -కార్యాచరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామస్తులతో కలిసి శ్రమదానం చేసి, మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలనీ, హరిత హారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటాలని సూచించారు.

తెలంగాణ పల్లెలను దేశంలోనే అత్యుత్తమంగా తీర్చిదిద్దేందుకు సీఎం కేసీఆర్ 30 రోజుల ప్రత్యేక కార్యాచరణ రూపొందించారన్నారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖామంత్రి ఇంద్రకరణ్ రెడ్డితో పాటు కలెక్టర్ ప్రశాంతి, ఎస్పీ శశిధర్ రాజు, జెడ్పీ చైర్మన్ విజయలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే నల్లా ఇంద్రకరణ్ రెడ్డి, ఎంపీపీ రామేశ్వర్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

# మహిళా సంక్షేమానికి సీఎం పెద్ద పీట

హైదరాబాద్, సెప్టెంబర్26 (ఆర్ఎన్ఎ) : దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని ఆడపడుచులకు తెలంగాణ ప్రభుత్వం బతుకమ్మ చీరలను అందిస్తున్న విషయం తెలిసిందే. కీసరలో పగిడిశీల గార్డెన్స్‌లో కార్మిక, ఉపాధి శాఖమంత్రి మల్లారెడ్డి మహిళలకు బతుకమ్మ చీరలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఆడపడుచులు బతుకమ్మ పండుగ రోజు కొత్తబట్టలు ధరించి ఆనందంగా ఉండాలనే సదుద్దేశ్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ చీరలను అందజేస్తోందన్నారు. రాష్ట్ర ప్రజల బాగు కోసం సీఎం కేసీఆర్ చాలా మంచి పనులు చేస్తున్నారని మంత్రి అన్నారు.

# పాఠశాల అదనపు గదుల నిర్మాణానికి శంకుస్థాపన

మెదక్, సెప్టెంబర్26 (ఆర్ఎన్ఎ) : బుధవారం నాడు మెదక్ జిల్లాలో మంత్రి హరీశ్ రావు పర్యటించారు. చిన్నశంకరంపేటలో ఉన్నత పాఠశాల అదనపు గదుల నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్ రావు, స్థానిక ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డికి ప్రజలు ఘనస్వాగతం పలికారు. డప్పుచప్పులు, బతుకమ్మ ఆటపాటలతో ఎదుర్కొన్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన క్రెయిన్‌తో హరీశ్ రావు మెడలో గజమాలవేశారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, స్థానిక జడ్పీటీసీ మాధవి రాజు, ఇతర ప్రజాప్రతనిధులు, ప్రజలు భారీగా పాల్గొన్నారు.

# వరంగల్ పరిశ్రమలో పేలుడు: ముగ్గురికి గాయాలు

వరంగల్, సెప్టెంబర్26 (ఆర్ఎన్ఎ) : వరంగల్ అర్బన్ జిల్లాలో పేలుడు సంఘటన ప్రజలను భయాందోళనలకు గురి చేసింది. ఓ కంపెనీలో జరిగిన ఈ ఘటనలో ముగ్గురు మహిళలకు తీవ్రగాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే..వరంగల్ అర్బన్ జిల్లా ధర్మసాగర్ మండలంలో ఇండస్ట్రియల్ కారిడార్ ఉంది. అందులో భాగమైన రాంపూర్‌లో వజ్రాకు సంబంధించిన కెమికల్ ఫ్యాక్టరీ ఉంది. ఇక్కడ పలువురు కార్మికులు పనిచేస్తున్నారు. సెప్టెంబర్ 26వ తేదీన అంటే గురువారం రోజువారీలాగానే పనికి వెళ్లారు.

కాగా, పరిశ్రమలో ఒక్కసారిగా పేలుడు సంభవించింది. ఈ ఘటనలో గాయాలపాలైన వారిని రోహిణి ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. తమకు ఏం జరిగిందో తెలియదని మహిళా కార్మికురాలు తెలిపారు. తనకు గాయాలు కాగా..చెల్లి కాలు తీసివేశారని విలపిస్తూ చెప్పింది. బండలు కడిగే బ్రిక్స్ తయారవుతాయని వెల్లడించింది. గాయాలపాలైన వారిలో నాయినీ రజిత, నాయినీ స్వరూప, ప్రియాంకలున్నారు.

## మహిళల సంక్షేమంకోసం..

# కేసీఆర్ పరితపిస్తారు

### – ఆడపడుచులకు కేసీఆర్ ఇస్తున్న కానుక బతుకమ్మ చీర

### – కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్26 (ఆర్ఎన్ఎ) : తెలంగాణలో మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని, మహిళల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ పరితపిస్తాడని కార్మిక శాఖ మంత్రి సి. మల్లారెడ్డి అన్నారు. గురువారం నగరంలోని జవహర్‌నగర్ మున్సిపల్ కార్పోరేషన్ అధికారులు బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి మహిళలకు చీరలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బతుకమ్మ చీరల పంపిణీ విజయవంతంగా కొనసాగుతోందన్నారు. మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు కేసీఆర్ పలు పథకాలను అమలు చేస్తున్నారని అన్నారు. సీఎం కేసీఆర్ మహిళల సంక్షేమం కోసం పరితపిస్తారని, తెలంగాణ పండుగ దసరా సందర్భంగా ప్రతీ మహిళలకు కేసీఆర్ కానుకగా బతుకమ్మ చీర ఇవ్వటం జరుగుతుందని అన్నారు. మహిళల కోసం ఆయన ఎలాంటి రిస్క్ అయినా తీసుకుంటారనీ, దసరా పర్వదినాన మహిళలంతా కొత్త బట్టలు ధరించి సంతోషంగా ఉండాలని ఆయన ఈ బృహత్కార్యానికి శ్రీకారం చుట్టారన్నారని మంత్రి ఈ సందర్భంగా అన్నారు. తెలంగాణను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దాలన్నదే సీఎం కేసీఆర్ లక్ష్యమని, ఆ మేరకు ఐదేళ్లు పాలన సాగుతుందని, రెండవసారి అధికారంలోకి వచ్చిన తరువాత మరింత వేగంగా అద్భుత పాలన అందిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగేలా కేసీఆర్ నిర్ణయాలు తీసుకుంటున్నారని అన్నారు. ముఖ్యంగా రైతుల సంక్షేమం కోసం పెద్దపీట వేశారని, ప్రాజెక్టుల నిర్మాణాలను వేగంగా పూర్తిచేసి ప్రతీ ఇంటికి సాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.




జవహర్‌నగర్ మున్సిపల్ కార్పోరేషన్‌లో బతుకమ్మ చీరల పంపిణీ చేసిన కార్మిక శాఖమంత్రి సి. మల్లారెడ్డి.

# హఫీజ్ ఖర్చులకు డబ్బులివ్వండి

### – ఐరాస భద్రతా మండలిని ఆశ్రయించిన పాక్

### – సభ్యదేశాలు అభ్యంతరాలు చెప్పకపోవటంతో అంగీకరించిన భద్రతామండలి

న్యూఢిల్లీ, సెప్టెంబర్26(ఆర్ఎన్ఎ) : ఐక్యరాజ్యసమితి వేదికగా పాకిస్థాన్ ముసుగు బయటపడింది. ప్రపంచ ఉగ్రవాదులకు స్వర్గధామమైన పాకిస్థాన్.. ఓవైపు తాము ఉగ్రవాదాన్ని వ్యతిరేకిస్తామని చెబుతూనే వారికి ఆర్థికంగా సాయం చేస్తోన్న దాయాది.. అసలు రూపం ఐరాసలో బయట పడింది. ఓ అంతర్జాతీయ ఉగ్రవాది కోసం ఏకంగా ఐరాస భద్రతామండలిని ఆశ్రయించడం గమనార్హం. ముంబై మారణ హోమం సూత్రధాని హఫీజ్ సయీద్‌ను 2012లో అంతర్జాతీయ ఉగ్రవాదిగా భద్రతామండలి ప్రకటించిన విషయం తెలిసిందే. హఫీజ్ సయూద్ వ్యక్తిగత ఖర్చుల కోసం అతడి బ్యాంకు ఖాతా నుంచి డబ్బు విత్‌డ్రా చేసుకోవడానికి అవకాశం కల్పించాలని పాకిస్థాన్ కోరింది. పాక్ అభ్యర్థనపై సభ్యదేశాలు నిర్ణీత గడువులోగా ఎలాంటి అభ్యంతరం తెలపకపోవడంతో సెక్యూరిటీ కౌన్సిల్ దీనిని ఆమోదించడం విశేషం. భద్రతామండలీ తీర్మానం మేరకు హఫీజ్ సయీద్ ఆర్థిక లావాదేవీలను రెండేళ్ల కిందట పాకిస్థాన్ స్తంభింపజేసింది. అతడి బ్యాంకు ఖాతాలను నిలిపివేయడంతో కనీస అవసరాలకు కూడా డబ్బుల్లేక తన కుటుంబం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటోందని పాక్ ప్రభుత్వాన్ని హఫీజ్ ఆశ్రయించాడు. నెలవారీ ఖర్చుల కోసం తన ఖాతా నుంచి నగదు తీసుకోవడానికి అనుమతి ఇవ్వాలని కోరాడు. అతడి అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న పాక్.. భద్రతామండలికి ఆగస్టు 15న లేఖ రాసింది. వ్యక్తిగత ఖర్చుల కోసం నెలకు రూ.1,50,000 (పాకిస్థానీ కరెన్సీ) విత్‌డ్రా చేసుకునేలా సయీద్‌కు అనుమతి ఇవ్వాలని అందులో కోరింది. హఫీజ్ మహ్మద్ సయీద్, హాజీ మహ్మద్ అష్రఫ్, జఫర్ ఇక్బాల్ పేర్లను దీనిలో ప్రస్తావించింది. నిర్ణీత గడువులోగా దీనిపై సభ్యదేశాలు అభ్యంతరాలు వ్యక్తం చేయకపోవడంతో భద్రతామండలి అంగీకరించింది. ఇదిలా ఉంటే పాక్ అభ్యర్థనపై భారత్ తీవ్రంగా మండిపడింది. సయీద్ కోసం ఐక్యరాజ్యసమితిని అభ్యర్థించడం వెనుక పాక్ వైఖరి స్పష్టంగా అవగతమవుతోందని పేర్కొంది. హఫీజ్ అరెస్ట్‌ను ఓ డ్రామాగా అభివర్ణించిన భారత్.. తీవ్రవాదానికి పాకిస్థాన్ నిలయంగా మారిపోయిందని మండిపడింది. అంతేకాదు, ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి మినిస్టీరియల్ డిబేట్‌లో భారత్ ప్రతినిధి మాట్లాడుతూ.. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించి, ఆర్థిక సాయం అందించే దేశాలను గుర్తించి, వాటికి వ్యతిరేకంగా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎలాంటి అలసత్వం వహించకుండా ఉగ్రవాదంపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని విదేశాంగ శాఖ సహాయ మంత్రి వి మురళీధరన్ కోరారు.

# ఉగ్రవాదికి ఆర్థిక వెసులుబాటు కల్పించిన పాక్

ఇస్లామాబాద్, సెప్టెంబర్26(ఆర్ఎన్ఎ) : ఒకవైపు అంతర్జాతీయ ఉగ్రవాదిగా ప్రకటించాలంటూ ప్రపంచమంతా ఘోషిస్తుంటే, మరోవైపు పాకిస్తాన్ ఉగ్రవాది హఫీజ్ సయీద్‌కు డబ్బులు ఇప్పించాలంటూ ఐక్యరాజ్యసమితి భద్రతా మండలికి పాకిస్థాన్ లేఖ రాసింది. నలుగురు సభ్యులున్న కుటుంబానికి హఫీజే ఆధారమని, వారి ఆహారం, దుస్తుల ఖర్చు మొత్తం అతనే చూసుకుంటాడని, సయీద్ కుటుంబానికి నెలవారి ఖర్చులను విడుదల చేసేందుకు అనుమతి ఇవ్వాలంటూ భద్రతా మండలిని పాక్ కోరింది. ఆగస్టు 15వ తేదీన ఆ లేఖను రాశారు. అయితే ఆ లేఖపై ఎటువంటి అభ్యంతరాలు వ్యక్తం కాకపోవడంతో పాక్ అభ్యర్థనకు ఆమోదం తెలిపినట్లు భద్రతా మండలి చెప్పింది. గతంలో భద్రతా మండలి ఆదేశాల మేరకు హఫీజ్ బ్యాంక్ అకౌంట్‌ను పాక్ సీజ్ చేసింది. ప్రస్తుతం నెలకు లక్షా 50 వేల(పాక్ కరెన్సీ) రూపాయాలను విత్‌డ్రా చేసుకునే సౌలభ్యాన్ని కల్పించారు. ఉగ్రవాదంపై చర్యలు తీసుకుంటున్నట్లు చెబుతున్న పాక్ .. తాజాగా సయీద్‌కు కల్పించిన వెసలుబాటుతో మరో కోణాన్ని ప్రదర్శించింది. 2008లో ముంబైలో జరిగిన ఉగ్రదాడికి హఫీజ్ సూత్రధారి అన్న విషయం తెలిసిందే.

# భార్యపై అత్యాచారం చేసిన ప్రొఫెసర్!

అలీగఢ్,సెప్టెంబర్26(ఆర్ఎన్ఎ): విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఓ ప్రొఫెసర్ కీచక అవతారం ఎత్తాడు. భార్యకు విడాకులిచ్చి ఆమెపై అత్యాచారినికి పాల్పడ్డాడు. భార్యకు వాట్సాప్ ద్వారా ట్రిపుల్ తలాక్ చెప్పిన సదరు ప్రబుద్ధుడు.. అనంతరం విడిగా భార్యను రేప్ జరిపాడు. ఈ ఘటన అలీగఢ్‌లో జరిగింది. 58 ఏళ్ల నిందితుడిపై పోలీసులు లైంగిక దాడి (376), క్రిమినల్ బెదిరింపులు (506) తదితర ఐపీసీ సెక్షన్‌ల కింద కేసులు నమోదు చేశారు. ఓ యూనివర్సిటీలో ప్రొఫెసర్ అయిన నిందితుడు ఏడాదిన్నర కిందట భార్యకు సత్వర త్రిపుల్ తలాఖ్ ద్వారా విడాకులు ఇచ్చాడు. 2017లో వాట్సాప్ ద్వారా, ఎస్సెమ్మెస్ ద్వారా అతడు తనకు ట్రిపుల్ తలాఖ్ చెప్పినట్టు భార్య తెలిపారు. ఈ క్రమంలో కొడుకు, కూతురితో కలిసి తాను వేరుగా ఉంటున్నానని, కానీ, పిల్లలను చూసే నెపంతో అతడు తరచూ తన ఇంటికి వచ్చేవాడని ఆమె పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో తెలిపారు. గత నెల 29న అతడు తాము ఉంటున్న ఇంటికి వచ్చాడని, ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో తనను తుపాకీతో బెదిరించి.. తనపై లైంగిక దాడి జరిపాడని ఆమె పేర్కొన్నారు. ట్రిపుల్ తలాఖ్‌తో తనకు భర్త అన్యాయం చేశాడని, తనకు న్యాయం జరగకపోతే ఆత్మహత్య చేసుకుంటానని 2017లో బాధితురాలు అలీగఢ్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఎదుట ఆందోళన నిర్వహించారు.

# అసహనానికి గురైన రోహిత్‌శర్మ.. వీడియో



బెంగళూరు: టీమిండియా వైస్ కెప్టెన్ రోహిత్‌శర్మ మైదానంలో ఎప్పుడైనా కోపంగా ఉండడం గానీ, అసహనానికి గురవడం చూశారా..! ఫీల్డ్‌లో ఎప్పుడూ కూల్‌గా ఉండే రోహిత్ తీవ్ర అసహనానికి గురయ్యాడు. ఈ ఘటన ఇటీవల దక్షిణాఫ్రికాతో బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో జరిగిన చివరి టీ-20 మ్యాచ్‌లో చోటు చేసుకుంది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన ఇండియా సౌతాఫ్రికా ముందు 135 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఉంచింది. ఛేదనలో సౌతాఫ్రికా బ్యాట్స్‌మెన్ ఆది నుంచే ఇండియాపై ఆధిపత్యం చెలాయించారు. ఈ మ్యాచ్‌లో సౌతాఫ్రికా 3.1 ఓవర్లు మిగిలి ఉండగానే 9 వికెట్లతో ఘనవిజయం సాధించింది. ఈ విజయంతో సిరీస్ 1-1తో లెవెలయ్యింది. కెప్టెన్ క్వింటన్ డీ కాక్‌తో పాటు వన్‌డౌన్ బ్యాట్స్‌మన్ బావుమా భారత బౌలర్లపై బౌండరీలు, సిక్సర్లతో విరుచుకుపడ్డారు.

సౌతాఫ్రికా ఇన్నింగ్స్ జరుగుతున్న సమయంలో 12వ ఓవర్ వేస్తున్న నవదీప్ సైనీ బ్యాక్ టు బ్యాక్ బౌండరీలు ఇచ్చాడు. అతడు వేసిన రెండు బంతుల్ని సౌతాఫ్రికా బ్యాట్స్‌మన్ బావుమా ఈజీగా బౌండరీకి తరలించాడు. ఈ క్రమంలో సైనీపై వైస్ కెప్టెన్ రోహిత్ తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేశాడు. కొంచెం బుర్ర వాడి బంతులేయమని హెచ్చరించాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతోంది.

# ఓపెనింగ్ కోసం వేడుకున్నా : సచిన్ టెండూల్కర్

క్రీడలు

హైదరాబాద్: మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ ఓ ఆసక్తికరమైన విషయాన్ని చెప్పారు. తన కెరీర్ మొదట్లో వన్డేల్లో ఓపెనింగ్ బ్యాటింగ్ చేసేందుకు ఎంత ఆత్రుతగా ఎదురుచూడాల్సి వచ్చిందో వివరించారు. 1994లో జరిగిన ఓ సంఘటనను సచిన్ ఓ వీడియో ద్వారా ఆ విషయాన్ని వెల్లడించారు. దాన్ని తన లింకిడిన్ అకౌంట్‌లో పోస్టు చేశారు. ఓపెనర్‌గా బ్యాటింగ్ చేసేందుకు టీమ్ మేనేజ్‌మెంట్‌ను వేడుకున్నట్లు సచిన్ గుర్తు చేశారు. ఓ దశలో ప్రాధేయపడాల్సి వచ్చిందన్నారు. బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందుకు వచ్చి.. ప్రత్యర్థి బౌలర్లను ఎదుర్కోవాలన్న ఆకాంక్ష ఉండేది, దాని కోసం తనకు ఒక అవకాశం ఇవ్వాలని టీమ్‌ను వేడుకున్నట్లు సచిన్ చెప్పారు. ఒకవేళ విఫలమైతే, మళ్లీ మిమ్మల్ని అడగనంటూ మేనేజ్‌మెంట్‌కు తెలిపానన్నారు.

అయితే ఆక్లాండ్‌లో న్యూజిలాండ్‌తో జరిగిన వన్డే మ్యాచ్‌లో సచిన్ ఓపెనర్‌గా బ్యాటింగ్ చేపట్టాడు. ఆ మ్యాచ్‌లో మాస్టర్ బ్లాస్టర్ 82 రన్స్ చేశారు. వన్డేల్లో ప్రస్తుతం సచిన్ ఖాతాలో 49 సెంచరీలు ఉన్నాయి. ఇప్పటికీ ఇది వరల్డ్ రికార్డ్. ఆ రోజుల్లో ఓపెనర్లు కేవలం వికెట్లను రక్షించుకోవాలన్న ఉద్దేశంతో ఉండేవారు. కానీ తాను ఓపెనర్‌గా కొంత దూకుడు ఆటను ప్రదర్శించినట్లు సచిన్ వెల్లడించారు. కివీస్‌తో మ్యాచ్‌లో కేవలం 49 బంతుల్లో 82 రన్స్ చేశా, ఇక ఆ తర్వాత మళ్లీ ఓపెనింగ్ చేస్తానని నేనెప్పుడూ అడగలేదు, మేనేజ్‌మెంట్ నన్నే ఓపెనింగ్ చేయాలని కోరిందని సచిన్ చెప్పారు. ఓడిపోతామన్న భయం ఉండకూడదని మాస్టర్ బ్లాస్టర్ ఈ సందర్భంగా హితువు పలికారు. 463 వన్డేలు ఆడిన సచిన్.. మొత్తం 18 వేల 426 రన్స్ చేశాడు. ఓపెనర్‌గా మొదటి అయిదు ఇన్నింగ్స్‌లో 82, 63, 40, 63, 73 రన్స్ చేశాడు.



# యువతను ఆకర్షిస్తున్న యాప్‌లపై పార్టీల దృష్టి

హైదరాబాద్, సెప్టెంబర్26(ఆర్‌ఎన్‌ఎ) : యువతనే లక్ష్యంగా పెట్టుకుని రోజుకొక కొత్త యాప్ విడుదల అవుతోంది. కాగా, ఇటీవలి కాలంలో యూత్‌ను ఎక్కువగా ఆకర్షించిన యాప్ టిక్‌టాక్. చిన్నా పెద్దా తేడా లేకుండా.. అందరూ టిక్‌టాక్‌ను ఉపయోగిస్తున్నారు. దీనితో ఇంతలా జనాలను ఆకర్షిస్తున్న ఈ యాప్‌లపై రాజకీయ పార్టీలు కూడా ఇప్పుడు దృష్టి సారించాయి. క్రియేటివ్ వీడియోలతో జనాన్ని తమ పార్టీల వైపు ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఎంఐఎం పార్టీ టిక్‌టాక్‌లో అధికారిక ఖాతా తెరిచింది. 'టిక్ టాక్'లో అధికారిక ఖాతా తెరిచిన తొలి రాజకీయ పార్టీగా ఎంఐఎం రికార్డుల కెక్కింది.

ఎంఐఎం టిక్‌టాక్ ఖాతాకు సంబంధించి దారుస్సలాంలోని ఆ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదలైంది. టిక్‌టాక్‌ను ఎక్కువగా వినియోగిస్తున్నవారిలో యువత అధికంగా ఉండటంతో.. వారికి చేరువయ్యేందుకే అందులో ఖాతా తెరిచినట్టు వెల్లడించింది. కాగా, ప్రస్తుతం ఎంఐఎం అధికారిక టిక్‌టాక్ ఖాతాను దాదాపు 7వేల మంది ఫాలో అవుతున్నారు.

# ఎమ్మెల్యేను పరామర్శించిన హోం మంత్రి



హైదరాబాద్, సెప్టెంబర్26(ఆర్‌ఎన్‌ఎ) : ప్రమాదంలో గాయాలపాలై, జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డిని గురువారం రాష్ట్ర హోం మంత్రి మహమూద్ అలీ పరామర్శించారు. ఈ సందర్భంగా అతని బాగోగులు తెలుసుకొన్న మంత్రి, అతనికి ధైర్యం చెప్పారు. గత శుక్రవారం హైదరాబాద్ వస్తున్న ఎమ్మెల్యే కారును రాత్రి 9.30 గంటల సమయంలో చేవెళ్ల దగ్గర ఓ ప్రైవేటు వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఎమ్మెల్యే కాలు విరిగిపోయింది. అతనితో పాటు కారులో డ్రైవర్, గన్‌మెన్ ఉన్నారు. వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ప్రమాదానికి గురైన సమయంలో ఆయన సీటుబెల్టు ధరించడం వల్ల ప్రాణాలతో బయటపడినట్లు సమాచారం.

# చోక్సీని భారత్‌కు అప్పగిస్తాం

## - అతని వల్ల మాకెలాంటి ఉపయోగంలేదన్న ఆంటిగ్వా ప్రభుత్వం

న్యూఢిల్లీ, సెప్టెంబర్26(ఆర్‌ఎన్‌ఎ) : పంజాబ్ నేషనల్ బ్యాంకుకు రూ. వేల కోట్ల మేరకు మోసం చేసిన వజ్రాల వ్యాపారి మెహుల్ చోక్సీకి చుక్కెదురైంది. భారత్ నుంచి పారిపోయాక చోక్సీ ఆంటిగ్వాలో తలదాచుకుంటున్నారు. అయితే, అతడిని భారత్‌కు అప్పగించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఆంటిగ్వా ప్రధాని గాస్టన్ బ్రోన్ తెలిపారు. అతడి అభ్యర్థనపై విచారణ మొత్తం పూర్తయిన వెంటనే భారత్‌కు అప్పగిస్తామని తెలిపారు. కాకపోతే, ఇది కాస్త సమయం పడుతుందని, చోక్సీ నిజాయతీ లేని వ్యక్తని మాకు పూర్తి సమాచారం ఉందని ప్రధాని గాస్టన్ బ్రోన్ తెలిపారు. అతడి వల్ల మా దేశానికి వచ్చిన ప్రయోజనం ఏమీ లేదన్నారు. అందుకే భారత్‌కు పంపేస్తామని, అతడి మీద విచారణ జరిపేందుకు భారత్‌కు పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నామన్నారు. వారు(భారతీయ అధికారులు) ఇక్కడి రావచ్చునని, వచ్చి అతడిపై విచారణ చేసుకోవచ్చునని, మా ప్రభుత్వం ఎలాంటి అభ్యంతరాలు చెప్పదన్నారు. భారత్ నుంచి వచ్చిన సమాచారం ప్రకారమే అతడికి పౌరసత్వం ఇచ్చామన్నారు. దీనిపై పూర్తి బాధ్యత వారిదేనని ప్రధాని తెలిపారు. గతంలో భారత్‌కు రావడానికి చోక్సీ అంగీకరించలేదని, భారత్‌లో మూక దాడులు జరుగుతున్నాయని సాకుగా చూపి అక్కడే మకాం వేశారని అన్నారు. ఇతడిని భారత ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ 'పరారీలో ఉన్న ఆర్థిక నేరగాడి'గా ప్రకటించిన విషయం తెలిసిందే.

# రామప్ప ఆలయ సందర్శనకు విచ్చేసిన యునెస్కో బృందం

ములుగు, సెప్టెంబర్26 (ఆర్‌ఎన్‌ఎ): ఐక్యరాజ్య సమితి విద్యా, విజ్ఞాన(శాస్త్రీయ), సాంస్కృతిక సంస్థ(యునెస్కో) బృందం రామప్ప ఆలయ సందర్శనకు విచ్చేసింది. ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం పాలంపేటలోని రామప్ప ఆలయానికి వచ్చిన యునెస్కో బృందానికి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి స్వాగతం పలికారు. యునెస్కో బృందం వెంట కేంద్ర, రాష్ట్ర పురావస్తు, పర్యాటకశాఖ అధికారులతో పాటు కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ సభ్యులు ఉన్నారు. ప్రపంచ వారసత్వ హోదా గుర్తింపు కోసం రామప్ప ఆలయాన్ని సందర్శిస్తున్నారు. రెండు రోజుల పాటు కొనసాగే యునెస్కో బృందం పర్యటనలో సభ్యులు రామప్ప ఆలయ చరిత్ర, ప్రత్యేకతలను పరిశీలించనున్నారు.

### కేసీఆర్ అభివృద్ధి పథకాలే..

# తనకు అవార్డు తెచ్చిపెట్టాయి

## - పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

న్యూఢిల్లీ, సెప్టెంబర్26 (ఆర్‌ఎన్‌ఎ) : రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల వల్లనే తనకు జాతీయ స్థాయి అవార్డు వచ్చిందని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి జాతీయ ఉత్తమ ఎమ్మెల్యే అవార్డుకు ఎంపికయిన విషయం విధితమే. ఈ అవార్డును చాణక్య ఫౌండేషన్ ప్రకటించింది. గురువారం ఎమ్మెల్యే ఢిల్లీలో అవార్డును స్వీకరించనున్నారు. ఈ సందర్భంగా ధర్మారెడ్డి మాట్లాడుతూ.. నేను ఈ అవార్డుకు ఎంపికవడం ముఖ్యమంత్రి అమలు చేస్తున్న అభివృద్ధి పథకాలేనని అన్నారు. తెలంగాణకు కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం రాష్ట్ర ప్రజల అదృష్టమనీ, సీఎం ఆధ్వర్యంలో నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని ఆయన అన్నారు. సీఎం సాహసోపేత నిర్ణయాలు రాష్ట్రాన్ని అత్యుత్తమ స్థానంలో ఉంచిందనీ, ఆయన ఆదేశాల మేరకే నియోజకవర్గంలో అన్ని కార్యక్రమాలు సక్రమంగా నిర్వర్తించామని ఆయన అన్నారు. అందుకే జాతీయ ఉత్తమ ఎమ్మెల్యే అవార్డుకు ఎంపికయ్యానని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన సీఎం కేసీఆర్, చాణక్య ఫౌండేషన్‌కు ధన్యవాదాలు తెలిపారు.

### అయ్య ఇచ్చిన పదవితో..

# కేటీఆర్ విర్రవీగుతున్నాడు

## - హుజూర్‌నగర్‌లో ఏం అభివృద్ధి చేశారో చెప్పాలి
## - గెలుపు మీదయితే.. కాంగ్రెస్ నేతలను ఎందుకుకొంటున్నారు?
## - ప్రభుత్వం మా ఫోన్లను ట్యాప్ చేస్తుంది
## - కేంద్ర బలగాలతో పోలింగ్ నిర్వహించాలి
## - టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్ రెడ్డి

సూర్యాపేట, సెప్టెంబర్26(ఆర్‌ఎన్‌ఎ) : హుజూర్‌నగర్‌లో కాంగ్రెస్ పార్టీదే విజయమని, దానిని ఎవరూ అడ్డుకోలేరని టీపీసీసీ చీఫ్ ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. టీఆర్‌ఎస్ ప్రభుత్వంపై, కేటీఆర్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కేటీఆర్ ఓ బచ్చా అని, అయ్య ఇచ్చిన పదవితో విర్ర వీగుతున్నారని ధ్వజమెత్తారు. హుజూర్‌నగర్‌లో టీఆర్‌ఎస్‌దే గెలుపంటున్న కేటీఆర్.. కాంగ్రెస్ నేతలను ఎందుకు కొంటున్నారో సమాధానం చెప్పాలని నిలదీశారు. టీఆర్‌ఎస్‌పై ప్రజలు విసిగిచెంది ఉన్నారని, ఈ ఉప ఎన్నికల్లో అది రుజువుకాబోతుందని అన్నారు. ఓటమి నుండి బయటపడేందుకు అధికారాన్ని అడ్డుపెట్టుకొని ఉప ఎన్నికల్లో గెలవాలని కేటీఆర్ చూస్తున్నారని విమర్శించారు. హుజూర్‌నగర్‌లో ఏం అభివృద్ధి చేశారని టీఆర్‌ఎస్ ఓట్లు అడుగుతుందని కేటీఆర్ చెప్పాలని కోరారు. కేసీఆర్ కుటుంబం రాష్ట్రాన్ని దోచుకుంటోందని ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వం మా ఫోన్లను ట్యాప్ చేస్తోందని విమర్శించారు. హుజూర్‌నగర్ ఉప ఎన్నిక రాష్ట్ర చరిత్రను మలుపు తిప్పే ఎన్నికగా అభివర్ణించారు. మండలి చైర్మన్ గుత్తా అనైతిక రాజకీయాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. టీఆర్‌ఎస్‌లో చేరాలని కాంగ్రెస్ నేతలతో బేరసారాలు చేస్తున్నారని ఆరోపించారు. మండలి చైర్మన్ గుత్తాపై గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. అధికారం, డబ్బు, మద్యంతో టీఆర్‌ఎస్ ప్రలోభాలకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. కేంద్ర బలగాలతో పోలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ ఏకపక్ష నిర్ణయాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఉత్తమ్ అన్నారు. ఇచ్చిన ఏఒక్క హామీని పూర్తిస్థాయిలో నెరవేర్చకుండా కేసీఆర్, కేటీఆర్‌లు మాటలగారడితో ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారని అన్నారు. ఎన్నికల తరువాత కేసీఆర్ నిజస్వరూపం ప్రజలకు తెలిసిపోయిందని అన్నారు. హుజూర్‌నగర్‌లో కాంగ్రెస్ గెలవాలని రాష్ట్ర ప్రజలంతా కోరుకుంటున్నారని, హుజూర్‌నగర్ నియోజకవర్గ ప్రజలంతా కాంగ్రెస్ వైపే ఉన్నారని అన్నారు. రాష్ట్రాన్ని భ్రష్టుపట్టిస్తున్న టీఆర్‌ఎస్ ప్రభుత్వానికి హుజూర్‌నగర్ ఎన్నికలు గుణపాఠం కాబోతున్నాయని ఉత్తమ్ అన్నారు.

# ఇచ్చిన హామీలను ఖచ్చితంగా అమలుచేస్తాం

## - సంక్షేమ పథకాల విషయంలో వెనక్కితగ్గం
## - ఆర్థికశాఖ మంత్రి హరీశ్ రావు

సంగారెడ్డి, సెప్టెంబర్26(ఆర్‌ఎన్‌ఎ) : ఆర్థికమాద్యంతో ప్రభుత్వం ఇబ్బందుల్లో ఉన్నా.. ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఎక్కడా వెనక్కి తగ్గమని, సంక్షేమ పథకాలను క్రమంతప్పకుండా అమలు చేస్తామని ఆర్థికశాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు అన్నారు. గురువారం సంగారెడ్డిలో ఆయన విలేకరులతో మాట్లాడారు.. పథకాల అమల్లో ప్రభుత్వం వెనక్కి తగ్గదని, ఖచ్చితంగా వాటిని అమలు చేస్తామని స్పష్టం చేశారు. ఆర్థిక మాంద్యం వలన ఇతర ఖర్చులు, కేటాయింపులు తగ్గించామన్నారు. కానీ సంక్షేమ కార్యక్రమాలను మాత్రం యధావిధిగా కొనసాగించాలని సీఎం కేసీఆర్ ఆదేశించారని మంత్రి చెప్పారు. దేశం మొత్తం ఆర్థిక మాంద్యం ఉందని, కేంద్ర ప్రభుత్వం రోజుకోక దాంట్లో కోతలు పెడుతుందని విమర్శించారు. కానీ కేసీఆర్ మాత్రం సంక్షేమ పథకాల విషయంలో మాంద్యాన్ని లెక్క చేయలేదని అన్నారు. సంగారెడ్డి జిల్లాలో రైతు బీమా పొందిన రైతులు ఏ విధంగా చనిపోయారో సవివరంగా నివేధిక తయారు చేయాలన్నారు. రైతు బంధు, బీమా అనేవి నిజంగా కేసీఆర్ అమలు చేస్తున్న గొప్ప కార్యక్రమాలని మంత్రి హరీశ్‌రావు కొనియాడారు. కేసీఆర్ ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమాలతో రాష్ట్ర ప్రజలు సంతోషంగా ఉన్నారని అన్నారు. పలు పథకాలను అడ్డుకొనేందుకు ప్రతిపక్షాలు కుట్రలు చేసినా, కోర్టులకు వెళ్లినా వాటిని ఎదుర్కొని ప్రజలకు ప్రభుత్వ ఫలాలు అందిస్తున్నామని హరీష్‌రావు తెలిపారు. రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా చేయటమే కేసీఆర్ లక్ష్యమని, ఆమేరకు ఎలాంటి అవరోధాలు ఎదురైనా దాటుకుంటూ వస్తామని అన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు కేసీఆర్ పాలన పట్ల సంతోషంగా ఉన్నారని అన్నారు. మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయడంలో కేసీఆర్ ఎప్పుడూ ముందుంటారని, తెలంగాణ ఆడపడుచులకు అన్నలా, యువతులకు మేనమామలా కేసీఆర్ మారారన్నారు. తెలంగాణ పండగ దసరా సందర్భంగా ఆడపడుచులకు కేసీఆర్ ఇస్తున్న కానుక బతుకమ్మ చీరలు అని అన్నారు.

# బస్సు బోల్తా పడి ఐదుగురికి తీవ్రగాయాలు

సూర్యాపేట, సెప్టెంబర్26 (ఆర్‌ఎన్‌ఎ): సూర్యాపేట శివారులోని దురాజ్ పల్లి వద్ద ట్రావెల్ ఏజెన్సీకి చెందిన బస్సు బోల్తా కొట్టింది. వైజాగ్ నుంచి హైదరాబాద్‌కు బయల్దేరిన బస్సు సూర్యాపేట వద్ద బోల్తా కొట్టింది. ప్రమాద సమయంలో బస్సులో దాదాపు 50 మంది ప్రయాణికులున్నారు. వీరిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉంది. వీరిని హుటాహుటిన హైదరాబాద్ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

# అర్ధరాత్రి క్యాబ్ డ్రైవర్ బీభత్సం

## ప్రాణం తీసిన నిర్లక్ష్యం

హైదరాబాద్,సెప్టెంబర్26(ఆర్‌ఎన్‌ఎ) : క్యాబ్ డ్రైవర్ నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలైంది. అర్ధరాత్రి సమయంలో శంషాబాద్ విమానాశ్రయం దగ్గర క్యాబ్‌లో ప్రయాణికులను ఎక్కించుకుంటుండగా పోలీసులు రావడంతో డ్రైవర్ హడావిడిగా అక్కడి నుంచి కారును పోనిచ్చాడు. అయితే క్యాబ్ ఎక్కేందుకు ప్రయత్నించిన యాదయ్య అనే ప్రయాణికుడి షర్టు కారులోపల ఇరుక్కొంది. ఇది గమనించని క్యాబ్ డ్రైవర్ ఎనిమిది కిలోమీటర్లపాటు కారు పోనిచ్చాడు. యాదయ్యను కారు లాక్కెడంతో అతడు తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. కారు బయట మృతదేహం వేలాడుతుండటంతో... శంషాబాద్ టోల్‌గేట్ వద్ద వాహనదారులు గమనించి..కేకలు వేయడంతో క్యాబ్ వదిలి డ్రైవర్ అక్కడ నుంచి పరారైయ్యాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అలాగే మృతుడి వివరాలు కూడా తెలియాల్సి ఉంది.

# వేణుమాధవ్ చివరి ఫొటో




హైదరాబాద్,సెప్టెంబర్26(ఆర్ఎన్ఎ) : ప్రముఖ తెలుగు హాస్యనటుడు వేణుమాధవ్ అనారోగ్యంతో బుధవారం కన్నుమూశారు. కొంతకాలంగా ఆయన కాలేయ, కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడుతూ బుధవారం యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. అయితే హీరో , మా ఉపాధ్యక్షుడు డాక్టర్ రాజశేఖర్ మంగళవారం వేణుమాధవ్ ను ఆస్పత్రిలో పరామర్శించారు. వేణుమాధవ్ మరణానంతరం , అతడితో కలిసి దిగిన చివరి ఫొటోను రాజశేఖర్ సోషల్ మీడియాలో పోస్టు చేసి భావోద్వేగానికి గురయ్యారు. ఈ ఫొటోలో ఆస్పత్రి బెడ్ పై ఉన్న వేణు మాధవ్ గుర్తు పట్టలేనంతగా మారిపోయారు. వేణుమాధవ్ చివరి ఫొటో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఆయన అభిమానులు ఆవేదనకు గురవుతున్నారు. ఇదిలా ఉండగా గురువారం వేణుమాధవ్ అంత్యక్రియలు బన్సీలాల్ పేట శ్మశానవాటికలో నిర్వహించనున్నారు.

# ఆకట్టుకున్న 'హౌజ్‌ఫుల్ 4' ఫస్ట్ లుక్

బాలీవుడ్ హీరో అక్షయ్ కుమార్ హౌజ్ ఫుల్ ఫ్రాంచైజీలో భాగంగా హౌజ్‌ఫుల్ 4 చిత్రం చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రాన్ని మొదట సాజిద్ ఖాన్ తెరకెక్కించగా ఆయనపై వచ్చిన లైంగిక ఆరోపణల వలన ఆయన స్థానంలో ఫహద్ సంజీని దర్శకుడిగా ఎంపిక చేశారు. ఇక నానా పటేకర్ స్థానంలోపై కూడా లైంగిక ఆరోపణలు రాగా ఆయన స్థానంలో రానాని తీసుకున్నారు. కృతి సనన్, రితేష్ దేశ్‌ముఖ్, పూజా హెగ్డే, బాబి డియోల్, కృతి కర్బందా చిత్రంలో ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. చిత్రంలో అక్షయ్ కుమార్ బాలా మరియు హర్రి పాత్రలలో కనిపించనున్నాడు. ఆయన పాత్రలకి సంబంధించిన లుక్స్ విడుదలయ్యాయి. ఇందులో అక్షయ్ లుక్స్ ఆకట్టుకుంటున్నాయి. సెప్టెంబర్ 27న చిత్ర ట్రైలర్ విడుదల కానుండగా, దీపావళికి మూవీని రిలీజ్ చేసే ఆలోచనలో ఉన్నారు. 2019 నుండి 1419కి ఈ చిత్రం తీసుకెళుతుందని అక్షయ్ అంటున్నారు. ఫన్ అండ్ హ్యూమర్‌తో పీరియాడికల్ మూవీగా చిత్రాన్ని తెరకెక్కించారు

# వైజాగ్‌లో సక్సెస్ సెలబ్రేషన్స్ జరుపుకోనున్న గద్దలకొండ గణేష్




మెగా హీరో వరుణ్ తేజ్ ఫిదా, ఎఫ్ 2 వంటి రొమాంటిక్ చిత్రాల తర్వాత గద్దలకొండ గణేష్ అనే మాస్ ఎంటర్‌టైనర్ చిత్రాన్ని చేశాడు. తమిళ హిట్ చిత్రం జిగర్తాండకి రీమేక్‌గా రూపొందిన ఈ చిత్రాన్ని హరీష్ శంకర్ తెరకెక్కించారు. అథర్వ మురళి ముఖ్య పాత్ర పోషించారు. పూజా హెగ్డే, మృణాలినీ రవి కథానాయికలుగా నటించారు. సెప్టెంబర్ 20న ప్రపంచవ్యాప్తంగా విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్‌ని షేక్ చేస్తుంది. సినీ సెలబ్రిటీలు చిత్రాన్ని ఆకాశానికి ఎత్తేస్తున్నారు. చిరంజీవి, మహేష్‌బాబుతో పాటు పలువురు స్టార్స్ వరుణ్ నటనపై పొగడ్తల వర్షం కురిపిస్తున్నారు. సెప్టెంబర్ 27న వైజాగ్‌లో చిత్ర సక్సెస్ సెలబ్రేషన్స్ గ్రాండ్‌గా జరపనున్నట్టు చిత్ర బృందం ప్రకటించింది. సెలబ్రేషన్స్‌లో అందరు పాల్గొనాలని టీం కోరారు. 14 రీల్స్ ప్లస్ బేనర్‌పై రామ్ ఆచంట, గోపీ ఆచంట చిత్రాన్ని నిర్మించారు.

# అయోధ్య కేసులో సుప్రీంకు ముస్లింల క్షమాపణ

న్యూఢిల్లీ,సెప్టెంబర్26(ఆర్ఎన్ఎ): అయోధ్య కేసులో అనుకోని ట్విస్టులు మనం గమనిస్తూ వస్తున్నాం. తాజాగా, 2003లో ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఏఎస్ఐ) సమర్పించిన నివేదిక రచన పై ప్రశ్నలు లేవనెత్తిన ముస్లిం పక్షాలు గురువారం యూటర్న్ తీసుకున్నాయి. అయోధ్య భూ వివాదం కేసులో సుప్రీంకోర్టు సమయాన్ని వృధా చేసినందుకు క్షమాపణ చెప్పాయి. ఏఎస్ఐ నివేదికను ఎవరు రాశారన్నదానిపై తాము ప్రశ్నించదల్చుకోవడం లేదంటూ భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్ నేతృత్వంలోని సుప్రీం ధర్మాసనం సీనియర్ న్యాయవాది రాజీవ్ ధవన్‌కు స్పష్టం చేసింది. "ప్రతిపేజీలోనూ సంతకం పెట్టాలని లేదు. నివేదిక, సారాంశ గ్రంథకర్తృత్వాన్ని ప్రశ్నించాల్సిన అవసరం లేదు. మేము నివేదిక రాసిన రచయిత గురించి అడుగుతున్నాం తప్ప, గ్రంథకర్తృత్వాన్ని ప్రశ్నించడం లేదు. న్యాయమూర్తుల సమయాన్ని మేము వృధా చేస్తే మేము క్షమించాలని కోరుతున్నాం," అంటూ ముస్లిం పక్షాల తరపున వాదిస్తున్న ధవన్ ధర్మాసనానికి తెలిపారు.

కాగా, ఈ కేసులో వాదనలను ఎప్పట్లోగా పూర్తి చేస్తారో చెప్పాలంటూ సుప్రీం ధర్మాసనం హిందూ, ముస్లిం పక్షాలకు ఆదేశించింది. అక్టోబర్ 18 తర్వాత ఈ కేసులో వాదనలను వినబోమని స్పష్టం చేసింది.

అక్టోబర్‌లో సెలవులు ఉన్నాయనీ.. నాలుగు హిందూ పక్షాలకు ఒకే ఒక్క న్యాయవాదిని వాదనలు వినిపించేందుకు అనుమతిస్తామని పేర్కొంది.

# అక్టోబరు18 తర్వాత వినేదిలేదు

## - విచారణ గడువు ఒక్కరోజు కూడా పొడిగించం
## - - అయోధ్య కేసులో స్పష్టం చేసిన సుప్రింకోర్టు

న్యూఢిల్లీ, సెప్టెంబర్26 (ఆర్ఎన్ఎ) : అయోధ్యలోని రామజన్మభూమి-బాబ్రీ మసీదు భూ వివాదంపై విచారణను అక్టోబరు 18నాటికి పూర్తి చేయాల్సిందేనని సుప్రీంకోర్టు గురువారం మరోసారి తేల్చిచెప్పింది. ఆలోగా ఇరు పక్షాలు వాదనలు వినిపించాలని, అంతకు మించి ఒక్కరోజు కూడా అదనంగా ఇవ్వడం కుదరదని న్యాయస్థానం వెల్లడించింది. అక్టోబరు 18నాటికి వాదనలు పూర్తయిన తర్వాత తీర్పు వెల్లడించడానికి ధర్మాసనానికి నాలుగు వారాల సమయం మాత్రమే ఉందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయి తెలిపారు. ఆ నాలుగు వారాల్లో తీర్పు వెల్లడిస్తే న్యాయస్థానం అద్భుతం సాధించినట్లేనని అన్నారు. నవంబరు 17తో జస్టిస్ రంజన్ గొగొయి పదవీకాలం ముగియనుంది. ఆలోపే తీర్పు వెలువడే అవకాశముంది. అయోధ్య కేసు విచారణను అక్టోబరు 18లోగా ముగించాలని గతవారం సుప్రీంకోర్టు నిర్ణయించింది. అవసరమనుకుంటే మధ్యవర్తిత్వ ప్రక్రియను కూడా పునఃప్రారంభించుకోవచ్చని సూచించింది. అయోధ్యలోని భూ వివాదాన్ని పరిష్కరించేందుకు జస్టిస్ రంజన్ గొగొయి నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఈ కేసుపై ఆగస్టు ఆరో తేదీ నుంచి రోజువారీ విచారణ జరుపుతున్న విషయం తెలిసిందే.

# పోలీసుపై కేంద్రమంత్రి జులుం

బీహార్,సెప్టెంబర్26(ఆర్ఎన్ఎ): ఏ పార్టీ అధికారంలో ఉన్నా విఐపీల జులుం తగ్గదు. అధికారులపై అధికారపార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు చేసే జులుంకు సంబంధించి ఎన్నో ఉదాహరణలు చూశాం.

తాజాగా, నిర్వహణలో ఉన్న ఓ పోలీస్ అధికారిని కేంద్రమంత్రి అశ్విని చౌబే దారుణంగా అవమానించారు. పోలీస్ యూనిఫాం ఊడబీకేస్తానంటూ అందరి ముందు ఆయన చిందులు తొక్కడంతో, ఆ అధికారి ఆయనపై కేసుపెట్టారు. బీహార్‌లో జరిగిన ఓ 'జనతా దర్బార్' కార్యక్రమం సందర్భంగా ఈ ఘటన చోటుచేసుకుంది. బక్సర్‌లోని నయా భోజ్‌పూర్ అవుట్‌పోస్టు ఇంచార్జిగా ఉన్న ఎస్ఐ రాజీవ్ రంజన్ ఓ బీజేపీ కార్యకర్తకు 'గూండా నోటీసులు' జారీ చేయడంతో అతడు కేంద్రమంత్రికి ఫిర్యాదు చేశాడు. దీంతో మంత్రి అశ్విని చౌబే ఎస్ఐ రంజన్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ బెదిరింపులకు దిగినట్టు తెలుస్తోంది.

ఇదంతా స్థానిక చానెళ్లలో ప్రసారం కావడంతో ప్రస్తుతం ఈ వ్యవహారం హాట్ టాపిక్‌గా మారింది. కాగా మంత్రి అశ్విని చౌబే తనపై బెదిరింపులకు పాల్పడ్డారంటూ ఎస్ఐ రాజీవ్ రంజన్ రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. అయితే తాము ఇంకా మంత్రిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని ఓ పోలీసు అధికారి వెల్లడించారు.

## కేజ్రీవాల్ ఇంటి ముందు బిజెపి శ్రేణుల ఆందోళన

న్యూఢిల్లీ,సెప్టెంబర్26(ఆర్ఎన్ఎ): ఎన్నార్సీపై ఢిల్లీ ముఖ్యమంత్రి అర్వింద్ కేజ్రీవాల్ చేసిన వ్యాఖ్యలను తప్పుబడుతూ, ఆయన నివాసం ఎదుట బీజేపీ శ్రేణులు గురువారం ఆందోళన నిర్వహించాయి. సీఎం డౌన్.. డౌన్ అంటూ కేజ్రీవాల్‌కు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున కార్యకర్తలు నినాదాలు చేస్తూ దేశ రాజధాని ఢిల్లీలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) కార్యకర్తలు ఆందోళన బాట పట్టారు. ఈ క్రమంలో సీఎం కార్యాలయం ముందు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. రంగంలోకి దిగిన పోలీసులు బాష్పవాయువు ప్రయోగించి ఆందోళనకారులను చెదరగొట్టారు. పలువురు నిరసనకారులను పోలీసులు అరెస్ట్ చేసి, స్టేషన్‌కు తరలించారు. జాతీయ పౌరజాబితా (ఎన్నార్సీ) అమలైతే ఢిల్లీ నుంచి ముందుగా వెళ్లాల్సింది బీజేపీ నేత మనోజ్ తివారేనని కేజ్రీవాల్ పేర్కొన్నారు. కేజ్రీవాల్ వ్యాఖ్యలు బీజేపీ శ్రేణులు భగ్గుమన్నారు. ఢిల్లీ బీజేపీ చీఫ్ అయిన మనోజ్ తీవారికి కేజ్రీవాల్ క్షమాపణ చెప్పాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు.

### బీజేపీలో చేరాల్సిన సమయమొస్తే..

# ఎవరు ఆపినా ఆగదు!

## - ప్రస్తుతానికి బీజేపీలో చేరే ఆలోచన లేదు
## - టీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు డి. శ్రీనివాస్

నిజామాబాద్, సెప్టెంబర్26(ఆర్ఎన్ఎ) : తాను బీజేపీలో చేరాల్సిన సమయమొస్తే ఎవరు ఆపినా ఆ ప్రక్రియ ఆగదని టీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు డి. శ్రీనివాస్ కీలక వ్యాఖ్యలు చేశారు. బీజేపీలో చేరుతున్నట్టు వస్తున్న వార్తలను ఆయన ఖండించారు. తాను బీజేపీలో చేరడం లేదని స్పష్టం చేశారు. బీజేపీలో చేరను అంటూనే.. కీలక వ్యాఖ్యలు చేశారు. నిజంగానే పార్టీ మారాల్సిన సమయం వస్తే ఎవరు ఆపినా ఆగదన్నారు. బీజేపీ చీఫ్, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ను పార్లమెంటులో మాత్రమే కలిశానని, బీజేపీ ఆఫీస్ లో కాదని డీఎస్ చెప్పారు. హోంమంత్రి కాబట్టే షా ని కలిశానని వెల్లడించారు. ప్రాంత సమస్యలపై ఎవరైనా, ఎవరినైనా కలవొచ్చు అని సమర్థించుకున్నారు. అందులో ఎలాంటి తప్పు లేదన్నారు. నిజామాబాద్ టీఆర్ఎస్ నేతలు తనపై సీఎం కేసీఆర్ కు ఫిర్యాదు చేసి ఏడాదిన్నర కాలం అయిపోందన్నారు. దీనిపై అధిష్టానం నుంచి ఎలాంటి రిప్లయ్ రాలేదన్నారు. భవిష్యత్తులో వస్తుందని అనుకోవడం లేదన్నారు. హుజూర్ నగర్ ఉపఎన్నికపైనా డీఎస్ స్పందించారు. హుజూర్ నగర్ లో డిఫరెంట్ రాజకీయం నడుస్తోందన్నారు. ఏ సమయంలో ఎలాంటి తీర్పు ఇవ్వాలో ఓటర్లకు తెలుసు అని చెప్పారు. నా కొడుకు అరవింద్ కు అతడి సిద్ధాంతాలు అతడికి ఉంటాయని, తప్పు చేస్తే తనపై చర్యలు తీసుకోవచ్చన్నారు.

# పూణెలో కుండపోత వర్షం.

## - భారీ వర్షాలతో 18మంది మృతి

పూణెళి, సెప్టెంబర్26(ఆంఎన్ఎ) : దేశ వ్యాప్తంగా వరుణుడు బీభత్సం సృష్టిస్తున్నాడు. వివిధ రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుసున్నాయి. జనజీవనం స్తంభించిపోతోంది. పూణెలో కురిసిన కుండపోవత వానకు ఆ సిటీ మునిగిపోయింది. ఇల్లు కూలిపోయాయి. వాహనాలు కొట్టుకుపోయాయి. పూణెలో భారీ వర్షాలకు బుధవారం వరకు 13 మంది చనిపోగా, గురువారం గోడకూలి ఐదుగురు మృతి చెందారు. దీంతో భారీ వర్షాలకు మృతుల సంఖ్య 18కి చేరింది. శివపూర్‌లో వరదల ప్రవాహా నానికి ఐదుగురు కొట్టుకపోయారు.

షాక్రానగర్‌లో ఓ భవంతి కూలిపోవడంతో 9 సంవత్సరాల బాలుడితో పాటు ఐదుగురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు. శిథిలాల కింద మరికొంత మంది ఉన్నట్లు అంచనా వేస్తున్నారు అధికారులు. ఈ ఘటన బుధవారం జరిగింది. మధ్య మహారాష్ట్ర ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుసున్నాయి. బుధవారం అర్థరాత్రి పూణె, ఇతర జిల్లాల్లో 100 మిల్లిమీటర్ల వర్షపాతం నమోదైందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఇంకా వర్షాలు పడుతాయని హెచ్చరించింది. ఇదిలా ఉంటే గురువారం సహకార నగర్ లో ఓ ప్రహరీ గోడ కూలిపోయింది. ఈ ఘటన లో ఐదుగురు అక్కడిక్కడే మృతి చెందారు. అగ్నిమాపకశాఖ, పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యల్ని చేపట్టారు. శిథిలాల కింద ఉన్న మృతదేహాలను వెలికితీసి పోస్టుమార్టం కోసం తరలించారు. పూణెళి గత పదిరోజులుగా కురుస్తున్న భారీవర్షాలు కురుస్తుండటంతో ప్రజలు నానా అవస్థలు పడుతునారు. సింహగడ్ రోడ్, ధనక్వాడి, బాలాజినగర్, అంబెగావ్, సహకర్ నగర్, కొల్హేవాడి,పురందర్, బారామతి, భోర్,హవేలి తహసీల్, వంటి పలు ప్రాంతాల్లో వరద నీరు భారీగా చేరుకుంది. దీంతో పూణెళి జిల్లా కలెక్టర్ నావల్ కిషోర్ రామ్ గురువారం నగరంలోని అన్ని స్కూల్స్, కాలేజీలకు సెలవు ప్రకటించామని కలెక్టర్ తెలిపారు. భారీవర్షాలకు వరదలు వెల్లువెత్తాయి. ముంబై నగరంలోని ఖర్ ప్రాంతంలో ఓ భవనం కూలిన ఘటనలో పదేళ్ల బాలిక మరణించింది. బాలిక మృతదేహాన్ని పోలీసులు వెలికితీశారు. భారీవర్షాల వల్ల పాత భవనాలు కూలిపోతుండటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. మరోవైపు అధికారులు అప్రమత్తంగా ఉంటూ పరిస్థితిని సమీక్షించాలని సూచించింది. రాష్ట్రంలోని ప్రాజెక్టులకు వరద నీరు పోటెత్తుతోంది. పురందర్, బారామతి, భోర్, హవేలిలో గురువారం సెలవు ప్రకటించారు. 150 ఇళ్లు దెబ్బతిన్నట్లు సమాచారం. సిబ్బంది సహాయక చర్యల్లో పాల్గొంటున్నాయి. తీర ప్రాంతాల్లో ఉన్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇదిలా ఉంటే.. వివిధ ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడ్డాయి. ఉపరితల ఆవర్తనం, ఉపరితల ద్రోణి ఒకేసారి రావడంతో క్యుములోనింబస్ మేఘాలు ఉధృతమే అనేకచోట్ల ఒకేసారి కుండపోత వర్షాలు కురుస్తున్నాయని అధికారులు తెలిపారు.

## గోదావరిలో మరో బోటు బోల్తా... అందరూ సేఫ్

రాజమండ్రి,సెప్టెంబర్26(ఆర్ఎన్ఎ): తూర్పుగోదావరి జిల్లా కచ్చులూరు వద్ద ఇటీవలే జరిగిన బోటు ప్రమాదంలో చనిపోయిన వారి మృతదేహాల కోసం గాలిస్తున్నఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది ప్రయాణిస్తున్న బోటు బోల్తా పడడం ఆందోళనను సృష్టించింది. ఈ గాలింపు చర్యల్లో భాగంగా బోటు బోల్తా పడినప్పటికీ, ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. గోదావరిలో నీటి ఉధృతి పెరగడంతో ఎన్టీఆర్ఎఫ్ సిబ్బంది ప్రయాణిస్తున్న బోటు ఒక్కసారిగా బోల్తాపడింది. కాగా, ఎలాంటి ప్రాణనష్టం జరుగలేదు, సిబ్బంది క్షేమంగా ఒడ్డుకు చేరుకున్నారు. దీంతో అక్కడున్నవారందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ నెల 15న ఆదివారం తూర్పుగోదావరి జిల్లా దేవిపట్నం మండలం కచ్చులూరు వద్ద బోటు బోల్తా పడిన సంగతి విదితమే. ఈ ప్రమాదంలో 27 మంది ప్రాణాలతో బయటపడగా మిగిలిన వారు జలసమాధి అయ్యారు. వారి కోసమే అప్పటి నుంచి గాలింపు చర్యలు చేపడుతున్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.